సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 203

శనివారం 8-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



ఐటీలో నియామకాలకు 6 నెలలు బ్రేక్

అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఐటీ కంపెనీలు నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఆరు నెలల పాటు హైరింగ్‌కు కాస్త విరామం ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలను చూస్తే ప్రతి త్రైమాసికంలోనూ నికర నియామకాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయని, రాబోయే రోజుల్లోనూ కొన్నాళ్ల పాటు ఇదే ధోరణి కొనసాగవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

13లో



కరోనాపై అప్రమత్తంగా ఉందాం

కోవిడ్ వ్యాప్తి పెరిగిపోతుండటంతో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది.

వివరాలు 6లో ▸



అగ్రస్థానంలో బాలీవుడ్ బాద్‌షా

టైమ్ మ్యాగజైన్ నిర్వహించిన ప్రభావశీల వ్యక్తుల జాబితాలో షారుఖ్‌ఖాన్ (57) అగ్రస్థానంలో నిలిచారు.

వివరాలు 6లో ▸



ఇజ్రాయెల్ వైమానిక దాడులు

దక్షిణ లెబనాన్, పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై హమాస్ శిబిరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు నిర్వహించింది.

వివరాలు 6లో ▸



6 వేలు దాటిన కోవిడ్ కేసులు

దేశ వ్యాప్తంగా 203 రోజుల తర్వాత 24 గంటల వ్యవధిలో కొత్తగా 6,050 కరోనా కేసులు నమోదయ్యాయి.

వివరాలు 6లో ▸

ఇంటింటా నీరాజనం

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఘనంగా ప్రారంభం

'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజల నినాదాలు



నంద్యాల జిల్లా బుక్కాపురంలో తన ఇంటి వద్ద అతికించిన సీఎం జగన్ స్టిక్కర్‌ను చూసి మనవడా.. మళ్లీ నువ్వే కావాలి అంటూ నమస్కరిస్తున్న వృద్ధుడు

- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ కార్యక్రమానికి శ్రీకారం
- తొలి రోజు 14 వేలకుపైగా సచివాలయాల పరిధిలో నిర్వహణ
- ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, గృహ సారథులు, వలంటీర్లకు ఆత్మీయ స్వాగతం
- 46 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి చేశారంటూ ప్రశంసలు
- పోటీ పడి 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చిన జనం
- రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని వర్గాల నుంచి స్వచ్ఛందంగా మద్దతు

మనవడా.. మళ్లీ నువ్వే సీఎం కావాలి

'మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి నాకు పింఛన్ వస్తోంది. ఇప్పుడు ఆయన కుమారుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ మొత్తాన్ని పెంచి ఇస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ పోతామన్న మాటను నిలుపుకున్నారు. ఎన్నికల ముందు చెప్పింది చెప్పినట్లు చేస్తున్నారు. ఇలాంటి నాయకుడే కదా.. మనకు కావాల్సింది' అని నంద్యాల జిల్లా మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు షేక్ మౌలాలి అన్నాడు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం ఆ గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఓ ఇంటి ముందు అంటించిన సీఎం స్టిక్కర్‌ను తదేకంగా చూస్తూ.. 'మనవడా.. సీఎంగా మళ్లీ నువ్వే కావాలి' అని చేతులు జోడించి ఆకాంక్షించాడు. – మహానంది

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: ఏ ఇంటికి వెళ్లినా ఆత్మీయ పలకరింపులు.. ప్రభుత్వ పనితీరుపై ఎవరిని కదిపినా హర్షాతిరేకాలు.. మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నది తమ ఆకాంక్షగా ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయాలని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ముల ఆశీర్వచనాలు.. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ఇంటి తలుపు, మొబైల్ ఫోన్‌కు వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్‌లను అతికించుకోవడానికి పోటీ పడ్డ అక్కచెల్లెమ్మలు.. 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, మద్దతు తెలిపిన వెంటనే సీఎం వైఎస్ జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ రావడంతో కేరింతలు.. వెరసి మా నమ్మకం నువ్వే జగన్.. అంటూ నినాదాలు.. ఇదీ వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి

మిగతా 2వ పేజీలో ▶

ఇక 'ఈ-పాఠశాల'

- విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక ముందడుగు
- వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి రానున్న కొత్త విధానం
- 4వ తరగతి నుంచి 9 వరకు ఈ-కంటెంట్‌ను సిద్ధం చేయిస్తున్న ప్రభుత్వం.. ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో చురుగ్గా కసరత్తు
- 2024–25లో సిలబస్ మార్పు అనంతరం పదో తరగతికి కూడా..



- వివరాలు 2లో



నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పరేడ్ గ్రౌండ్స్‌లో భారీగా ఏర్పాట్లు
- 2 గంటల టూర్.. 5 వేల మందితో భద్రత.. ఎత్తైన భవనాలపై రూఫ్ టాప్ వాచ్ ఏర్పాటు
- ప్రధాని పర్యటించే, ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

2లో

ప్రమాదం.. వారసత్వ రాజకీయాలకే.. ప్రజాస్వామ్యానికి కాదు!

హోం మంత్రి అమిత్ షా



➡ వారసత్వ రాజకీయాలు, కులవాదానికే ప్రమాదం తప్ప దేశ ప్రజాస్వామ్యానికి ఎటువంటి ప్రమాదం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కుల తత్వం, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు అనే మూడు అల్సర్లతో కాంగ్రెస్ పార్టీ భారత ప్రజాస్వామ్యాన్ని చుట్టుముట్టిందని ఆయన ఆరోపించారు.

- వివరాలు 6లో



ఎమ్మెస్పీకి మించి మార్కెట్ ధరలు

గతంలో విత్తుకునే సమయంలో ఉండే ధర పంటలు కోతకోసే నాటికి ఉండేది కాదు. దీంతో కాస్త మంచిరేటు వచ్చేవరకు మార్కెట్ గోదాముల్లో నిల్వచేసుకుని, 'రైతుబంధు' పథకం కింద రుణాలు తీసుకుని సాగుకోసం పెట్టిన అప్పులను తీర్చుకునేవారు. కానీ, నాలుగేళ్లుగా రాష్ట్రంలో పండే ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటలకు గతంలో ఎన్నడూలేని రీతిలో కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)లకు మించి మార్కెట్‌లో ధరలు పలుకుతున్నాయి. కల్లాల నుంచి నేరుగా కొనేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. ఈ వాస్తవాలను తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా ఈనాడు కట్టుకథలను అచ్చేస్తూ నిత్యం అభాసుపాలవుతోంది.

- వివరాలు 10లో

కేజీహెచ్‌లో సౌర వెలుగులు

విశాఖపట్నం: కేజీహెచ్‌లో దశలవారీగా సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో 270 కేవీ ద్వారా 32 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతుండగా.. తాజాగా మరో 120 కేవీతో సౌర విద్యుత్ ఉత్పాదన కోసం అధికారులు చేసిన ప్రతిపాదనకు కలెక్టర్ ఎ.మల్లికార్జున గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన రూ.80 లక్షల్లో సగం వాటాను సీఎస్సార్ నుంచి ఇవ్వడానికి కలెక్టర్ సూత్రప్రాయంగా అంగీకరించారు. మిగిలిన 50 శాతం నిధుల కోసం డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ (డీఎంఈ) అనుమతి కోరుతూ కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ లేఖ రాశారు. అనుమతి లభించిన వెంటనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి.. పనులు మొదలు పెట్టడానికి కేజీహెచ్ యంత్రాంగం సిద్ధంగా ఉంది. కేజీహెచ్‌లో మొత్తం 1152 పడకలు, ఆపరేషన్ల థియేటర్లు ఉన్నాయి. ఇటీవల కార్డియాలజీ విభాగం, ఐసీయూ(ఏ,బీ విభాగాలు), పిల్లల వార్డులో ఏసీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో నెలకు 4,50,700 యూనిట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందుకోసం నెలకు రూ.43 లక్షల నుంచి రూ.50లక్షల వరకు కేవలం విద్యుత్ కోసం ఖర్చు చేస్తున్నారు. వేసవిలో 5 లక్షల యూనిట్లకు చేరుకుంటుంది.





చిత్తూరులో 'రోగి సంబంధాల సేవ' కోర్సు చేస్తున్న విద్యార్థులు

నైపుణ్యమస్తు..

ఉద్యోగప్రాప్తిరస్తు!

'నిరుద్యోగం అనే మాట వినిపించకూడదు. పేదరికంతో ఏ ఒక్కరి చదువూ ఆగిపోకూడదు. చదువే మనం పిల్లలకు ఇచ్చే ఆస్తి. భవిష్యత్‌లో వారు కలెక్టరుగానో.. ఇంజినీరుగానో స్థిరపడితే ఆ ఇల్లు.. ఊరు.. జిల్లా.. రాష్ట్రం బాగుపడుతుంది. దానికోసం ఎంతైనా ఖర్చుచేస్తా..'నంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఇప్పుడు నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్లు నిర్వహిస్తూ వారి ఉద్యోగావకాశాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ సెంటర్
- ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 6,523 మందికి శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

పుత్తూరు రూరల్: యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పత్రి నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు అందుబాటులోకి తెచ్చింది. పదో తరగతి పాస్/ఫెయిల్ కనీస విద్యార్హత కలిగిన యువతీయువకులకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఇప్పటికే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 3,023 మంది శిక్షణ ఇవ్వగా.. అదులో జాబ్ మేళాల ద్వారా 1,650 మంది ఉద్యోగాలు పొందారు. తిరుపతి జిల్లాలో 3,500 మందికి శిక్షణ ఇవ్వగా, 1,850 మందికి ఉద్యోగాలు లభించాయి. ప్రస్తుతం ఈ స్కిల్ హబ్ సెంటర్లు ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో సెంటర్‌కు ఒక ఇన్‌చార్జి, కో-ఆర్డినేటర్, కోర్సుల మేరకు ట్రైనీలు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సుకు సంబంధించి ఒక్కో గ్రూపునకు 30 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.

చిత్తూరులో స్కిల్ కాలేజీ

ప్రభుత్వం ప్రతిజిల్లా కేంద్రంలో ఒక స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసింది. చిత్తూరు స్కిల్ కాలేజీలో 'రోగి సంబంధాల సేవా విధి నిర్వాహకులు' కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ కోర్సును అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువతీయువకులు అర్హులు. 6 నెలల ఉచిత శిక్షణా కాలంలో భోజనం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కోర్సు పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.

చిత్తూరు జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కోఆర్డినేటర్	సెల్ నెంబర్
నగరి (పుత్తూరు)	డేటా ఎంట్రీ ఆపరేటర్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్	రసూల్	63009 54441
గంగాధరనెల్లూరు (కార్వేటినగరం)	మీడియా కంటెంట్ డెవలపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్	అబ్దుల్	81425 09017
పూతలపట్టు	అసోసియేట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్.	ఫిరోజ్	63019 33565
కుప్పం	బ్యూటీ థెరపిస్టు, డేటా ఎంట్రీ	రాజా	90525 07933
పలమనేరు	ట్రైనీ బ్యూటీషన్, డేటా ఎంట్రీ	సిసింద్రీ	84658 30771
పుంగనూరు	స్యూయింగ్ మెషిన్ ఆపరేటర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్.	సుబ్రమణ్యం	77805 99208
చిత్తూరు	అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్, యూపీఎస్ సర్వీస్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, అసోసియేట్ డేటా ఎంట్రీ	చైతన్య	81219 84014

తిరుపతి జిల్లాలో అందుబాటులో ఉన్న కోర్సులు

నియోజకవర్గం	కోర్సులు	కాంటాక్ట్ నెంబర్
చంద్రగిరి	4 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్, 2 వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్ ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్	90593 97752
తిరుపతి	అసిస్టెంట్ ప్లంబర్, సర్వేయర్ ఎయిడ్ అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్	97004 13939
గూడూరు	అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేటివ్ ఎలక్ట్రీషియన్, ట్రైనీ బ్యూటీషియన్	86398 08782
వెంకటగిరి	ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్, సీఎన్‌సీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ	98664 20415
సూళ్లూరుపేట	ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, మోటార్ ఆర్క్ వెల్డింగ్	86399 15833
సత్యవేడు	సర్వీస్ టెక్నీషియన్, హోమ్ అప్లియన్స్, అసెంబ్లీ ఆపరేటర్-ఆర్ఏసీ, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్	91670 13413
శ్రీకాళహస్తి	కలంకారీ ఆర్టిస్ట్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ట్రైనీ బ్యూటీషన్ టైలరింగ్	79895 09540

యువత భవిష్యత్‌కు చక్కటి పునాది



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్కిల్ హబ్ సెంటర్లు నేటి యువత భవిష్యత్‌కు చక్కటి పునాది. చదువుకుంటున్నా, చదువును మధ్యలో ఆపేసిన యువతీయువకులకు ఉద్యోగాలను అందించే కల్పతరువు. తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీ, విశాఖపట్నంలో హైఎండ్ స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు కానున్నాయి. – ఎం.గుణశేఖర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, చిత్తూరు

చదువు మానేసిన వారికి వరం



చదువు మానేసి ఉద్యోగం లేని వారికి స్కిల్ హబ్ సెంటర్లు ఓ వరం. ఉచిత శిక్షణతో పాటు వారి ప్రాంతాల్లోనే ఉపాధిని పొందవచ్చు. డిగ్రీ చదువుతూ కూడా స్కిల్ కోర్సులను అభ్యసించవచ్చు. ప్రస్తుతం పుత్తూరులో 'అకౌంట్స్ ఎక్సిక్యూటివ్స్' కోర్సులో శిక్షణ ఇస్తున్నాం. డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– టీ.నరసింహులు, స్కిల్ హబ్ సెంటర్ ఇన్‌చార్జి, పుత్తూరు

ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది



రెండు నెలలుగా అకౌంట్స్ ఎక్సిక్యూటివ్‌గా శిక్షణ పొందుతున్నా. మంచి అనుభవం ఉన్న వారు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఇలా స్కిల్ సెంటర్లలో శిక్షణ పొంది ఉద్యోగం సంపాదించిన వారి సూచన మేరకే నేను ఇందులో జాయిన్ అయ్యాను. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మంచి ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నాను.

– నవీన్‌బాబు, విద్యార్థి, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, పైడిపల్లి గ్రామం, పుత్తూరు మండలం

ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తా



నేను డిగ్రీ పూర్తి చేశా. వలంటీర్ చొరవతో ఫ్యాషన్ డిజైనర్‌గా శిక్షణ పొందుతు న్నా. ఫిల్స్‌కట్, అంబ్రెల్లా వంటి పలు రకాల శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ విధానం మరెక్కడా లేదు. ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడాలనుకుంటున్నా.

– శిల్ప, విద్యార్థి, ఫ్యాషన్ డిజైనర్, పుంగనూరు




వైఎస్సార్‌జిల్లా కడపలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా


పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ మండలం వేలూరులో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి విడదల రజిని


పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఓ ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


ఒంగోలులోని గద్దలగుంటలో పి.సుజాత అనే మహిళ ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వడ్డిపాలెంలో ఒక ఇంటికి వెళ్లి స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మోడల్ కాలనీలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


కృష్ణా జిల్లా పెడన పట్టణంలోని 20వ వార్డులో గృహిణితో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేశ్


అనంతపురం జిల్లా శీబావి గ్రామంలో ఓ ఇంటికి స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


తిరుపతి ఎస్టీవీ నగర్‌లో గృహిణి అభిప్రాయాలను సేకరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

ఇంటింటా నీరాజనం


రాజమహేంద్రవరంలోని కృష్ణానగర్‌లో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను తన ఇంటికి తానే అతికించుకుంటున్న వృద్ధురాలు. చిత్రంలో ఎంపీ భరత్‌రామ్


వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ. పక్కన ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ సంజీవ్‌కుమార్

▶ మొదటి పేజీ తరువాయి

తొలి రోజున వచ్చిన స్పందన. గత 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు చేస్తున్న మేలును వివరించి.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 14 వేలకుపైగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించాయి.

ప్రతి ఇంటా ఎదురేగి ఆహ్వానం

సీఎం వైఎస్ జగన్ ప్రతినిధులుగా ఇంటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు, వలంటీర్లకు కుటుంబ సభ్యులు ఎదురేగి ఆహ్వానించారు. టీడీపీ సర్కార్‌కూ ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ కరపత్రాన్ని చదివి వినిపించినప్పుడు.. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తమతోపాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారనే మాట ప్రతి ఇంటా విన్పించింది. గత 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలతో తమకు అండదండగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారని అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలో స్లిప్పులలోని ఐదు ప్రశ్నలను గృహ సారథులు వినిపించినప్పుడు.. వైఎస్ జగన్ ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరిగిందని, మళ్లీ సీఎంగా వైఎస్ జగనే కావాలంటూ సమాధానాలు చెప్పి.. వాటిని నమోదు చేయించి, రసీదు తీసుకున్నారు. రసీదు తీసుకున్నాక గృహ సారథులు అడగక ముందే.. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. గృహ సారథుల వద్ద నుంచి వైఎస్ జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లను తీసుకుని.. ఇంటి తలుపునకు, మొబైల్ ఫోన్‌కు అతికించి.. 'జగనన్నే మా భవిష్యత్' అంటూ నినదించారు.

20వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం

'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతుంది. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.65 కోట్ల కుటుంబాల్లోని ఐదు కోట్ల మంది ప్రజలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు కలవనున్నారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ప్రారంభం

గత టీడీపీ సర్కార్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ మరోసారి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎంపీ సంజీవ్ కుమార్ తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్ సర్వే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ '1.65 కోట్ల ఇళ్లకి వెళ్లి ఈ సర్వే చేపడతాం. 7 లక్షలు మంది పార్టీ సైనికులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఈ సర్వే కోసం అందుబాటులో ఉంటారు. జగనన్న ప్రభుత్వానికి, గత టీడీపీ ప్రభుత్వానికి గల తేడాలను పోల్చి చెబుతారు' అని తెలిపారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. 'కుల, మత, పార్టీలకు అతీతంగా ఈ మెగా పీపుల్ సర్వే జరుగుతుంది. దేశంలో ఇలాంటి కార్యక్రమం జరగడం ఇదే మొదటిసారి. ఇంత వరకు ఇంత ధైర్యంగా ఏ ముఖ్యమంత్రి కూడా చేపట్టలేదు. తాను ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజాభిప్రాయం కోరటం మొదటిసారి ఏపీలోనే జరుగుతోంది' అని అన్నారు. ఎంపీ ఎస్. సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సీఎం జగన్ పేదల తరుపున యుద్ధం చేస్తున్నారు. సీఎం జగన్‌కు అందరూ అండగా ఉండి సామాజిక కుట్రలు తిప్పికొట్టాలి. ప్రజల నుంచి వచ్చిన ప్రధాన నినాదం 'మా నమ్మకం నువ్వే జగన్'. అందుకే ఈ నినాదాన్ని 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఒక ప్రధాన అంశంగా పెట్టాం. గత 46 నెలల్లో ప్రజల జీవితాల్లో, వారి జీవనశైలిలో వచ్చిన మార్పును కళ్లకు కట్టినట్టు చూపించడమే మా లక్ష్యం' అని వివరించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. 'ఇప్పటికే గడప గడపకూ తిరిగి జరిగిన అభివృద్ధి వివరించి చెబుతున్నాం. ఇప్పుడు జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వే కోసం ధైర్యంగా ప్రజల ముందుకు వెళుతున్నాం. ప్రతి తలుపు తడుతూ, ప్రతి గడప తొక్కుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తాం' అని తెలిపారు.

రాయలసీమ జిల్లాల్లో ఉత్సాహంగా..

- రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆలూరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి ఉషశ్రీ చరణ్, వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొన్నారు.
- గంగాధర నెల్లూరు నియోజకవర్గం శ్రీరంగరాజపురంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, పుంగనూరులోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నగరి నియోజకవర్గం వడమాలపేట మండలం పూడి గ్రామంలో మంత్రి ఆర్కే రోజా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఆయా జిల్లాల్లోని నియోజకవర్గాలన్నింటిలో కార్యక్రమం కొనసాగింది.

అంతటా అదే ఉత్తేజం..

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఒంగోలులోని గద్దలగుంటలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లు ప్రజల స్పందన తెలుసుకున్నారు.
- పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంటలో మంత్రి అంబటి, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, చిలకలూరిపేట మండలం వేమూరులో మంత్రి విడదల రజని పాల్గొన్నారు. మాచర్లలో ర్యాలీ నిర్వహించారు.
- గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం ఘనంగా మొదలైంది. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- బాపట్ల జిల్లా రేపల్లెలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రజలతో మమేకం అయ్యారు. వేమూరులో మంత్రి మేరుగ నాగార్జున కార్యక్రమంలో పాల్గొన్నారు.
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం అన్ని నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా మొదలైంది. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్ల గోడలు, తలుపులపై అంటించి ప్రజా మద్దతు కోరారు. పెడనలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, విజయవాడలో మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో హోం మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరంలో ఎంపీలు మార్గాని భరత్‌రామ్, పిల్లి సుభాష్ చంద్రబోస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రామచంద్రాపురంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- విజయనగరంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సాలూరులో డిప్యూటీ సీఎం రాజన్నదొర, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం, పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నేతలు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లారు.
- అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మోడల్ కాలనీలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, తుమ్మపాల పంచాయతీ పరిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. విశాఖ నగరంలో పార్టీ ఎమ్మెల్యేలు, శ్రేణులు ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాయి.

ప్రజల స్పందన తెలుసుకునేందుకే..

- మంత్రి అంబటి రాంబాబు

రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అందించిన సంక్షేమ పథకాలపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం, ఏ పార్టీ చేయని విధంగా.. ప్రజా స్పందన కోసం వారి వద్దకే వెళ్తున్నామని చెప్పారు. 'నేను కూడా నకరికల్లు మండలం కుంకలగుంట, రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామాలలో పర్యటించాను. ప్రజల స్పందన సంతోషకరంగా ఉంది. రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది. ప్రజల అనుమతితోనే తలుపుకు, సెల్ ఫోన్‌కు స్టిక్కర్ అంటిస్తున్నాం' అని చెప్పారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం: మంత్రి రజిని

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వెళ్లి ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై ఐదు అంశాలకు సంబంధించి ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేసుకుంటారని తెలిపారు. గత ప్రభుత్వ అరాచకాలను, అప్పట్లో ప్రజలు పడిన ఇబ్బందులను, ప్రజలు ఎలా మోసపోయారో కూడా వివరిస్తారని చెప్పారు. నవరత్నాలు పేరుతో హామీలు ఇచ్చి, వాటిని అతి తక్కువ సమయంలో అమలు చేసి ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లేలా చేసిన ముఖ్యమంత్రి ఈ దేశంలో ఒక్క జగనన్నే కనిపిస్తారని చెప్పారు. చిలకలూరిపేట నియోజకవర్గం వేదికగా 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ

నేడు హైదరాబాద్‌కు ప్రధాని

- సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైలు ప్రారంభోత్సవం
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు



సాక్షి, హైదరాబాద్: పలు రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, ఎయిమ్స్–బీబీనగర్‌లో అభివృద్ధి పనులు, సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ రైలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం ప్రధాని నరేంద్ర మోదీ శనివారం హైదరాబాద్ చేరుకోనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళతారు. అక్కడ సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారు. తర్వాత మధ్యాహ్నం 12.15 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇందులో భాగంగా రిమోట్ ద్వారా వివిధ ప్రాజెక్టులకు సంబంధించి శిలా ఫలకాలను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సికింద్రాబాద్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. కాగా ప్రధాని కార్యక్రమానికి తెలంగాణ సీఎం కేసీఆర్ హాజరుకాబోరని బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్ తెలిపారు. మరోవైపు ప్రధాని రాకను పురస్కరించుకుని శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాని ఉదయం 11.30కు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నప్పటి నుంచి తిరిగి మధ్యాహ్నం 1.30కి తిరిగి వెళ్లే వరకు మోదీ పర్యటించే ప్రాంతాలు, మార్గాల్లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్)తోపాటు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు, పోలీసులు కలిపి ఐదు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కొంతకాలం నుంచి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రస్థాయికి చేరడం, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను ఈడీ విచారించడం, పదో తరగతి పేపర్ లీక్ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రధాని పర్యటన సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

ఇక 'ఈ–పాఠశాల'

వచ్చే ఏడాది నుంచి అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: విప్లవాత్మక సంస్కరణలతో విద్యా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేస్తోంది. ఇప్పటికే బైజూస్ ద్వారా స్మార్ట్ ఫోనుల్లో, ట్యాబుల్లో ఈ–కంటెంట్ అందిస్తున్న ప్రభుత్వం ఇక నుంచి ఈ–పాఠశాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ–కంటెంట్‌ను అందించనుంది. ఇందుకోసం పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకంగా ఈ–పాఠశాల యాప్‌ను రూపొందిస్తోంది. ఈ కొత్త విధానం వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, కింది తరగతుల్లో స్మార్ట్ టీవీల ద్వారా ప్రభుత్వం డిజిటల్ విద్యాబోధన అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ తరగతులకు అవసరమైన ఈ–కంటెంట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించడానికి పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా 4వ తరగతి నుంచి ఈ–కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్.. ఇలా అన్ని సబ్జెక్టుల్లోనూ ఈ–కంటెంట్‌ను రూపొందించే పనిలో ఎస్‌సీఈఆర్‌టీ నిమగ్నమైంది. ప్రస్తుతం 4వ తరగతి నుంచి నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు బైజూస్ సంస్థ ద్వారా కంటెంట్ అందిస్తున్నారు. ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా ఎస్‌సీఈఆర్‌టీ అదే తరహాలో ఈ–కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు మాత్రమే కాకుండా లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో కూడా రూపొందిస్తోంది. పాఠ్యప్రణాళికలను రూపొందించేది ఎస్‌సీఈఆర్‌టీయే కాబట్టి భవిష్యత్తులో బైజూస్ సంస్థ ఉన్నా, లేకున్నా విద్యార్థులకు ఇబ్బంది రాకుండా ప్రభుత్వం ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఈ– కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. దీన్ని ఏపీ ఈ–పాఠశాల, యూట్యూబ్, దీక్షా ప్లాట్‌ఫారం, ఐఎఫ్‌బీ ప్లాట్‌ఫారం, పీఎం ఈ–విద్య (డీటీహెచ్ చానెల్)లో అందుబాటులో ఉంచుతారు. ఈ నేపథ్యంలో ఒకే రకమైన కంటెంట్ ఉండేలా.. ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎవరికి నచ్చినట్లు వారు ఈ–కంటెంట్‌ను రూపొందించి యూట్యూబ్‌లో పెడుతున్నారు. దీనివల్ల విద్యార్థులు కొంత సంశయానికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే అన్ని అధికారిక చానెళ్లలో ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఈ–కంటెంట్‌ను అందుబాటులో ఉంచనుంది.

బైజూస్ ఈ–కంటెంట్ ఉన్నా..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అందుబాటులో ఉంది. అయితే ఇది నాన్ లాంగ్వేజెస్ (మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్)కు మాత్రమే పరిమితమైంది. విద్యార్థులు స్మార్ట్ ఫోన్ల ద్వారా ఈ–కంటెంట్‌ను అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించింది. వీరు 10వ తరగతి వరకు ఈ–కంటెంట్ పాఠ్యాంశాలను ట్యాబుల్లోనే చదువుకోవచ్చు. అయితే బైజూస్ ద్వారా లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ–కంటెంట్ లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్ఈసీఆర్‌టీ) ద్వారా లాంగ్వేజ్ సబ్జెక్టులకు (తెలుగు, హిందీ, ఇంగ్లిష్) కూడా ప్రభుత్వం ఈ–కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. ఇందులో భాగంగా ముందు 8వ తరగతిలో లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ–కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియను చేపట్టిన ఎస్‌సీఈఆర్‌టీ మరో రెండు నెలల్లో దీన్ని పూర్తి చేయనుంది. ఆ తర్వాత వరుసగా 9, 7, 6 తరగతులకు రూపొందిస్తారు. 10వ తరగతికి 2024–25లో సిలబస్ మారుస్తామని.. ఆ తర్వాత ఈ–కంటెంట్‌ను రూపొందిస్తామని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు వివరించారు. వచ్చే ఏడాది నాటికి 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ–కంటెంట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగానే పాఠ్యాంశాలు

రాష్ట్రంలో సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నందున ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగా రాష్ట్రంలోనూ పాఠ్యాంశాలు ఉండేలా ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టింది. కేవలం మన రాష్ట్రానికి సంబంధించిన అంశాలనే విద్యార్థి నేర్చుకుంటే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో వెనుకబడే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం నీట్, జేఈఈ వంటి పరీక్షలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఆధారంగానే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు అలాంటి పరీక్షల్లోనూ మంచి విజయాలు సాధించేలా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ఈ–కంటెంట్ రూపకల్పనలో యథాతథంగా అనుసరిస్తున్నారు. జాతీయ కరిక్యులమ్‌ను అనుసరించి జాతీయ అంశాలను బోధించేటప్పుడు మన రాష్ట్ర అంశాలను ఆసరాగా చేసుకొని చెప్పేలా టీచర్లకు సూచనలు సైతం చేశారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో గురువారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.4	25.6
కర్నూలు	39.3	27.1
కడప	38.6	26.1
నంద్యాల	38.0	24.6
మార్కాపురం	38.0	23.0
ఏలూరు	37.0	24.0
విజయవాడ	37.0	24.0
తిరుపతి	37.0	22.0
విశాఖపట్నం	35.6	23.8
నెల్లూరు	35.5	26.9
విజయనగరం	35.0	26.0
అనకాపల్లి	34.5	25.0
శ్రీకాకుళం	34.0	26.0
తెలంగాణలో..		
నల్లగొండ	38.5	22.0
రామగుండం	35.8	24.4
హైదరాబాద్	33.7	23.2



బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా గెద్దనపల్లికి చెందిన వెంకటరమణకు కాకినాడ ఆస్పత్రిలో పింఛను ఇస్తున్న వలంటీర్ శిరీష

98.56 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 98.56% మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తయింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. శుక్రవారం సాయంత్రం వరకు 62,51,506 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,722.82 కోట్లు అందజేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. శనివారం కూడా పంపిణీ కొనసాగుతుందన్నారు.



గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన రమణయ్యకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు కృష్ణవేణి



తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నాగరత్నమ్మకు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు

మానవాళికి డెంగీ ముప్పు!



వాతావరణ మార్పులతో దోమల వ్యాప్తి

- 129 దేశాలపై డెంగీ ప్రభావం!
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, అమరావతి

ప్రపంచవ్యాప్తంగా మానవాళికి డెంగీ ముప్పు పొంచి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు, వైరస్‌ల వ్యాప్తి పెరగడమే ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల వెల్లడించింది. దశాబ్దకాలంగా డెంగీ, జికా, చికున్ గున్యా వంటి ఆర్బోవైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లు భారీగా పెరిగాయని ప్రకటించింది. ఏడాదికి 100 మిలియన్ల నుంచి 400 మిలియన్‌ల వరకు ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం జనాభాలో దాదాపు సగం మందికి డెంగీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడించిన కొన్ని ముఖ్యమైన వివరాలు...

- ▲ అటవీ నిర్మూలన, పారిశుధ్యం, పట్టణీకరణ, నీటిపారుదలలో సమస్యలు దోమలవ్యాప్తికి ప్రధాన కారణం.
- ▲ ముఖ్యంగా అవపాతం(వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ద్రవీకరించడం), ఉష్ణోగ్రత పెరుగుదల, అధిక తేమ వంటివి దోమల అవాసాలకు అనుకూలంగా ఉన్నాయి.
- ▲ ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో డెంగీ కేసులు సుమారు 0.5 మిలియన్ నమోదవగా, 2019 నాటికి 5.2 మిలియన్లకు పెరిగాయి. 2023లోనూ ఇదే ఉధృతి కొనసాగుతోంది.
- ▲ ఈ ఏడాది దాదాపు 129 దేశాలు డెంగీ బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో డెంగీ వ్యాప్తి కనిపిస్తోంది.
- ▲ ఈ ఏడాది మార్చి చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 4,41,898 డెంగీ కేసులు నమోదవగా, 119 మంది మరణించారు.
- ▲ చికున్ గున్యా దాదాపు అన్ని ఖండాల్లో విస్తరించింది. ప్రస్తుతం సుమారు 115 దేశాల్లో దాని ప్రభావం ఉంది.

రాష్ట్రంలో పుష్కలంగా విద్యుత్

- ఈ ఏడాదిలోనే ఎన్‌టీటీపీఎస్‌లో అందుబాటులోకి 800 మెగావాట్లు
- పోలవరం వద్ద 960 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిక్ యూనిట్లు
- ఇంధన డిమాండ్ తీర్చడానికి థర్మల్ ప్లాంట్ల ఆధునికీకరణ
- అధికారులతో సమీక్షలో ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు



సాక్షి, అమరావతి: రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరింత విద్యుత్ అందుబాటులోకి వచ్చి వినియోగదారులకు పుష్కలంగా సరఫరా అవుతుందని, ఈ మేరకు కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభం కానున్నాయని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో) లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం ఏపీజెన్‌కో ఎండీగా విద్యుత్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సంస్థ డైరెక్టర్లు, విద్యుత్ ఉద్యోగసంఘాల నాయకులు, పలువురు ఉద్యోగులు ఆయన్ని అభినందించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడానికిగాను థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని వేగవంతం చేయడానికి ప్లాంట్ల ఆధునికీకరణకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడానికి సిబ్బంది కలిసి పనిచేయాలని కోరారు. రానున్న నెలల్లో ఇంధన డిమాండ్ రోజుకి 250 మిలియన్ యూనిట్లను దాటుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. దాన్ని అందుకోవడానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇంధన డిమాండ్ పెరగడం చాలా మంచి సంకేతమని, ఇది రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలను సూచిస్తుందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి, అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ నిర్వహణలో జాతీయస్థాయిలో అత్యుత్తమ సంస్థగా అవతరించేందుకు ఏపీజెన్‌కో అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్) స్టేజ్–2 (1,600 మెగావాట్లు) ప్రస్తుతం పనిచేస్తోందని, వేసవి డిమాండ్‌ను తీర్చేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టీటీపీఎస్)లో మరో 800 మెగావాట్ల యూనిట్ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్‌లో 40 నుంచి 45 శాతం వరకు ఏపీజెన్‌కో ద్వారానే అందుతోందన్నారు. పోలవరం వద్ద ఒక్కొక్కటి 80 మెగావాట్ల సామర్థ్యమున్న 12 హైడ్రో ఎలక్ట్రిక్ యూనిట్లను (మొత్తం 960 మెగావాట్లు) కూడా జెన్‌కో ఏర్పాటు చేస్తోందని చెప్పారు. దశల వారీగా ప్రాజెక్టుతో పాటు ఇవి కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా దిగువ సీలేరు వద్ద 115 మెగావాట్ల రెండు అదనపు యూనిట్ల నుంచి వచ్చే ఏడాది జూలైలో ఉత్పత్తి మొదలుపెట్టాలని ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పథకం ప్రకారమే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్య

- తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని మృతుడి తమ్ముడిపై నిందితుడికి అనుమానం
- ఈ క్రమంలో సంధి ప్రయత్నంలో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను వైరల్ చేశాడని హత్య
- ప్రమాద ఘటనగా చిత్రీకరించేందుకు నిందితుల విఫల యత్నం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ వెంకటరావు
- నలుగురు నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ వెంకటరావు

చంద్రగిరి(తిరుపతి జిల్లా) : సంచలనం సృష్టించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు సజీవ దహనం కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు రిపుంజయతో పాటు మరికొందర్ని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ ఎస్పీ వెంకటరావు చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దిగువ బ్రాహ్మణపల్లికి చెందిన రిపుంజయ భార్యతో మృతుడు నాగరాజు తమ్ముడు పురుషోత్తం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో నాగరాజును హత్య చేసి, కారుతో సహా దహనం చేశారు. తన భార్యతో పురుషోత్తం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో గతంలో పురుషోత్తం హత్యకు రిపుంజయ కుట్ర పన్నారు. విషయం తెలుసుకున్న నాగరాజు.. తమ్ముడిని బెంగళూరుకు పంపాడు. రిపుంజయ, అతని అన్న చాణక్యప్రతాప్‌తో సంధి కుదుర్చుకునేందుకు నాగరాజు పలుమార్లు యత్నించాడు. ఈ క్రమంలో రిపుంజయ తనతో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను నాగరాజు గ్రామంలోని పెద్దలకు వినిపించాడు. దీనిని అవమానంగా భావించిన రిపుంజయ, అతని అన్న చాణక్యప్రతాప్ కలిసి నాగరాజును చంపేందుకు కుట్ర పన్నారు. ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం గోపినాథ్‌రెడ్డి అనే వ్యక్తి ద్వారా నాగరాజును చంద్రగిరికి పిలిపించారు. రిపుంజయ బంధువులైన బొప్పరాజుపల్లికి చెందిన రమేష్, కుమార్‌లను పిలిపించి ఆపై అందరూ కలిసి చంద్రగిరి సమీపంలోని ఓ ప్రాంతంలో నాగరాజుకు మద్యం తాగించారు. అక్కడ నుంచి నాగరాజును కారులో బొప్పరాజుపల్లి కనుమ వద్దకు తీసుకెళ్లి టవల్‌తో ఊపిరాడకుండా చేసి చంపేశారని ఏఎస్పీ తెలిపారు. ఆ తర్వాత మృతదేహాన్ని కారు ముందు సీట్లో ఉంచి పెట్రోల్ పోసి నిప్పంటించి, అక్కడ నుంచి కారును లోయలోకి తోసి, హత్యను ప్రమాద ఘటనగా చిత్రీకరించేందుకు యత్నించారు. అయితే బండరాయి అడ్డుగా రావడంతో వారి ప్రయత్నం విఫలమైంది. కారుకు నిప్పంటించే క్రమంలో రమేష్ అనే వ్యక్తి ఎడమ కాలిపై పెట్రోల్ పడి గాయమైనట్లు గుర్తించామని ఏఎస్పీ చెప్పారు. నిందితులైన ఏ1 రిపుంజయ, ఏ3 గోపినాథ్‌రెడ్డి, ఏ4 రమేష్, ఏ5 కుమార్‌లను గురువారం అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ఏ2 నిందితుడు చాణక్యప్రతాప్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు ఏఎస్పీ వెంకటరావు వివరించారు.

'వేసవి' ఉపశమనానికి సర్కారు కార్యాచరణ

కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి : వేసవిలో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమన చర్యలు కలిగించేందుకు కార్యాచరణ రూపొందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలను ఆదుకోవడానికి జిల్లాలు, మండల స్థాయిలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. వాతావరణ శాఖ సమాచారం మేరకు రాష్ట్రంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే కొంత ఎక్కువగా ఎండల తీవ్రత ఉంటుందని, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ స్థాయిలో ఎండలు ఉంటాయని సీఎస్ తెలిపారు. దీనిని ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారిని ఏర్పాటుచేసి క్రమం తప్పకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీకి తెలియజేయాల్సిందిగా కలెక్టర్లకు సీఎస్ సూచించారు.

అనంతలో పేలుడు.. యువకుడి మృతి

- కెమికల్ డబ్బా మూత తీస్తుండగా ఘటన
- గాల్లోకి ఎగిరి ఛిద్రమైన శరీరం



మృతుడు సతీష్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలో శుక్రవారం ఓ కెమికల్ డబ్బా మూత తీస్తుండగా జరిగిన భారీ పేలుడు ఘటనలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. పేలుడు ధాటికి శరీరం గాల్లోకి ఎగిరిపడి ఛిద్రమయ్యింది. వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన మేరకు.. నగరంలోని కేకే అపార్టుమెంట్ యజమాని ఇస్మాయిల్ స్థానిక ఆర్టీవో కార్యాలయ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన పెయింట్స్ తయారీ పరిశ్రమ నడిపేవారు. దీన్ని పదేళ్ల క్రితం మూసేశారు. అప్పట్లో కెమికల్స్ ఉన్న కొన్ని ప్లాస్టిక్ డ్రమ్ములను అలాగే వదిలేశారు. ముందు భాగంలో డైనింగ్, డ్రెస్సింగ్ టేబుళ్ల తయారీ పరిశ్రమ నడుపుతున్నారు. మూసేసిన పెయింట్ పరిశ్రమ షెడ్లను నాలుగు రోజుల క్రితం వేరే వ్యక్తులు అద్దెకు అడిగారు. దీంతో షెడ్లు శుభ్రం చేయించిన ఇస్మాయిల్..అందులోని కెమికల్ డ్రమ్ములను బయట పెట్టించారు. మూడు రోజులుగా వాటిని పట్టించుకోలేదు. శుక్రవారం తన అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన చాకలి సతీష్(34)ను పిలిచి డ్రమ్ముల్లోని ద్రవాన్ని పారబోసి వాటిని గుజిరీకి వేసుకోవాలని సూచించారు. దీంతో బయట ఉన్న డ్రమ్ముల్లో ఒకటి తీసుకుని మురికి కాలువ వద్దకు తీసుకెళ్లి మూత తీస్తుండగా భారీ పేలుడు శబ్దం వచ్చింది. పది అడుగుల ఎత్తు వరకు గాల్లోకి ఎగిరి సతీష్ శరీరం ఛిద్రమైపోయింది. వంద అడుగుల దూరంలోని ఇళ్లపై, రహదారిపై శరీర భాగాలు చిన్నచిన్న ముక్కలుగా విసిరేసినట్లు పడ్డాయి. 40 అడుగుల దూరంలో రహదారికి అటువైపుగా మొండెం లేని దేహపు రక్తపు ముద్ద పడింది. ప్రధాన రహదారి సహా సమీప ప్రాంతమంతా రక్తసిక్తంగా మారింది. పేలుడు సమయంలో అదే ఆవరణలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు యువకులు వుడ్‌వర్క్ చేస్తున్నారు. వారిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా..మృతుడు సతీష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ రవిశంకరరెడ్డితో పాటు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. హైడ్రోజన్ సల్ఫైడ్ విడుదల కావడం లేదా కెమికల్ రియాక్షన్ వల్ల పేలుడు సంభవించి ఉండొచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నిబంధనల మేరకే టెండర్లు

- 'ఇష్టులకే ఇచ్చేశారు' అనడం అవాస్తవం
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి

సాక్షి, అమరావతి: నిబంధనల మేరకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, 'ఇష్టులకే ఇచ్చేశారు' అని ఈనాడులో రాసిన కథనంలో వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విధాలుగా ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రక్రియ గైడ్‌లైన్స్ పాటిస్తూ రివర్స్ ఆక్షన్ చేసి ప్రైస్ నెగోషియేషన్ ద్వారా బిడ్డర్‌ను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇది ఒక సంస్థకి అనుకూలంగా చేయడం అనే ఆరోపణ నిరాధారమైదని ఆయన కొట్టిపడేశారు. దీనిపై ఇప్పటికే అనేక పర్యాయాలు వివరణ, స్పష్టత ఇచ్చినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఇదే విషయంపై పదేపదే తప్పుడు కథనాలు ప్రచురించడం సమంజసం కాదని పచ్చ పత్రికను ఆయన హెచ్చరించారు.

కిడ్నీ బాధితులకు అండగా..!

- శ్రీకాకుళం రిమ్స్‌కు మరో మూడు డయాలసిస్ యంత్రాలు
- అతి త్వరలో అందుబాటులోకి సేవలు
- ఇప్పటికే కీలక సేవలందిస్తున్న దయాలసిస్ కేంద్రం



దయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ బాధితులు

శ్రీకాకుళం: కిడ్నీ రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో 20 పడకల డయాలసిస్ కేంద్రం పనిచేస్తుండగా, దీని ద్వారా ప్రతి రోజు 50 మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ వైద్య నిపుణులు రిమ్స్‌లో అందుబాటులో ఉండటంతో కిడ్నీ రోగులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. ప్రైవేటుగా డయాలసిస్ చేయించుకునేందుకు రూ.6 వేలు నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు.

మరో మూడు యంత్రాలు సిద్ధం..

రిమ్స్‌లో త్వరలోనే మరో మూడు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఐసీఐసీఐ బ్యాంకు ఈ యంత్రాలను సమకూర్చింది. వీటిని అమర్చేందుకు అవసరమయ్యే గదులను, పడకలను రిమ్స్ అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు ఒక ఆర్వో ప్లాంట్, మరికొన్ని కెమికల్స్ అవసరం కావటంతో రూ.8లక్షలు మంజూరు చేయాలని జిల్లా అధికారులకు నివేదించారు. ఈ మూడు యంత్రాలు అందుబాటులోకి వస్తే రోజుకు మరో పది మందికి అదనంగా డయాలసిస్ సేవలు అందించే అవకాశం లభిస్తుంది.

పలాస రీసెర్చ్ కేంద్రంలో..

ఉద్దానం ప్రాంతంలో కొన్ని దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధి ప్రబలుతుండటంతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రంతో పాటు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసే పనులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇప్పుడు నిర్మాణ పనులు పూర్తయి మరో రెండు నెలల్లో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీకి రాష్ట్ర స్థాయిలో ఇంటర్వ్యూలు కొద్దిరోజుల క్రితమే పూర్తయ్యాయి. టెక్నీషియన్లు, గుమస్తాలు, సెక్యూరిటీ గార్డులు, ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు మరికొన్ని విభాగాల్లో పోస్టుల భర్తీకి జిల్లా స్థాయిలో వారం రోజుల క్రితమే నోటిఫికేషన్ విడుదలైంది. మరో వారం రోజులు ఎంపికలు పూర్తి చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇవి పూర్తయితే పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రత్యేక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలతో పాటు డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. గత ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తుల పట్ల నిర్లక్ష్యం వహించి సర్వేలతోనే కాలయాపన చేసింది. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పరిశోధనలు చేస్తూనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంపై కిడ్నీ రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే సేవలు

రిమ్స్ ఆస్పత్రిలో త్వరలోనే మరో మూడు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు పూర్తయితే యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

– డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్, శ్రీకాకుళం



త్వరలో అందుబాటులోకి రానున్న కిడ్నీ దయాలసిస్ కొత్త వార్డు

చేపకు గడ్డుకాలం

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆక్వాలో చుట్టుముడుతున్న వ్యాధులు



కైకలూరు: అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా సాగు సతమతమవుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాలు చేపల చెరువులు, 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. చేపల సాగులో నీటి ఉష్ణోగ్రత ముఖ్యం. 30 సెంటిగ్రేడ్ కంటే ఎక్కువగా ఉంటే చేపలపై ఒత్తిడి పెరిగి వ్యాధి నిరోధకశక్తి కోల్పోతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో శంకుపూత, పొట్ట ఉబ్బు వ్యాధి, తాటాకు తెగులు, ఆక్సిజన్ లేమి సమస్య, ఎర్ర మచ్చల వ్యాధి రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వీటి లక్షణాలు, నివారణను కై కలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.భవిత వివరించారు.

శంకుపూత..

ఇది చేపల శ్వాసక్రియను దెబ్బతీసే భయంకర వ్యాధి. మిక్సోబోలాన్ అనే పరాన్నజీవి వల్ల ఇది వ్యాపిస్తుంది. ఈ పరాన్నజీవులు చేప ఆహారనాళం, రక్తనాళం, శంకుల్లో సిద్ధ బీజాలుగా ఏర్పడతాయి. ఇవి పెరిగి తెలుపు, పసుపు రంగులో బొడిపెలవలే కనిపిస్తాయి. చేపశంకుల్లో ఎక్కువ సంఖ్యలో అక్రమించి శ్వాస వ్యవస్థను దెబ్బతీసి మృత్యువాత పడేలా చేస్తాయి. ఈ వ్యాధి సోకిన చేపలు నీటిపైకి ముట్టెలు ఎత్తి ఆక్సిజన్ పీల్చుకోడానికి ప్రయత్నిస్తాయి. దీనిని గుర్తించగానే ఎకరం చేపల చెరువులో క్విక్‌లైమ్ 100 నుంచి 150 కేజీల చొప్పున వాడాలి.

తాటాకు తెగులు

వేసవిలో ఎక్కువగా వచ్చే వ్యాధి ఇది. దీనినే కాలుమ్నారిస్ వ్యాధి అంటారు. ఇది ఎక్కువగా చేపతోక భాగం, మొప్పలకు సోకుతుంది. చేప శరీరం, శంకు భాగం తొలిచివేయడం వల్ల చేప శంకులు తాటాకు రంగులోకి మారతాయి. ఈ వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు చేప శరీరంపై పసుపు, బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. చెరువులో చేపలు భారంగా ఈదుతాయి. ఈ వ్యాధి సోకినప్పుడు ఒక టన్ను చేపలకు డాక్సిసైక్లిన్(2శాతం) రోజుకు 100 గ్రాముల చొప్పున 6 నుంచి 9 రోజులు చెరువు నీటిలో కలపాలి. వెంటనే చెరువు నీటి పరీక్షలు చేయించాలి. తాటాకు తెగులు అని అనుమానం వచ్చిన వెంటనే ల్యాబ్‌లో పరీక్షలు చేయించడం ఉత్తమం.

రెడ్ డిసీజ్ వ్యాధి

వేసవిలో ఎక్కువగా వచ్చే బాక్టీరియా వ్యాధి చేప ఎర్రగా మారే వ్యాధి(రెడ్ డీసీజ్). ఈ వ్యాధి లక్షణాలతో శరీరం ఎర్రబారుతోంది. కళ్ళలో రక్తపు చమరింపు కనిపిస్తుంది. మొప్పల అడుగున ద్రవం చేరుతుంది. ప్రేగులు ఖాళీగా ఉండి, పైన కొవ్వు కూడా ఎర్రబడుతుంది. చేప చనిపోయే ముందు నీటి ఉపరితలం దగ్గర గుండ్రంగా లేక క్రమ రహితంగా ఈదుతుంది. ఈ వ్యాధిని గమనించిన వెంటనే నిపుణల సలహాతో ఎంపిక చేసిన యాంటీ బయాటిక్స్ 8–10 గ్రాములు 100 కేజీల చేపలకు మేతలో కలిపి 7 నుంచి 10 రోజులు వాడాలి. నీటిలో బ్యాక్టీరియా సాంద్రత తగ్గించడానికి అయోడిస్, బీకేసీ, బ్రోమిస్ వంటివి 500 మిల్లీగ్రాముల నుంచి 1 లీటరు ఎకరాకు వాడాలి.

పొట్ట ఉబ్బు వ్యాధి

ఈ వ్యాధిని హెమోరేజిక్ సెప్టిసీమియా అని పిలుస్తారు. ఎయిరో మోనాస్, సూడోమోనాస్ జాతుల బ్యాక్టీరియా కారణంగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన చేప ఉదర కుహరం, పేగులు పసుపు, ఎరుపు రంగులో ఉంటాయి. చెడు ద్రవంతో నిండి పొట్ట ఉబ్బినట్లు కనిపిస్తుంది. చేపను గట్టిగా నొక్కితే పాయువు నుంచి ద్రవం కారుతుంది. ఈ వ్యాధి సోకిన చెరువులో 2 నుంచి 5 శాతం బ్రోమిన్‌ను ఎకరానికి లీటరు చొప్పున చల్లాలి. నిపుణుల సలహాతో ఇతర వాటర్ శానిటైజర్స్ కూడా వాడొచ్చు. పొట్ట ఉబ్బు వ్యాధి సోకిన చేపల శరీరం, మూతి వద్ద ఎరుపు మచ్చలు కనిపిస్తాయి. ఇటీవల కాలంలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది.

ఆక్సిజన్ లేమి సమస్య

ప్రస్తుతం ఆక్వారంగాన్ని కుదిపేస్తున్న సమస్య ఆక్సిజన్ లేమి. అప్పటివరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడితే చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. దీంతో ఒక్కసారిగా వేల చేపలు మృత్యువాతపడతాయి. ఏటా ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉత్పన్నం అవుతోంది. ఈ వ్యాధి సోకితే 100 మిల్లీలీటర్ల డెల్టామెత్రిన్‌ను కలిపి చల్లాలి. రోజుకు టన్ను మేతలో 60 నుంచి 80 కేజీల ఉప్పు కలిపి 5 నుంచి 8 రోజులు చల్లాలి. మేతలో ఆల్బెండజల్ వంటి మందులను తగు నిష్పత్తిలో కలిపి 4 నుంచి 5 రోజులు చల్లినా ప్రయోజనం ఉంటుంది.

రైతులు పాటించాల్సి సూచనలు

- ▲ నీటి ఉష్ణోగ్రత అనుకూల స్థాయిలో ఉండడానికి నీటి లోతు కనీసం 5 అడుగులు ఉండాలి.
- ▲ ఆక్సిజన్ లోటు ఏర్పడుతున్నట్లు గమనిస్తే రాత్రి 12 గంటల నుంచి ఉదయం ఎండ వచ్చే వరకు ఏరియేటర్లు ద్వారా లేదా చెరువులోని నీటిని పంపు ద్వారా రీసర్కులేషన్ చేయడం ద్వారా ఆక్సిజన్ ఉ త్పత్తిని పెంచవచ్చు.
- ▲ నీటి సెలైనిటీని పరీక్షించి 3 పీపీటీ కంటే ఎక్కువ కాకుండా చూడాలి. సెలైనిటీ ఎక్కువైతే మంచి నీటిని చెరువులోకి తోడాలి.
- ▲ ల్యాబ్‌లో మేతలు, మట్టి పరీక్షలు చేయించాలి.
- ▲ సేంద్రీయ, రసాయన మందుల వాడకం తగ్గించాలి.
- ▲ నిషేధిత యాంటీబయాటిక్స్ వాడకూడదు.
- ▲ 15 రోజులకు ఒకసారి నీటి పరీక్ష చేయించాలి.

ఇన్నర్ రింగ్‌కు ముందడుగు

- ఫేజ్ మూడో దశకు రంగం సిద్ధం
- పెద్ద పలకలూరు నుంచి శిల్పారామం వరకు...
- మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులు
- యూబీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు టెండర్..
- 4.21 కిలో మీటర్లకు 3.30 కిలోమీటర్ల వద్ద నిలిచిన పనులు
- త్వరలో పనులు ప్రారంభం....

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలోని మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ పనులు పూర్తి చేసేందుకు రంగం సిద్ధం అయింది. ఫేజ్ 3 పనుల్లో ముందడుగు పడింది. స్వర్ణ భారతీనగర్ శిల్పారామం నుంచి పెద్దపలకలూరు వరకు రోడ్డు నిర్మించనున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. బీటీ రోడ్డుతో పాటు కల్వర్టులు, డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.33 కోట్లు అవుతుందని అంచనా వేశారు. యూబీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు ఈ పనులకు సంబంధించి టెండర్ దక్కింది.

మూడో దశలో..

ఫేజ్–3లో రోడ్డు విస్తరణ కోసం 177 ఇళ్లు తొలగించడంతో పాటు కొన్ని స్థలాలు సేకరించాల్సి ఉంది. అందులో 159 ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఆస్తులు ఉన్నాయి. 18 ప్రభుత్వ భూములు ఉన్నాయి. 159 మందికి టీడీఆర్ బాండ్స్ కేటాయించనున్నారు. వీటి విలువ మూడు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఇప్పటికే 108 మందికి బాండ్లు అప్పగించగా, మరో 51 మందికి బాండ్లు సిద్ధం చేస్తున్నారు. స్వర్ణభారతీ నగర్‌లో 382 ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా తొలగించాల్సి ఉంది. వీటిలో బీ ఫారం పట్టాలు, ఆక్రమణ భూములున్నాయి.

అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు

ఇటీవల స్వర్ణభారతీ నగర్‌లో రోడ్డు వలన ప్రభావితం అవుతున్న వారితో మున్సిపల్ కమిషనర్ చేకూరి కీర్తి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. 80 అడుగుల వెడల్పుతో 4.21 కిలోమీటర్ల నిర్మించాల్సి ఉండగా అందులో ఇప్పటికే 3.30 కిలోమీటర్ల రోడ్ పని పూర్తి అయి స్వర్ణభారతి నగర్ వద్ద ఆగిపోయినట్లు వివరించారు.

బాధితులకు అండగా..

.రోడ్ విస్తరణలో నష్టపోతున్న వారికి అర్హత మేరకు జగనన్న కాలనీల్లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఇంటి స్థలం పట్టా ఇచ్చి, ఇంటి నిర్మాణాలకు కూడా రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో ఉన్న వారికి చట్ట ప్రకారం భూమిపై హక్కులు లేవని, అటువంటి వారికి జగనన్న కాలనీల్లో పక్కా రిజిస్ట్రేషన్ తో ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ కాలనీల్లో మౌలిక వసతులు కూడా వేగంగా అభివృద్ధి చేస్తామని అలాగే ఇళ్లు నష్టపోతున్న వారికి చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారు. చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టే అవకాశం ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు కూడా అందరికీ న్యాయం చేసిన తర్వాతే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. త్వరలో కౌన్సిల్‌లో కూడా దీనిపై తీర్మానం చేస్తామని హామీ ఇవ్వడంతో ఎక్కువ మంది దీనికి అంగీకరించారు. త్వరలో మళ్లీ వారితో సమావేశం అయ్యి ఆమోద పత్రాలు తీసుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వస్తే త్వరలోనే రోడ్డు పనులకు ఆటంకాలు తొలుగుతాయి.



అభివృద్ధి చేయనున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ

సాక్షి

శనివారం, ఏప్రిల్, 8

చరిత్రాత్మకమైన తీర్పు

న్యాయం చేయటం మాత్రమే కాదు, అలా చేస్తున్నట్టు కనబడటం కూడా ముఖ్యం అంటారు. 'మీడియా వన్' కేసులో సుప్రీంకోర్టు బుధవారం వెలువరించిన తీర్పు ఈ సహజ న్యాయసూత్ర ప్రాధాన్యతనూ, దాపరికం లేని న్యాయవ్యవస్థ ఆవశ్యకతనూ నిర్మొహమాటంగా తెలియజేసింది. అంతేకాదు, ఈమధ్యకాలంలో 'జాతీయ భద్రత'ను అడ్డం పెట్టుకునే పోకడలను నిశితంగా విమర్శించింది. 'మీడియా వన్' కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే ఆ కేసు నిజానికి ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని సులభంగానే అర్థమవుతుంది. దేశ భద్రతకు ముప్పు కలుగుతుందన్న ఆరోపణతో కేరళలోని 'మీడియా వన్' చానెల్ ప్రసారాల కొనసాగింపునకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించింది. దేశభద్రతకు ముప్పు తెచ్చే ఎలాంటి చర్యలనైనా అడ్డుకోవటానికీ, ప్రజల ప్రాణాలు కాపాడటానికీ ప్రభుత్వాలకు సర్వాధికారాలూ ఉంటాయి. ఆ విషయంలో రెండో మాటకు తావులేదు. కానీ అందుకు సహేతుక కారణాలను చూపటం ముఖ్యం. అలా కారణాలు చూపటంవల్ల వ్యక్తులు లేదా సంస్థలు లబ్ధి పొందుతాయా లేదా అన్నది ప్రధానం కాదు. ప్రజాస్వామ్యం నాలుగు కాలాలపాటు మనుగడ సాగించాలంటే ఇది ముఖ్యం. ఇలా చేయటంవల్ల దేశ ప్రజల్లో చట్టబద్ధ పాలనపై విశ్వసనీయత ఏర్పడుతుంది. పాలన పారదర్శకంగా సాగుతున్నదనీ, జవాబుదారీతనం అమల్లో ఉన్నదనీ భరోసా కలుగుతుంది.

కారణాలేమైనా గానీ ఇటీవలి కాలంలో కొన్ని కేసుల విషయంలో తన వాదనలకు మద్దతుగా కేంద్రం కొన్ని పత్రాలను సీల్డ్ కవర్‌లో అందజేయటం, న్యాయస్థానాలు ఆ ధోరణిని అంగీకరించటం కనబడుతుంది. ఇందుకు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌పై వచ్చిన లైంగిక ఆరోపణల కేసు తదితరాలు మొదలుకొని భీమా కోరెగావ్ కేసు వరకూ ఎన్నిటినో ఉదహరించవచ్చు. ఆఖరికి ఇదెంత వరకూ వచ్చిందంటే సీల్డ్ కవర్ అందజేయటం న్యాయవ్యవస్థలో ఒక సాధారణ విషయంగా మారింది. ఇందువల్ల కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులకూ, సంస్థలకూ నష్టం జరుగుతుంది. తమపై ఉన్న ఆరోపణలేమిటో, వాటికిగల ఆధారాలేమిటో తెలియకపోతే ఏ ప్రాతిపదికన వారి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించాలి? ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా? నేరం రుజువయ్యేవరకూ ఎవరినైనా నిరపరాధులుగా పరిగణించాలన్నది అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలూ అనుసరించే విధానం. దానికి సీల్డ్ కవర్ పద్ధతి గండికొడుతోంది. అంతేకాదు, నిందితులకు అన్యాయం జరుగుతున్నదన్న భావన కలిగి ప్రజల్లో వారిపట్ల సానుభూతి ఏర్పడుతోంది. 'మీడియా వన్' కేసు విషయానికొస్తే ఆ సంస్థ ప్రసారాలను ఎందుకు నిలిపేయాల్సివచ్చిందో కేంద్రం చెప్పదు. హైకోర్టుకు పోతే అక్కడ ధర్మాసనం తనకు సమర్పించిన సీల్డ్ కవర్‌లో ఆ ఆరోపణలేమిటో చూస్తుంది. వీటిపై మీ వాదనేమిటని కక్షిదారును ప్రశ్నించదు. పైగా ఆ సీల్డ్ కవర్ సమాచారం ఆధారంగా తీర్పు వెలువడుతుంది. సింగిల్ బెంచ్ ముందూ, డివిజన్ బెంచ్ ముందూ కూడా 'మీడియా వన్'కు ఇదే అనుభవం ఎదురైంది. అయితే అసలు న్యాయస్థానాలు సీల్డ్ కవర్‌ను అంగీకరించే ధోరణి గతంలో లేనేలేదని చెప్పలేం. ప్రభుత్వోద్యోగుల సర్వీసు, పదోన్నతుల వ్యవహారాల్లో సంబంధిత అధికారుల ప్రతిష్ఠ కాపాడేందుకు... లైంగిక దాడుల కేసుల్లో బాధితుల గుర్తింపు రహస్యంగా ఉంచటానికి సీల్డ్ కవర్‌లో వివరాలు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఆఖరికి రాఫెల్ యుద్ధ విమానాల కేసులో సాంకేతిక అంశాలు వెల్లడిస్తే శత్రు దేశాలకు ఉప్పందించినట్టవుతుందని చెప్పటం వరకూ అంగీకరించవచ్చు. కానీ బీసీసీఐ విషయంలో తానే నియమించిన కమిటీ నివేదికనూ, గుజరాత్‌కు సంబంధించిన నకిలీ ఎన్‌కౌంటర్ కేసు, అయోధ్య స్థల దస్తావేజు కేసువంటి అంశాల్లో సైతం గోప్యత పాటించాలని ప్రభుత్వం చేసిన వినతిని న్యాయస్థానాలు అంగీకరించటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? 2013లో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల పర్యవసానంగా ఈ స్థితి ఏర్పడింది. అయితే తాజా తీర్పులో సుప్రీంకోర్టు ప్రస్తావించినట్టు బ్రిటన్, కెనడా సుప్రీంకోర్టులు ఈ విషయంలో ఎన్నదగిన తీర్పులు వెలువరించాయి. కేసులకు సంబంధించిన సమాచారాన్ని దాచివుంచటం వల్ల ఆ కేసుల గురించి చర్చించుకోవటం, ప్రభుత్వ పనితీరును ప్రశ్నించటం ప్రజలకు నిరాకరించినట్టే అవుతుందని అక్కడి న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి.

'మీడియా వన్' కేసులో జాతీయ భద్రతను సాకుగా చూపిన కేంద్రం దాన్ని సమర్థించుకునేందుకు సీల్డ్ కవర్‌లో ప్రస్తావించిన కారణాలు పేలవంగా ఉన్నాయి. అందుకే గాల్లోంచి ఆరోపణలు సృష్టిస్తే అంగీకరించబోమని ధర్మాసనం వ్యాఖ్యానించాల్సి వచ్చింది. ఇకపై ఇలాంటి కేసుల విషయంలో న్యాయస్థానాలు అనుసరించాల్సిన రెండు గీటురాళ్లను కూడా ప్రకటించింది. కేసులోని అంశాలు వెల్లడిస్తే జాతీయ భద్రతకు ముప్పు కలుగుతుందని భావించటానికి అవసరమైన సమాచారం ప్రభుత్వం అందించిందా లేదా అన్నది అందులో మొదటిది. వివేకవంతులైన వ్యక్తులు సైతం ఆ సమాచారం ఆధారంగా అలాగే భావించే అవకాశం ఉన్నదా లేదా అన్నది రెండోది. భావప్రకటనా స్వేచ్ఛకు పూచీపడే రాజ్యాంగంలోని 19వ అధికరణలోనే ఏయే అంశాల్లో నియంత్రణలు అమలు చేయవచ్చో వివరంగా ఉంది. వాటిని బేఖాతరు చేసి నచ్చని అభిప్రాయాలు ప్రకటించారన్న ఏకైక కారణంతో ఆ స్వేచ్ఛకు గండికొట్టడం రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే 'మీడియా వన్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది.

పాశ్చాత్య బాణీలకు నృత్యం చేయాలా?

విశ్లేషణ



డెన్నిస్ అలిపోవ్

యూఎన్ ఛార్టర్ ప్రకారం సార్వభౌమత్వం అన్ని దేశాలకు సమానంగా వర్తిస్తుంది. కానీ ఈ విషయాన్ని అంగీకరించేందుకు పాశ్చాత్య దేశాలు సిద్ధంగా లేవు. అందుకే ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తున్నాయి. నిజానికి ఉక్రెయిన్ వ్యవహారం ఐక్యరాజ్య సమితి పరిధి లోనిది. జీ20 అజెండాలో లేదు. కానీ పశ్చిమ దేశాలు దీన్ని చాలా దురుసుగా అజెండాలోకి చేర్చాయి. యూరప్ సమస్యలను ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ సమస్యలుగా చూపెట్టే ప్రయత్నం జరుగుతోందని భారత్ స్పష్టం చేసింది. జీ20 అధ్యక్ష స్థానంలో భారత్ ప్రతిపాదించిన అజెండా అమలు చేయడం ద్వారా మాత్రమే భిన్నధ్రువ దౌత్యం విషయంలో నమ్మకం పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముక్కలు కాకుండా ఉంటుంది.

అంతర్జాతీయ అధికార పీఠాలిప్పుడు కదులుతున్నాయి. నిన్నమొన్నటివరకూ కొందరికి అనుకూలంగా ఉన్న ప్రపంచం కాస్తా భిన్న ధ్రువమవుతోంది. అధికారమిప్పుడు అన్ని దిక్కులా విస్తరిస్తోంది. మునుపటితో పోలిస్తే ప్రపంచ వ్యవహారాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల మాటలిప్పుడు ఎక్కువగా చెల్లుబాటు అవుతున్నాయి. అయితే ఈ మార్పులను జీర్ణించుకునే పరిస్థితుల్లో పశ్చిమ దేశాల్లేవు. దేశాల సర్వసమానత్వం ఆధారంగా ప్రస్తుతమున్న అధికార వ్యవస్థ వీరికిప్పుడు అకస్మాత్తుగా చేదవుతోంది.

యూఎన్ ఛార్టర్ ప్రకారం సార్వభౌమత్వం అన్ని దేశాలకు సమానంగా వర్తిస్తుంది. కానీ ఈ విషయాన్ని అంగీకరించేందుకు అవి సిద్ధంగా లేవు. అందుకే ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తున్నాయి. ఇతర దేశాల వ్యవహారల్లో ప్రత్యక్షంగా కలుగచేసుకోవడం, పరోక్ష పద్ధతుల్లో యుద్ధం చేయడం... తమను ధిక్కరించే వారిపై పశ్చిమ దేశాలు చేసే ప్రయత్నాలన్నది తెలిసిన విషయమే. నిర్మాణాత్మక సహకారం కంటే పోటీతత్వానికి ఎక్కువ ఆదరణ ఉన్న సమయమిది. ఇంధన, ఆహార రంగాలు అస్థిరంగా ఉన్న పరిస్థితులను చూస్తున్నాం. వాతావరణ మార్పులు, అధిక ద్రవ్యోల్బణం లాంటి మానవీయ సంక్షోభాలిప్పుడు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ సంస్థలన్నీ అందరికీ ప్రయోజనకరమైన అంశాలపై, ఒప్పందాల అమలుపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

ఎనభై శాతం జీడీపీ జీ20 దేశాల్లోనే....

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య అంశాల్లో సహకారం కోసం జీ20 ఏర్పాటైంది. ఈ ఇరవై దేశాల జాతీయ స్థూల ఉత్పత్తి ప్రపంచ స్థూల ఉత్పత్తిలో దాదాపుగా 80 శాతం వరకూ ఉండటం గమనార్హం. అంతర్జాతీయ వాణిజ్యం, కర్బన ఉద్గారాలూ ఎక్కువే. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల జనాభా ఈ జీ20 దేశాల్లోనే ఉంది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సంక్షోభాల పరిష్కారానికి తగిన సామర్థ్యమూ కలిగి ఉందీ వేదిక. ప్రపంచం మాంద్యం ముంగిట్లో నిలిచిన ఈ తరుణంలో జీ20 మరింత ఆలస్యం చేయడం ఏమాత్రం తగదు. జీ20 అధ్యక్ష స్థానంలో భారత్ ప్రతిపాదించిన అజెండా అమలు చేయడం ద్వారా మాత్రమే భిన్నధ్రువ దౌత్యం విషయంలో నమ్మకం పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముక్కలు కాకుండా ఉంటుంది. పారిశ్రామిక వృద్ధి మళ్లీ పట్టాలు ఎక్కుతుంది. అభివృద్ధి చెందిన దేశాలతోపాటు ఎదుగుతున్న మార్కెట్లతోనూ భారత్‌కు సత్సంబంధాలున్నాయి. కాబట్టి భారత్ ప్రతిపాదించిన అజెండాతో లక్ష్యాల సాధన కష్టమేమీ కాబోదు. భారత్ ప్రాథమ్యాలతో రష్యా పూర్తిగా ఏకీభవిస్తోంది. ఎంచుకున్న లక్ష్యాలను పూర్తి చేయడం వల్ల అనూహ్యమైన సాంఘిక, ఆర్థిక సమస్యలు, ప్రపంచస్థాయి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొ



వచ్చునని రష్యా కూడా భావిస్తోంది.

మార్చి 1, 2 తేదీల్లో జరిగిన జీ20 దేశాల విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల సమావేశాలు ఐక్యరాజ్యసమితి పాత్రతోపాటు బహుముఖ ప్రపంచ ప్రాముఖ్యతను మరోసారి స్పష్టం చేశాయి. అజెండాలో కీలకమైన అంశాలను జొప్పించేందుకు భారత్ అనుసరించిన నిర్మాణాత్మక విధానం, సమతౌల్యతలను ప్రశంసించి తీరాలి.

ఐక్యరాజ్యసమితి అంశం జీ20లోనా?

నిజానికి ఉక్రెయిన్ వ్యవహారం ఐక్యరాజ్య సమితి పరిధి లోనిది. జీ20 అజెండాలో లేదు. కానీ పశ్చిమ దేశాలు దీన్ని చాలా దురుసుగా అజెండాలోకి చేర్చాయి. రష్యాని తెగనాడటంపైనే ప్రపంచ భవిష్యత్తు ఆధారపడిందేమో అన్నంత హడావుడి చేశాయి. వ్యూహాత్మకంగా రష్యా ఓటమిని చూడాలని పాశ్చాత్య దేశాలు బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. యూరప్ సమస్యలను ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ సమస్యలుగా చూపెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. రష్యాతో సహా యూరప్ దేశాలు ఇప్పటికే విదేశీ బాణీలకు నృత్యం చేస్తూ వస్తున్నాయి. అయితే ఇది భద్రతకు సంబంధించిన అంశం. 'నాటు నాటు' డ్యాన్స్ కాదు. ఈ విషయంలో ప్రధాన ముద్దాయి కచ్చితంగా అమెరికా. దీని లక్ష్యం ఒక్కటే. తనను ఎవరూ ప్రశ్నించరాదు! రష్యాను అణచివేసేందుకు ఉక్రెయిన్‌ను ఒక పనిముట్టుగా వాడుకునే ప్రయత్నం చేస్తోంది. తద్వారా ప్రపంచం మొత్తం పరోక్షంగా తన ఆధిపత్యాన్ని అంగీకరించాలన్నది అమెరికా లక్ష్యం.

2009 సెప్టెంబరులో జీ20 వేదిక లక్ష్యాల్లో అంతర్జాతీయ ఆర్థిక సహకారం ఒకటని తీర్మానించారు. ఇందుకు తగ్గట్టుగా జీ20 తన దృష్టిని ప్రపంచ ఆర్థిక, సామాజిక సమస్యలపై కేంద్రీకరించాలి. ఉక్రెయిన్ వంటి అంశాలను చేర్చడం వల్ల జీ20 లక్ష్యం విఫలమవుతుంది. రష్యా దీన్ని కోరుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి భద్రతా సమితిలో ఈ అంశాలన్నింటిపై చర్చలు జరిపేందుకు రష్యా సిద్ధంగానే ఉంది. జీ20 అజెండా మాత్రం హైజాక్ కారాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. భారత్ లేవనెత్తిన ఉగ్రవాదం, మత్తుమందులు, ప్రకృతి వైపరీత్యాల విషయం మరీ ముఖ్యంగా చెప్పుకోవాలి. ఉగ్రవాదం పెరుగుదలకు సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కారణమని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అత్యధికులు అంగీకరిస్తారు. ఇందుకు ఒకప్పటి యుగోస్లేవియాతోపాటు లిబియా, ఇరాక్, సిరియా, అఫ్గానిస్తాన్‌లే ప్రత్యక్ష ఉదాహరణలు. ఈ దేశాల్లో 'నాటో' వ్యవహారాలు మరీ ముఖ్యంగా చెప్పుకోవాలి. ఇప్పుడు అది అటు పసిఫిక్‌లో, ఇటు ఆసియాలో తూర్పుదిక్కుగా మరింతగా విస్తరించాలని అనుకుంటోంది. ఈ పరిణామం మరిన్ని ఘర్షణలకు దారితీస్తుంది. యూరప్ దేశాల్లో మాదిరిగా విభజనకు దారితీస్తుంది. నార్డ్ స్ట్రీమ్ గ్యాస్ పైపులైన్‌ను అనూహ్యంగా ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి అసలు దోషులెవరన్నది ఎప్పటికైనా కచ్చితంగా తేలుతుంది. ఇరాక్‌లో నాటో చేసిన ఇతర 'మంచి పనుల' విషయం కూడా!

అన్యాయమైన ఆంక్షలు, దేశాల మధ్య సరుకుల రవాణాను కృత్రిమంగా పాడు చేయడం వంటివి ఉక్రెయిన్ సమస్యకు మూల కారణాలు... తనను తాను రక్షించుకోవాలనుకుంటున్న రష్యా కాదు. ఈ విషయంపై ప్రజల్లో అపోహలు ఉన్న నేపథ్యంలో ఒక్క విషయాన్ని స్పష్టం చేయాలి. ఉక్రెయిన్ పై సైనిక దాడి చేయాలన్నది రష్యా ముందున్న అవకాశాల్లో ఒకటి కానేకాదు. రష్యా సార్వభౌమత్వానికి నేరుగా ముప్పు ఏర్పడటం, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం వంటి చర్యలకు ప్రతిగా తీసుకున్న నిర్ణయం మాత్రమే.

పాశ్చాత్య దేశాల చేతుల్లో ఆర్థిక సంబంధాలు ఆయుధాలుగా మారిపోయాయి. ఫలితంగా ఇప్పటికే అంతర్జాతీయ ఆహార రంగం గతి తప్పి ధరలు పెరిగాయి. రష్యాతోపాటు ప్రపంచదేశాలన్నీ ఇప్పుడు ఆ భారాన్ని మోయాల్సిన పరిస్థితి వచ్చింది. నెపం మొత్తం రష్యాపై నెట్టాలన్నది నిలబడేది కాదు. జీ20 అజెండా అమలు కావాలనుకుంటే దాన్ని తిరస్కరించాలి కూడా. జీ20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు రష్యా కట్టుబడి ఉంది. మంత్రుల స్థాయి సమావేశాలన్నింటిలో చురుకుగా పాల్గొంటోంది. లక్ష్యాల సాధనలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు, తగిన ఫలితాలు రాబట్టేందుకు తగినంత వెసులుబాటుతో వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నాం. దక్షిణాది దేశాలు ఎదుర్కొగల సమస్యల పరిష్కారం కంటే తమ వ్యూహాత్మక అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చే వారు నిర్ణయం తీసుకోవాల్సిన తరుణం కూడా ఇదే!

వ్యాసకర్త భారత్‌లో రష్యా రాయబారి
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అవి ముఖ్యం కాదా?



తాజ్‌మహల్ ఎవరు నిర్మించారన్నది ఒక్కటే మన మునిమనవలు తెలుసుకోవాల్సిన విషయం కాదు. బృహదీశ్వరాలయం, ఖజురహో, రాజస్థాన్ ఆలయాలు, గుజరాత్ ఆలయాలు, బెంగాల్, ఒడిషా, అస్సాం, కశ్మీర్, హిమాచల్, యూపీ, ఉత్తరాఖండ్, బిహార్, తెలంగాణ ఆలయాలన్నీ కూడా ఎవరు నిర్మించారో తెలుసుకోవాలి.

– మణిదీపా బోస్, కాలమిస్ట్

ఆగిపోవాల్సిన వ్యాధి



జన్యుపరంగా ఒక మగవాడు ఒక మహిళ పుర్రెను పగలగొట్టాడు (బాక్సింగ్ పోటీ వీడియో షేర్ చేశారు). దీన్ని మనం ఒకప్పుడు మహిళల పట్ల జరుగుతున్న హింస అనేవాళ్లం. ఇప్పుడు దాన్ని 'ట్రాన్స్' హక్కుల విజయం అంటున్నాం. ఈ ట్రాన్స్ కల్ట్ అనేది మన దేశంలో ఒక మానసిక ఆరోగ్య అంటువ్యాధి. అది ఆగిపోవాలి.

– వివేక్ రామస్వామి, అమెరికా 'అధ్యక్ష' అభ్యర్థి

ఆ భావన పుట్టించడానికే...



ఊహించినట్టే, మరింతమంది కాంగ్రెస్ నాయకులు బీజేపీవైపు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఈరోజు పార్టీ మారారు. రెడ్డి గానీ, అనిల్ ఆంటోనీ(మాజీ రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు) గానీ ఏ రకంగా చూసినా పెద్ద నాయకులు కాదు. కానీ కాంగ్రెస్ మునిగిపోయే ఓడ అన్న భావనను నిర్మించడంలో వీళ్లు సాయపడతారు. ఇంకొన్ని పెద్ద పేర్లు ఈ బాటలో నడుస్తాయి.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

వద్దు పోట్లాటలు




హిందువులందరూ వెళ్లి 'ఫరాజ్' సినిమా చూడండి. ముస్లింలందరూ వెళ్లి ఫరాజ్ సినిమా చూడండి. పోట్లాటలు, ట్విట్టర్ వేదికగా రోతపుట్టించే వ్యాఖ్యానాలు చేయడం మానండి. (దర్శకుడు) హన్సల్ మెహతా సర్ అత్యంత సంక్లిష్టమైన ఉద్వేగాన్ని చాలా సున్నితంగా చూపారు. అది ఇవాళ్టి సత్యం.

– మీరా చోప్రా, నటి

ఇన్‌బాక్స్

న్యాయానికి మానవీయ స్పర్శ

ప్రముఖ ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి న్యాయ వ్యవస్థ లోపల ఉంటూ కూడా ప్రజల హక్కుల కోసం బాహాటంగా నిలిచిన ధైర్యశాలి. ఆయన శతజయంతి సంవత్సరం నడుస్తోంది. ఈ ఏప్రిల్ 13న పదవ వర్ధంతి కూడా. జస్టిస్ చిన్నప్పరెడ్డి 1922 సెప్టెంబర్ 25న కర్నూలు జిల్లా జంబులదిన్నె గ్రామంలో జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం మద్రాస్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో



జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి

న్యాయవాదిగా పనిచేశారు. తర్వాత అవే హైకోర్టుల్లో న్యాయమూర్తిగానూ తీర్పులిచ్చారు. 1978లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన ఏ స్థాయిలో పనిచేసినా గ్రామిక ప్రజల గొంతుకగా ఉన్నారు. ఎన్నో చారిత్రాత్మక తీర్పులిచ్చారు. మార్క్సిజం అత్యున్నత స్థాయి మానవతా వాదమని ఆయన నమ్మారు. రాజ్యాంగ సంబంధ కేసుల్లోనే కాకుండా సివిల్, క్రిమినల్, సర్వీస్ 'లా', ఖైదీల హక్కులు, దళితులు, వెనుక బడిన కులాలవారి హక్కుల విషయంలో అపరిమిత పరిజ్ఞానం, గొప్ప నైపుణ్యం కనిపిస్తుంది. 'సమాన పనికి సమాన వేతనం' విషయంలో ఆయన ఇచ్చిన తీర్పు ఒక మైలు రాయి.

జాతీయ భద్రత పేరుతో ప్రజలను జైలు పాలు చేయడానికి వీల్లేదనీ, వాటిని రాజ్యాంగ కోర్టులు పరిశీలించాలనీ అన్నారు. మనిషికి ఉన్న భావాల ఆధారంగా శిక్షలు వేయడం, ఉద్యోగాల నుండి తొలగించడం వంటి వాటిని నిరోధిస్తూ సుదీర్ఘ తీర్పునిచ్చారు. కవిత్వం రాసినందుకు చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లను రాజ్యం డిటెన్యూలుగా చేసినప్పుడు జస్టిస్ చిన్నప్పరెడ్డి ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. జాతీయగీతం పాడలేదని స్కూల్ పిల్లలను పాఠశాల నుండి తొలగిస్తూ ఇచ్చిన ఆర్డర్‌ను రద్దుపరుస్తూ 'అందరూ జాతీయగీతం పాడాల్సిన అవసరం లేదు. అయితే జాతీయగీతం పాడే సందర్భంగా నిశ్శబ్దంగా ఉంటే సరిపోతుంది' అని పిల్లలను కాపాడి వారి చదువులు కొనసాగేలా తీర్పునిచ్చారు.

జస్టిస్ చిన్నప్పరెడ్డి సుదీర్ఘ కృషిని గుర్తు చేసుకుంటూ రేపు (ఆదివారం) సభ నిర్వహిస్తున్నాం. దీనికి అందరూ ఆహ్వానితులే.

– తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్
(రేపు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి శతజయంతి సభ)

ఏక వ్యక్తి సైన్యంలా పనిచేశారు!



మల్లెపల్లి లక్ష్మయ్య

'నోటితో పొగిడి, నొసటితో వెక్కిరించడం' అని ఒక సామెత! బాబా సాహెబ్ అంబేడ్కర్ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని చోట్ల పార్టీలు ఆయన్ని ప్రశంసిస్తున్నాయి. కానీ ఆ పార్టీల నాయకులే నిరాధార ఆరోపణలతో పుస్తకాలు రచిస్తున్నారు. గతంలో జర్నలిస్టు, బీజేపీ నాయకుడు అరుణ్ శౌరి విద్వేషపూరితంగా రాసిన పుస్తక ఉదాహరణ ఉండనే ఉన్నది. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ కూడా అంబేడ్కర్‌పై రాసిన పుస్తకంలో కొన్ని అసత్య వ్యాఖ్యలు చేశారు. చాలామంది అంబేడ్కర్‌ను మేధావిగా, విద్యావేత్తగా, న్యాయకోవిదుడిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా కొనియాడతారు. కానీ దేశభక్తుడిగా అంగీకరించరు. ఆనాటి కమ్యూనిస్టులు సైతం ఆయనకు బ్రిటిష్ ఏజెంట్ అన్న ముద్రవేసి దుష్ప్రచారం చేసిన పరిస్థితి ఉంది. కానీ అంబేడ్కర్ అటువంటి మాటలకు ఏనాడూ చలించలేదు. వారం రోజుల్లో మనం బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలను జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా రెండు విషయాలను మీ ముందుంచాలనుకుంటున్నాను.

అందులో మొదటిది, భారత స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రూపకల్పన కోసం ఏర్పడిన రాజ్యాంగ సభలో అంబేడ్కర్ నిర్వహించిన పాత్ర. రాజ్యాంగ సభ సమావేశాలు 1946 డిసెంబర్ 9న ప్రారంభమయ్యాయి. అయితే డిసెంబరు 13వ తేదీన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. 14న శనివారం, 15న ఆదివారం అయినందుకు మళ్ళీ సమావేశాలు డిసెంబరు 16న మొదలయ్యాయి. కేవలం ఒకరోజు తర్వాత అంటే డిసెంబరు 17న జరిగిన సమావేశంలో అంబేడ్కర్‌కు అవకాశం వచ్చింది. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన అంబేడ్కర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇంత తొందరగా తనకు అవకాశం వస్తుందని భావించలేదని కూడా తెలిపారు.

''ఈ రాజ్యాంగ సభ ద్వారా మన గొప్పదేశపు సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను తీర్చిదిద్దుకుంటామనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు. మనం ఈ రోజు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా విభజింపబడి ఉన్నామనే విషయం నాకు తెలుసు. మనం వివిధ శిబిరాలకు చెందినవాళ్ళం. ఇవి శత్రు శిబిరాలుగా కూడా ఉన్నాయి. నేను కూడా అటువంటి శిబిరానికి చెందిన వాడనని ఒప్పుకొంటున్నాను. ఇన్ని రకాల సమస్యలున్నప్పటికీ ఈ దేశం సమైక్యంగా నిలబడడంలో ప్రపంచంలోని ఏ శక్తులూ మనల్ని అడ్డుకోలేవనే విశ్వాసం నాకున్నది.'' అంతేకాకుండా, ముస్లిం లీగ్ విషయం, ముస్లింల విషయాన్ని ప్రస్తావిస్తూ...''హిందూ–ముస్లిం సమస్యను సంఘర్షణలతో, బలప్రయోగంతో పరిష్కరించుకోలేం. వివేకం ద్వారా, సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. బ్రిటిష్ రాజనీతివేత్త బర్క్ చెప్పినట్టుగా, మనం బలవంతంగా ఎవరినీ లొంగదీసుకోలేం, వారిని మనతో కలుపుకోవాలి'' అంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు.

కొత్త కోణం



ఇటువంటి దార్శనికతను కలిగిన అంబేడ్కర్‌ను రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఓడించారు. అప్పటి తూర్పు బెంగాల్ నుంచి ఎన్నికైన షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ నాయకులు జోగేంద్రనాథ్ మండల్ రాజీనామా చేసి, అంబేడ్కర్‌ను జైసూర్ కుల్నా నియోజకవర్గం నుంచి రాజ్యాంగ సభకు ఎంపిక చేశారు. అయితే కొద్ది కాలంలోనే తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌లోకి వెళ్ళిపోవడంతో అంబేడ్కర్ రాజీనామా చేశారు.

రాజ్యాంగ సభలో అంబేడ్కర్ సభ్యుడిగా ఉండాలనే ప్రతిపాదనను రాజ్యాంగ సభ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ కాంగ్రెస్ ముందుంచారు. 1947 జూన్ 30న నాటి బొంబాయి ప్రధాన మంత్రి బి.జి.ఖేర్‌కు ఉత్తరం రాస్తూ, ''అంబేడ్కర్ విషయంలో ఎవరికి ఎన్ని అభిప్రాయ బేధాలున్నప్పటికీ ఆయనను తిరిగి రాజ్యాంగ సభలోకి తీసుకోవాలి. గత సమావేశాల్లో డాక్టర్ అంబేడ్కర్ ప్రదర్శించిన వివేకం, మార్గదర్శనం చూసిన తర్వాత ఈ నిర్ణయానికి వస్తున్నాను'' అంటూ కరాఖండీగా చెప్పారు. ఆ విధంగా మళ్లీ బొంబాయి నుంచి అంబేడ్కర్ రాజ్యాంగ సభలో అడుగుపెట్టారు.

1947 ఆగస్టు 27న రాజ్యాంగ రచనాసభ ఏడుగురు సభ్యులతో రచనాసంఘాన్ని నియమించింది. ఏడుగురిలో అంబేడ్కర్‌ను ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగాన్ని పూర్తి చేసి సమర్పించిన రోజున కమిటీ సభ్యులలో ఒకరైన కృష్ణమాచారి మాట్లాడుతూ, ''ఈ కమిటీలో ఏడుగురు సభ్యులున్నప్పటికీ, డాక్టర్ అంబేడ్కర్ మాత్రమే పూర్తికాలం పనిచేసిన ఏకైక వ్యక్తి. ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొక సభ్యుడు మరణించారు. వారి స్థానాల్లో ఎవరినీ తీసుకోలేదు. మరొక సభ్యుడు ప్రభుత్వ పనులలో తీరిక లేకుండా ఉన్నారు. ఇంకొక ఇద్దరు సభ్యులు అనారోగ్య కారణాల వల్ల ఢిల్లీకి దూరంగా ఉన్నారు'' అంటూ అంబేడ్కర్ కృషిని వెల్లడించిన విషయాన్ని ఎవరైనా కాదనగలరా?

రెండవ విషయం, 1932 తర్వాత అంబేడ్కర్ హిందూ మతంతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించడం. అప్పటి వరకు జరిగిన రాజకీయ, సామాజిక కుట్రలు ఆయనను చలింపజేశాయి. ఎప్పుడైతే, తాను హిందూ మతంలో ఇక ఉండలేనని ప్రకటించారో... ముస్లిం, క్రైస్తవ, సిక్కు మత పెద్దలు ఆయన్ని తమ తమ మతాల వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేశారు. కానీ అంబేడ్కర్ ఆ మూడు మతాలను వివిధ కారణాల వలన తిరస్కరించారు. చివరకు 1950 తర్వాత బౌద్ధం వైపు వెళుతున్నట్టు ప్రకటించి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఒకవేళ బాబా సాహెబ్ అంబేడ్కర్ బౌద్ధం కాకుండా ఇంకో మతం పుచ్చుకున్నట్లయితే, పరిణామాలు ఇంకోలా ఉండేవి. తాను, తన జాతి ఎన్నో అవమానాలు, వివక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజాస్వామ్యయుతంగా, శాంతిగా తన ఉద్యమాలు కొనసాగించినవారు అంబేడ్కర్! అలాంటి బాబాసాహెబ్‌ను నిరాధార ఆరోపణలతో, అనవసర విషయాలతో విమర్శల పాలుచేయాలా?

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 81063 22077
(ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి)

రోజా దివ్యౌషధం

పవిత్ర రమజాన్ మాసం వరాల వసంతం. ఇందులో అన్నీ శుభాలే. దైవాదేశాలను పాటిస్తూ, సత్కార్యాలు ఆచరిస్తూ, దుర్మార్గాలకు దూరంగా ఉండే వారికి ప్రతినెలా, ప్రతిరోజూ, ప్రతి క్షణమూ శుభ సూచకమే. కారుణ్య భరితమే. అయితే రమజాన్‌లో మాత్రం దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తుంది. అందుకని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనస్ఫూర్తిగా, ఆత్మసంతోషంతో వ్రతం పాటించాలి. నియమబద్ధంగా నమాజులు చేయాలి. తరావీహ్‌లు ఆచరించాలి. నఫిల్ ఆరాధనల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.



పవిత్ర ఖురాన్‌ను అర్థం చేసుకుంటూ చదివే ప్రయత్నం చెయ్యాలి. నిజానికి ఆరాధనల ద్వారా మనిషి సంపూర్ణ మానవతావాదిగా మారాలన్నది అసలు ఉద్దేశ్యం.

అందుకే దైవం సృష్టిలో ఏ జీవరాశికీ ఇవ్వనటువంటి ప్రత్యేకతనూ, బుద్ధి కుశలతనూ, విచక్షణా జ్ఞానాన్నీ ఒక్క మానవుడికే ప్రసాదించాడు. అందుకని మనిషి తన స్థాయిని గుర్తించాలి. మానవ సహజ బలహీనతల వల్ల జరిగిన తప్పుల్ని తెలుసుకోవాలి. దైవం ముందు వాటిని ఒప్పుకోవాలి. పశ్చాత్తాపం చెందుతూ క్షమాపణ కోసం దైవాన్ని వేడుకోవాలి. పవిత్ర రమజానే దీనికి సరైన తరుణం.

ఒక విద్యార్థి పరీక్షల తరుణంలో ఎలా శ్రమిస్తాడో... విశ్వాసులు రమజాన్‌లో అలా శ్రమించాలి. చదువును నిర్లక్ష్యం చేసి పరీక్షలను పట్టించుకోకపోతే విద్యార్థి ఎలా నష్టపోతాడో, రమజాన్ శుభతరుణంలో అలక్ష్యంగా వ్యవహరిస్తే విశ్వాసులు కూడా అలాగే నష్టపోతారు. అందుకని ఉపవాసం ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని పాటించాలి.

కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు, నోరు అన్ని అవయవాలూ ఉపవాసం ఉండాలి. కేవలం పస్తులుండడమే రోజా కాదు. రోజా స్థితిలో కళ్లు చెడు చూడకూడదు. చెవులు చెడు వినకూడదు. నోరు అసభ్యాన్ని పలకకూడదు. కాళ్లు, చేతులతో చెడువైపునకు వెళ్ళకూడదు. మనసులో చెడు తలంపులు రాకూడదు. అప్పుడే 'రోజా' పరిపూర్ణ మవుతుంది.

– మదీహా అర్జుమంద్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.విదియ ఉ.10.02 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** స్వాతి ప.1.56 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.7.31 నుండి 9.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.32 వరకు, **అమృతఘడియలు:** ఉ.4.59 నుండి 6.40 వరకు (తెల్లవారితే ఆదివారం); **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఫేస్‌బుక్ పరిచయం.. రూ.కోటి వరకు ఖర్చు

నిశ్చితార్థం తరువాత పెళ్లికి నిరాకరించిన యువతి

చిత్తూరు అర్బన్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడిన ఓ యువకుడు రూ.కోటి వరకు ఖర్చు చేసి ఆ తరువాత చేతులు కాల్చుకున్నాడు. పోలీసులను ఆశ్రయించగా యువతిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ నరసింహరాజు కథనం మేరకు.. చిత్తూరులోని బీవీ రెడ్డి కాలనీకి చెందిన రవిబాబు స్వీట్స్ షాప్ నడుపుతున్నాడు. అతని కుమారుడు వైష్ణవ్ (28)కు ఏడాది క్రితం ఫేస్‌బుక్‌లో ఓ యువతి పరిచయమైంది. కులాలు వేరైనా పెద్దల అనుమతితో గతేడాది నవంబర్‌లో నిశ్చితార్థం జరిగింది. ఈ ఏడాది మార్చి 10న పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వివాహ అవసరాల కోసం యువతిపై వైష్ణవ్ రూ.28 లక్షలు ఖర్చు చేశాడు. నిశ్చితార్థం సమయంలో రూ.15 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల విలువైన డైమండ్ రింగ్, రూ.10 లక్షల వరకు వైష్ణవ్ ఖర్చు పెట్టాడు. పెళ్లి తరువాత చిత్తూరులో విందు, ఇతర పనులకు రూ.30 లక్షల వరకు ఖర్చు చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో ఉంటున్న యువతి ఫోన్ చేసి రూ.7 లక్షలు అడగడంతో రూ.5 లక్షలు తీసుకుని వైష్ణవ్ అక్కడకు వెళ్లాడు. మిగిలిన రూ.2 లక్షలు తీసుకురమ్మని తన తండ్రికి వైష్ణవ్ చెప్పాడు. తండ్రీకొడుకులు యువతి దగ్గరకు వెళ్లగా..పెళ్లి చేసుకోవడం కుదరదని, తమ హోదాకు సరితూగరంటూ యువతి బంధువులు చెప్పగా వారు వెనుదిరిగి చిత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సంగీత్ ఫంక్షన్‌లో యువతిపై మద్యం మత్తులో వైష్ణవ్ దాడి చేశాడని పేర్కొంటూ వైష్ణవ్, అతడి కుటుంబీకులు, స్నేహితులపై యువతి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ప్రహ్లాద్‌జోషి, అరుణ్ సింగ్



బీజేపీ పెద్దల సమక్షంలో పార్టీలో చేరిన కిరణ్‌కుమార్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌లు సభ్యత్వ రసీదు అందజేసి, పార్టీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవం రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను రెండు సార్లు కాంగ్రెస్‌ను వీడడానికి ఆ పార్టీ నాయకత్వ లోపాలే కారణమని చెప్పారు. అవినీతిపై ప్రధాని మోదీ అద్భుతంగా పోరాడుతున్నారని చెప్పారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కిరణ్‌కుమార్ రెడ్డి చేరికపై ప్రహ్లాద్ జోషి కార్యాలయం నుంచి గురువారమే ఏపీ రాష్ట్ర శాఖకు సమాచారం అందినప్పటికీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హాజరుకాకపోవడం రాజకీయ విశ్లేషకుల్ని విస్మయ పరిచింది. అయితే, కిరణ్‌కుమార్‌రెడ్డి చేరికను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో స్వాగతించారు. ఆయన చేరిక పార్టీ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

• తెలంగాణ

రోజంతా దుకాణాలు తెరవొచ్చు

ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వ్యాపారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని అన్ని దుకాణాలు, వ్యాపార సముదాయాలు 24 గంటలపాటు తెరిచి ఉంచేందుకు అనుమతించింది. ఈ మేరకు కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని జీవో జారీ చేశారు. తదనుగుణంగా తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988కు సవరణలు చేసినట్టు తెలిపారు. 24 గంటలపాటు దుకాణం తెరిచి ఉంచేందుకుగాను ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.10,000 వార్షిక రుసుము చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలో పేర్కొన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే ఈ జీవో అమలులో ఈ కింది పది నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

- ఐడీ కార్డులు జారీ చేయాలి.
- వారాంతపు సెలవు ఇవ్వాలి.
- వారంలో కచ్చితమైన పనిగంటలు ఉండాలి.
- ఓవర్ టైమ్‌కు వేతనం చెల్లించాలి.
- పండుగలు, ఇతర సెలవు దినాల్లో పని చేసినవారికి కాంపన్సేటరీ సెలవు ఇవ్వాలి.
- మహిళా ఉద్యోగులకు తగిన వేతనం.
- రాత్రి షిఫ్ట్‌లో పనిచేసేందుకు మహిళా ఉద్యోగుల అంగీకారం తీసుకోవాలి.
- రాత్రివేళల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రవాణా సదుపాయం కల్పించాలి.
- రికార్డులను సరిగా మెయింటెన్ చేయాలి.
- పోలీస్‌యాక్ట్ నిబంధనలు పాటించాలి.

లోన్ యాప్‌లకు కళ్లెం

వేధింపుల కట్టడికి గూగుల్ చర్యలు

- కేంద్ర హోం శాఖ మార్గదర్శకాలు మేరకు కొత్త విధానం
- వ్యక్తిగత సమాచారం కోరకూడదని లోన్ యాప్‌లకు ఆదేశం
- ఆర్‌బీఐ నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టీకరణ
- ఆ మేరకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని సూచన
- మే 31 నుంచి కొత్త విధానం అమలు



సాక్షి, అమరావతి: లోన్ యాప్ సంస్థల వేధింపులకు ఎట్టకేలకు కళ్లెం పడనుంది. భారీ వడ్డీలతో బెంబేలెత్తిస్తూ, రుణ గ్రహీతల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేస్తూ వేధించే లోన్ యాప్ సంస్థల కట్టడికి గూగుల్ సిద్ధమవుతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు వ్యక్తుల వ్యక్తిగత సమాచారం లోన్ యాప్ సంస్థలకు అందుబాటులో లేకుండా మార్గదర్శకాలు రూపొందించింది. కొత్త విధానం మే 31 నుంచి అమలులోకి రానుంది.

ఫొటోలు, వీడియోల మార్ఫింగులతో వేధింపులు

చైనా కేంద్రంగా పనిచేస్తున్న లోన్ యాప్ సంస్థలు అత్యధిక వడ్డీలు, పారదర్శకతలేని విధానాలతో రుణ గ్రహీతలను వేధిస్తున్నాయి. ఎంతగా వాయిదాలు చెల్లిస్తున్నా వడ్డీ, అసలు కలిపి అప్పు కొండలా పెరుగుతుందే తప్ప తగ్గదు. వాయిదాల చెల్లింపులో జాప్యం చేస్తే రుణ గ్రహీతల మొబైల్ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని తీసుకొని దుర్వినియోగం చేస్తున్నాయి. రుణం తీసుకున్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యుల ఫొటోలు, వీడియోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి బంధువులు, మిత్రులకు వాట్సాప్ చేస్తూ వేధిస్తున్నాయి. ఈ అవమాన భారంతో దేశంలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లోన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలంటే వ్యక్తుల ఫోన్లలోని వ్యక్తిగత సమాచారం అంతా ఆ యాప్ నిర్వాహకులకు అందుబాటులోకి తేవాలి. ఈమేరకు యాక్సెస్‌కు అనుమతిస్తేనే లోన్ యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది. రుణం కావాలన్న ఆతృతలో వ్యక్తులు యాక్సెస్‌కు అనుమతిస్తున్నారు. దీన్నే ఆ సంస్థలు దుర్వినియోగం చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాయి. దాంతో రంగంలోకి దిగిన కేంద్ర హోం, ఆర్థిక శాఖలు లోన్‌యాప్ సంస్థలపై చర్యలకు ఉపక్రమించాయి. మనీలాండరింగ్‌కు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న పలు లోన్ యాప్ కంపెనీలపై కేసులు పెట్టాయి. 2022లో 2 వేల కంపెనీలను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది.

వ్యక్తిగత సమాచారానికి యాక్సెస్ ఇవ్వొద్దని గూగుల్‌కు ఆదేశం

వ్యక్తుల వ్యక్తిగత సమాచారం లోన్ యాప్ సంస్థలకు అందుబాటులో లేకుండా చేయడమే దీనికి పరిష్కారమని కేంద్ర హోం శాఖ భావించింది. వ్యక్తిగత సమాచారం కోరే లోన్ యాప్‌లకు ప్లే స్టోర్‌లో అవకాశం ఇవ్వద్దని గూగుల్‌కు కొన్ని నెలల క్రితం ఆదేశాలు జారీ చేసింది. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ యాప్ సంస్థలతో పాటు గూగుల్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. దాంతో గూగుల్ దిగి వచ్చింది. వ్యక్తిగత సమాచారం లోన్‌యాప్‌లకు అందుబాటులో లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతోంది.

లోన్ యాప్ కంపెనీలకు గూగుల్ మార్గదర్శకాలు

భారత్‌లో వ్యాపారం చేసే లోన్ యాప్ సంస్థలకు గూగుల్ తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే వారి వ్యక్తిగత సమాచారాన్ని కోరకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు యాప్‌ల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని చెప్పింది. భారత్‌లో నాన్ బ్యాంకింగ్ వ్యవహారాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలను పాటించాలని, ఈమేరకు డిక్లరేషన్ ఇచ్చే యాప్ సంస్థలనే గూగుల్ ఇండియా ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం లోన్ యాప్‌లను మాడిఫై చేసి ఈ ఏడాది మే 31లోగా అప్‌లోడ్ చేయాలని చెప్పింది. వాటినే ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. దీంతో దేశంలో లోన్ యాప్‌ల వేధింపులకు కళ్లెం పడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

టీడీపీ నేత వీరంగం

వెంకటాచలం: తెల్లారిలేస్తే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతోంది. ఊరంతా వైఎస్సార్‌సీపీ, సీఎం జగన్ ఫ్లెక్సీలే. దీనికి జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు పూటుగా తాగేసి వీరంగం సృష్టించాడు. అనుచరులతో కలిసి ఓ చానెల్ విలేకరిపై (సాక్షి కాదు) కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వడ్డిపాళెంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వడ్డిపాళెనికి రానుండడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించే కుట్రతో టీడీపీ నాయకుడు యామాల రాజేంద్ర, ఐదుగురు కార్యకర్తలు పూటుగా మద్యం తాగి తన అనుచరులతో కలిసి రాత్రి 10 గంటలకు హంగామా సృష్టించారు. టీడీపీ ఫ్లెక్సీలను తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలకు అడ్డంగా కట్టే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డుకుని ప్రశ్నించడంతో వారిపై దౌర్జన్యానికి దిగాడు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులకు, విలేకరులకు తెలిపారు. ఓ చానల్ రిపోర్టర్ మందల పెంచల్‌రావు, మరికొందరు విలేకరులు అక్కడికి వచ్చారు. టీడీపీ నేతల వీరంగాన్ని వీడియో తీస్తుండగా పెంచల్‌రావుపై యామాల రాజేంద్ర, వల్లెపు మునిబాబు, బాబురావు, ఉప్పు అశోక్, జగదీష్, హర్షవర్ధన్ మూకుమ్మడిగా దాడి చేశారు. 'నువ్వు వైఎస్సార్‌సీపీకి సపోర్టుగా వచ్చావంటూ పెంచల్‌రావుపై కత్తితో దాడి చేశారు. తలపై తీవ్ర గాయమైన పెంచల్‌రావును స్థానికులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాడికి పాల్పడిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. టీడీపీ మండల నాయకులు శుక్రవారం ఉదయం వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లోనూ ఓవరాక్షన్ చేశారు. అర్ధరాత్రి మద్యం మత్తులో వీరంగం చేయడమే కాకుండా రిపోర్టర్‌పై కత్తితో దాడి చేసిన వారికి మద్దతుగా పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి నానా హంగామా చేశారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడి దారుణహత్య

- అనుచరులతో కలిసి హత్యచేసిన టీడీపీ నేత..
- వైఎస్సార్ జిల్లా కమలాపురంలో దారుణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: వైఎస్సార్ జిల్లా కమలాపురం పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరంగుడి శంకర్‌రెడ్డి (47) దారుణహత్యకు గురయ్యారు. కమలాపురం నగర పంచాయతీ 20వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా, కంచి వరదరాజస్వామి ఆలయ చైర్మన్‌గా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి తన పొలంలో పనిచేసుకుంటుండగా రాళ్లతో కొట్టి హత్యచేశారు. పోలీసుల కథనం మేరకు.. గిడ్డంగివీధికి చెందిన శంకర్‌రెడ్డి పెద్దకుమారుడు ఇటీవల టీడీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి సోదరుడి కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో శంకర్‌రెడ్డి తన పొలం వద్ద పంటకు నీరు పారగట్టుకుంటుండగా రామసుబ్బారెడ్డి తన అనుచరులతో వచ్చి రాళ్లతో కొట్టి హత్యచేశాడు. హత్య విషయం తెలియగానే ఎస్ఐ చిన్నపెద్దయ్య తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు రామసుబ్బారెడ్డి, అతడి అనుచరులు హత్య చేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. శంకర్‌రెడ్డి రెండో కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. శంకర్‌రెడ్డికి భార్యలు లక్ష్మీదేవి, గౌరి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

హంతకులకు శిక్ష తప్పదు: ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



శంకర్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌రెడ్డిని హత్యచేసిన వారికి శిక్ష తప్పదని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. హత్యాస్థలంలో శంకర్‌రెడ్డి మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సీఐ, ఎస్ఐలను అడిగి హత్య జరిగిన తీరు, హత్యకు పాల్పడినవారి వివరాలు తెలుసుకున్నారు. హంతకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం పట్టణంలో విషసంస్కృతికి తెరలేపారని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్‌రెడ్డి హత్య బాధాకరమని, నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆయన తప్పిదం చాలా బాధించింది

- చంద్రశేఖర్‌రెడ్డి చేసిన పనికి ఉదయగిరి ప్రజలకు క్షమాపణలు
- దారితప్పినప్పటి నుంచి ఆయనతో మాట్లాడడం లేదు
- నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన తప్పిదం నన్ను చాలా బాధించింది. క్రాస్ ఓటింగ్ చేసి పార్టీకి ద్రోహం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి చేసిన పనికి ఉదయగిరి ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా..' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం నెల్లూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తమ కుటుంబం గురించి ప్రజలందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు క్రాస్ ఓటింగ్ చేశారో కనీసం తెలుసుకోకుండా, అంత శక్తి కూడా లేకుండా ఒక ఎమ్మెల్యేని సస్పెండ్ చేయరని చెప్పారు. అన్నీ స్పష్టత వస్తేనే సస్పెండ్ చేసి ఉంటారన్నారు. ప్రమాణాలు చేస్తారని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రశేఖర్‌రెడ్డి తీరుతో ప్రమాణాలకు కూడా విలువ లేకుండా పోయిందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి దారి తప్పినప్పటి నుంచి మాట్లాడడం మానుకున్నట్లు తెలిపారు.

సీఎం నిర్ణయం ప్రకారమే..

రానున్న రోజుల్లో మేకపాటి కుటుంబం నుంచి ఎవరు పోటీచేస్తారనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం ప్రకారం ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో మాదిరే జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటామని ఆయన చెప్పారు.

ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్ట్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధిపై ప్రధాని మోదీ ట్వీట్

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధితో అసంఖ్యాక ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరగనున్న కార్యక్రమాలపై శుక్రవారం డీడీ న్యూస్ చేసిన ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేస్తూ.. ''ఇదొక ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు. దీని వలన అసంఖ్యాక ప్రజలు ప్రయోజనం పొందుతారు'' అని పేర్కొన్నారు. ఇక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆత్మగౌరవం, సౌకర్యం, అనుసంధానతలకు పర్యాయపదంగా మారిందని.. సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రవేశపెట్టిన ఈ రైలు పర్యాటకానికి, ముఖ్యంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి విశేష ప్రయోజనం చేకూరుస్తుందని ప్రధాని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇది ఆర్థిక వృద్ధిని కూడా ఇనుమడింపజేస్తుందని వ్యాఖ్యానించారు.

కరోనా పూర్తి అదుపులో ఉంది

వైరస్ వ్యాప్తి విషయంలో సీఎం జగన్ నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు

- రాష్ట్రంలో గత రెండు వారాల్లో 15,096 మందికి పరీక్షలు
- వారిలో 267 మందికి వైరస్ సోకినట్టుగా నిర్ధారణ
- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి వివరించిన రాష్ట్ర వైద్యశాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ పూర్తి నియంత్రణలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవియాకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వివరించారు. దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రాల వైద్యశాఖ మంత్రులతో కేంద్ర మంత్రి మాండవియా శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడుతూ గడిచిన రెండు వారాల్లో రాష్ట్రవ్యాప్తంగా 15,096 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, ఇందులో 267 మందికి పాజిటివ్ అని తేలిందన్నారు. ప్రస్తుతం వీరంతా ఇంటి వద్దే ఉంటూ వైద్యసేవలు పొందుతున్నారని చెప్పారు. వైరస్ వ్యాప్తి విషయంలో సీఎం వైఎస్ జగన్ నిరంతరం వైద్య, ఆరోగ్యశాఖను అప్రమత్తం చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రానికి మరో 20 లక్షల బూస్టర్ డోసులను కేంద్రం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్సిజన్ ప్లాంట్లు, పీహెచ్‌సీల నిర్వహణ తదితర అవసరాలకు అయ్యే ఖర్చును నేషనల్ హెల్త్ మిషన్ భరించాలని కోరారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ ఊరిలోనే అందుతున్నాయి

కలెక్టర్, ఎస్పీ ఎదుట గిరిజనుల ఆనందం



గొర్లి గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

జియ్యమ్మవలస: 'మా గిరిజన గ్రామాలకు సెల్‌టవర్లు వస్తాయని ఊహించలేదు. ప్రభుత్వం, అధికారుల చొరవతో కొండలపై సెల్‌టవర్లు ఏర్పాటయ్యాయి. సిగ్నల్స్ కోసం కొండలు ఎక్కే బాధ తప్పింది...' అని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజనులు సంతోషం వ్యక్తంచేశారు. జియ్యమ్మవలస మండలంలోని గొర్లి, గుమ్మలక్ష్మీపురం మండలంలోని బీరుపాడు గ్రామాలకు శుక్రవారం కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బైక్‌పై వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన సెల్‌టవర్లను పరిశీలించిన అనంతరం గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ 'వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక గిరిజనుల బతుకులు మారుతున్నాయి. మొబైల్ సిగ్నల్స్ సమస్యలు తొలగడంతో ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగా ఉన్న సచివాలయంలోనే అందుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో 108కి ఫోన్ చేస్తున్నాం. బంధుమిత్రులతో ఫోన్‌లో ఆనందంగా మాట్లాడుకోగలుగుతున్నాం..' అని చెప్పారు. బీరుపాడు వెలుగు సీసీ శ్రీరాములు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు, బస్సు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిజిటల్ విప్లవం ప్రారంభమైందని, 170 మొబైల్ టవర్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• తెలంగాణ

పిల్లలు, మహిళలపై రక్తహీనత పంజా

- తెలంగాణలో మహిళల్లో 57.6 శాతం, పిల్లల్లో 70 శాతం మంది బాధితులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మహిళలు, పిల్లలను రక్తహీనత పట్టి పీడిస్తోంది. తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా పరిణమించింది. 15–49 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో 57.6 శాతం, ఐదేళ్ల లోపు పిల్లల్లో 70 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ మేరకు తాజాగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నివేదికలో పలు వివరాలు పేర్కొంది. పిల్లల రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి 11 హెచ్‌బీ కంటే తక్కువగా ఉంటే రక్తహీనత కలిగినవారిగా వర్గీకరించారు. అంతకుముందు ఐదేళ్లతో పోల్చినప్పుడు మహిళల్లో రక్తహీనత ఒక శాతం పెరిగింది. 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు మహిళల రక్తహీనతలో తెలంగాణ 16వ స్థానంలో నిలిచింది. దేశంలో అత్యధికంగా లడక్‌లో 92.8 శాతం మంది, అత్యంత తక్కువగా లక్షద్వీప్‌లో 25.8 శాతం మంది రక్తహీనత బాధితులున్నారు.

క్లుప్తంగా...

'ఒబాన్' దొరికింది



షియోపూర్: మధ్యప్రదేశ్ రాష్ట్రం షియోపూర్‌లోని కునో నేషనల్ పార్క్(కేఎన్‌పీ) నుంచి ఈనెల 2న తప్పించుకుపోయిన మగ చీతా ఒబాన్ ఎట్టకేలకు దొరికింది. పొరుగునే శివ్‌పురి జిల్లా బైరాడ్ ఏరియా అటవీ ప్రాంతంలో ఇది కృష్ణజింకను వేటాడిందని అధికారులు తెలిపారు. దాని జాడలు తెలుసుకుని గురువారం సాయంత్రం పట్టుకుని తిరిగి కేఎన్‌పీలో వదిలిపెట్టినట్లు చెప్పారు. గత ఏడాది నమీబియా నుంచి తీసుకువచ్చిన 8 చీతాల్లో ఒబాన్ ఒకటి.

గర్వించదగిన రోజు

సుధామూర్తి పద్మభూషణ్ స్వీకరించడంపై యూకే ప్రధాని రిషి సునాక్ హర్షం



లండన్: ఇన్ఫోసిస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి భార్య, రచయిత, సంఘ సేవకురాలు సుధా నారాయణమూర్తి ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ పురస్కారం స్వీకరించడం పట్ల వారి అల్లుడు, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్, కుమార్తె అక్షతా మూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా సుధా నారాయణమూర్తి పద్మభూషణ్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి అక్షతా మూర్తి కూడా హాజరయ్యారు. తన తల్లి అవార్డు అందుకుంటున్న ఫొటోను అక్షతా మూర్తి తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''భారత రాష్ట్రపతి నుంచి మా అమ్మ పద్మభూషణ్ అవార్డు అందుకుంటున్న క్షణాలను చూసి నేను ఎంతో గర్వించాను. సమాజానికి ఆమె చేసిన సేవలకుగాను ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె జీవితం నాకొక ఉదాహరణ. గత 25 ఏళ్లుగా సమాజ సేవలో నిమగ్నమయ్యారు. నా తల్లి కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు నాకెంతో స్ఫూర్తిని కలిగిస్తున్నాయి'' అంటూ అక్షతా మూర్తి తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఈ పోస్టుపై ఆమె భర్త రిషి సునాక్ స్పందించారు. ''గర్వించదగిన రోజు'' అంటూ కామెంట్ చేశారు.



దగ్గరవుతున్న సౌదీ అరేబియా, ఇరాన్

చైనా మధ్యవర్తిత్వం

మధ్య ప్రాచ్యంపై పట్టుకు యత్నం

అమెరికా పెత్తనాన్ని అడ్డుకునేందుకే

విద్వేష గీతం

వరుస మారింది

బద్ధ విరోధులైన సౌదీ అరేబియా, ఇరాన్ క్రమంగా దగ్గరవుతున్నాయి. దశాబ్దాల వైరానికి తెర దించే దిశగా సాగుతున్నాయి. దౌత్య బంధాలను పునరుద్ధరించుకోవడంతో పాటు ఆర్థిక సంబంధాలను కూడా బలోపేతం చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాయి. మధ్య ప్రాచ్యంపై పట్టు పెంచుకునే యత్నాల్లో భాగంగా ఈ సయోధ్యకు చైనా మధ్యవర్తిత్వం వహిస్తోంది. అంతర్జాతీయంగా అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ పరిణామాన్ని చైనాకు కీలక దౌత్య విజయంగా భావిస్తున్నారు. రెండు శత్రు దేశాల మధ్య సయోధ్య యత్నాల్లో డ్రాగన్ దేశం నేరుగా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాపై అమెరికా పెత్తనానికి బీటలు వారుతున్నట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది...

పశ్చిమాసియాలో చిరకాల ప్రత్యర్థులైన సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య మొగ్గతొడుగుతున్న కొత్త దోస్తీ ఒక రకంగా అనూహ్యమే. ఇది ప్రపంచ దేశాలను కాస్త ఆశ్చర్యపరిచింది కూడా. 2016లో షియా మత పెద్దను సౌదీ చంపేయడం, ప్రతిగా ఇరాన్‌లోని ఆ దేశ దౌత్య కార్యాలయాలపై దాడులతో దశాబ్దాల వైరం తారస్థాయికి చేరింది. దౌత్య తదితర సంబంధాలన్నీ తెగిపోయాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాలూ దగ్గరయ్యే ప్రయత్నాలు 2021 నుంచీ జరుగుతున్నాయి. చైనా చొరవతో అవి రెండు నెలలుగా ఊపందుకున్నాయి. నెల రోజులుగా బీజింగ్ వేదికగా ఇరు దేశాల మధ్య జరుగుతున్న మంత్రుల స్థాయి భేటీలు సయోధ్యకు గట్టి పునాదులే వేశాయి. విదేశాంగ మంత్రులు హొస్సైన్ అమిరబ్దొల్లాహియాన్ (ఇరాన్), ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ (సౌదీ) బీజింగ్‌లో తాజాగా చర్చలు జరిపారు. ఇరు దేశాల్లో పరస్పరం దౌత్య కార్యాలయాలను తిరిగి తెరిచేందుకు అంగీకారానికి వచ్చారు. రెండు దేశాల మధ్య విమాన సర్వీసులతో పాటు వీసా జారీకి అవకాశాలను పరిశీలించనున్నట్టు హొస్సైన్ తెలిపారు. ఈ పరిణామాలు పశ్చిమాసియా ప్రాంతీయ, భౌగోళిక రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపవచ్చంటున్నారు. ''యెమెన్ నుంచి లెబనాన్ దాకా వేర్పాటువాద పోరాటాల్లో చెరో వైపుండి ఇరాన్–సౌదీ చేస్తున్న ప్రచ్ఛన్న యుద్ధానికి తెర పడుతుంది. ఇది పశ్చిమాసియాలో రాజకీయ స్థిరత్వానికి దారి తీయవచ్చు''అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇదంతా సౌదీ–ఇరాన్ బంధం ఏ మేరకు గట్టిపడుతుందనే దానిపై ఆధారపడి ఉంటుందన్నది వారి అభిప్రాయం.

దశాబ్దాల వైరం

సౌదీ అరేబియా, ఇరాన్ వైరం ఈనాటిది కాదు. 1979 విప్లవంతో ఇరాన్‌లో రాచరికానికి తెర పడి మతవాద శక్తుల ఆధిపత్యంతో కూడిన ప్రభుత్వం ఏర్పడటంతో అది మరింత ముదిరింది.

- ఇరాన్ ప్రధానంగా షియా ఆధిపత్య దేశం కాగా సౌదీ అరేబియా సున్నీ ప్రాబల్య దేశం.
- ప్రాంతీయంగా ఆధిపత్య కాంక్ష తదితరాలు వాటి శత్రుత్వానికి మరింత ఆజ్యం పోశాయి.
- 2016లో ప్రముఖ షియా నేత షేక్ నిమ్ర్ అల్ నిమ్ర్‌ను ఉగ్రవాద ఆరోపణలపై సౌదీ తల నరికి చంపడంతో ఇరాన్ భగ్గుమంది. భారీ మూల్యం తప్పదని హెచ్చరించింది. మధ్య ప్రాచ్యంలోని పలు దేశాల్లో సౌదీ వ్యతిరేక పోరాట గ్రూపులకు బాసటగా నిలవసాగింది.
- ఇరాక్, సిరియా, యెమన్, లెబనాన్ వంటి పలు దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాల్లో సౌదీ, ఇరాన్ చెరో వర్గం వైపు నిలిచి ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయి. సిరియాలో రెబెల్ గ్రూపులకు సౌదీ మద్దతిస్తుండగా అధ్యక్షుడు అల్ బషర్‌కు ఇరాన్ దన్నుగా నిలిచింది.
- సరిహద్దు దేశమైన యెమన్‌లో తాము అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న హౌతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ సాయుధ, ఆర్థిక సాయం చేస్తోందని సౌదీ గుర్రుగా ఉంది.
- 2003లో అమెరికా ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను గద్దె దించడంతో అక్కడ సున్నీల ఆధిపత్యానికి తెర పడింది. అప్పటినుంచీ ఇరాక్‌లోని షియా ప్రాబల్య ప్రభుత్వంపైనా ఇరాన్ పట్టు పెరిగింది. తాజా చర్చల అనంతరం యెమెన్‌లోని హౌతీలకు సాయాన్ని నిలిపేసేందుకు ఇరాన్ అంగీకరించిందని సమాచారం.
- పశ్చిమాసియాలో ఇటీవల మార్పు పవనాలు వీస్తున్నాయి. వైరి దేశాలు స్పర్థలను పక్కన పెట్టి ఒక్కటవుతున్నాయి. అరబ్ దేశమైన యూఏఈ 2020లో ఇజ్రాయెల్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునే దిశగా ముందడుగు వేసింది.

చైనా.. పశ్చిమాసియాలో పవర్ బ్రోకర్


అమెరికా స్థానంలో పశ్చిమాసియాలో పెద్దన్న పాత్రను పోషించేందుకు చైనా కొన్నేళ్లుగా గట్టి ప్రయత్నాలే చేస్తోంది.

- 2015లో ఇరాన్ అణు ఒప్పందం వంటి బహుపాక్షిక శాంతి చర్చల్లో చైనా చురుగ్గా పాల్గొంది. తొలుత అమెరికా కూడా భాగస్వామిగా ఉన్నా 2018లో ఉన్నట్టుండి వైదొలగింది.
- చైనా ప్రపంచంలో అతి పెద్ద చమురు దిగుమతిదారు. అందుకే చమురు నిల్వలు బాగా ఉన్న పశ్చిమాసియాపై పట్టు కోసం ప్రయత్నిస్తోంది.
- అటు ఇరాన్‌తో, ఇటు సౌదీ అరేబియాతో చైనాకు ముందునుంచీ మంచి సంబంధాలే ఉన్నాయి. మరోవైపు ఇరాన్, అమెరికా మధ్య ముందునుంచీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి! సౌదీతో కూడా అమెరికా సంబంధాలు కొంతకాలంగా క్షీణిస్తున్నాయి. ముఖ్యంగా బైడెన్ హయాంలో అవి మరీ దిగజారాయి.
- పొరుగునున్న యెమెన్‌లోని హౌతీ మూకలతో చిరకాల పోరాటంతో అలసిన సౌదీ శాంతి మంత్రం జపిస్తోంది. అమెరికా ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఇరాన్ కూడా ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాల కోసం చూస్తోంది. ఈ పరిస్థితులు చైనాకు కలసి వచ్చాయి.
- చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గత డిసెంబర్‌లో రియాద్ వెళ్లి సౌదీ–ఇరాన్ నాయకత్వంతో మంతనాలు జరిపారు. తర్వాత ఫిబ్రవరిలో ఇరాన్ అధ్యక్షునితో బీజింగ్‌లోనూ చర్చలు జరిపి ఇరు దేశాల చర్చలకు రంగం సిద్ధం చేశారు.
- మధ్య ప్రాచ్యంతో అమెరికా వర్తకమూ క్రమంగా క్షీణిస్తోంది. 2019లో 120 బిలియన్ డాలర్ల నుంచి 2021లో 80 బిలియన్ డాలర్లకు తగ్గింది.
- మరోవైపు మధ్య ప్రాచ్య దేశాలతో వాణిజ్య సంబంధాలను చైనా నానాటికీ పెంచుకుంటూ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈజిప్ట్, ఇరాన్, జోర్డాన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈలకు అతి పెద్ద వ్యాపార భాగస్వామిగా చైనా అవతరించింది.

–సాక్షి, నేషనల్ డెస్క్

టైమ్ 100 అగ్రస్థానంలో బాలీవుడ్ బాద్‌షా

- లియోనల్ మెస్సీ, హ్యారీ–మేఘన్‌లను మించి ఓట్లు
- పోలైన 12 లక్షల ఓట్లలో 4% ఓట్లు షారుఖ్ ఖాన్‌కే
- వెల్లడించిన టైమ్ మ్యాగజీన్



న్యూఢిల్లీ: 'పఠాన్'సినిమాతో మాంచి ఊపుమీదున్న బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్(57)కు ఓ అరుదైన గౌరవం దక్కింది. టైమ్ మ్యాగజీన్ 2023 సంవత్సరానికి నిర్వహించిన ప్రభావశీల వ్యక్తుల జాబితా 100లో అత్యధిక ఓట్లతో ఆయన అగ్రస్థానంలో నిలిచారు. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ, ప్రిన్స్ హ్యారీ–మేఘన్ దంపతులు, ఆస్కార్ విజేత మిచెల్ యియోహ్, మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌లకు మించి ఆయనకు ఓట్లు పడ్డాయని టైమ్ మ్యాగజీన్ తెలిపింది. ఈ ఏడాది ప్రభావశీల వ్యక్తుల జాబితాలో అర్హులుగా ఎవరుండాలని అను కుంటున్నారన్న ప్రశ్నకు ప్రపంచవ్యాప్తంగా అనేక మంది స్పందించారని పేర్కొంది. మొత్తం 12 లక్షల ఓట్లలో 'పఠాన్'స్టార్‌కు 4%పైగా ఓట్లు పోలయ్యాయని వెల్లడించింది. ఈ నెల 13న తమ ఎడిటర్స్ టాప్100 జాబితాపై అభిప్రాయాలను వెల్లడించాక అంతిమ ఫలితాన్ని ప్రకటిస్తామని తెలిపింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత లీడ్ రోల్‌లో షారుఖ్ నటించిన పఠాన్ సినిమా జనవరిలో ప్రపంచవ్యాప్తంగా విడుదలై పెద్ద హిట్టయ్యింది. ఇప్పటి వరకు వెయ్యి కోట్లకు పైగా వసూలు చేసింది. టాప్ 100 రెండో స్థానంలో కఠిన ఇస్లామిక్ పాలన నుంచి స్వేచ్ఛ కావాలని ఉద్యమిస్తున్న ఇరాన్ మహిళలకు 3 శాతం ఓట్లు పోలయ్యాయి. టైమ్ 2022 జాబితాలోనూ హీరోస్ ఆఫ్ ది ఇయర్‌ను ఇరాన్ మహిళలే గెలుచుకోవడం గమనార్హం. ఆ తర్వాత బ్రిటన్ ప్రిన్స్ హ్యారీ, మేఘన్ మార్కెల్ దంపతులు 1.9% ఓట్లతో వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో నిలిచారు. గత ఏడాది ఖతార్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌పై అర్జెంటీనాకు చారిత్రక విజయం సాధించి పెట్టిన లియోనల్ మెస్సీ 1.8% ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానాల్లో నిలిచిన ప్రముఖుల్లో ఈ ఏడాది ఆస్కార్ ఉత్తమ నటి విజేత యియోహ్, టెన్నిస్ క్రీడాకారిణి సెరీనా విలియమ్స్, జుకర్‌బర్గ్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా ఉన్నారని టైమ్ మేగజీన్ తెలిపింది.

జోడో యాత్రతో కొత్త జాతీయ ఒరవడి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ ఒక బలమైన నూతన జాతీయ ఒరవడిని సృష్టించారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. దేశంలో నానాటికీ పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం పెరుగుదలను యాత్ర సందర్భంగా రాహుల్ ప్రముఖంగా లేవనెత్తారని గుర్తుచేశారు. 2013తో పోలిస్తే 2023లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయానని వెల్లడించారు. గత పదేళ్లలో ఇంటి బడ్జెట్ తీవ్రంగా ప్రభావితమైందని తెలిపారు. ఈ మేరకు పట్టికను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఈ పట్టికను గమనించాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను, నిర్వాకాలను రాహుల్ గాంధీ ప్రజల్లోకి తీసుకెళ్లడంతో అధికార బీజేపీ బెంబేలెత్తిపోతోందని వెల్లడించారు. అందుకే రాహుల్‌పై బురద చల్లుతోందని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. రాహుల్ సృష్టించిన నూతన ఒరవడి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ కుతంత్రాలు పన్నుతోందని ఆరోపించారు.

కూలిన జపాన్ ఆర్మీ హెలికాప్టర్..10 మంది గల్లంతు

టోక్యో: జపాన్ దక్షిణ దీవుల్లో కుమమోటో నుంచి నిఘా విధుల్లో భాగంగా గురువారం బయలుదేరిన బ్లాక్‌హాక్ రకం హెలికాప్టర్ 10 నిమిషాల అనంతరం రాడార్ నుంచి అదృశ్యమైంది. అది మియాకో, ఇరాబు మధ్య సముద్రజలాల్లో కూలి ఉంటుందని భావిస్తున్నారు. ఆ హెలికాప్టర్‌కు చెందిన లైఫ్‌బోట్‌ను, ఒక తలుపు, తదితర భాగాలను శుక్రవారం సహాయక సిబ్బంది కనుగొన్నారు. హెలికాప్టర్‌లోని డివిజన్ కమాండర్ సహా 10 మంది సిబ్బంది కోసం గాలింపు కొనసాగుతోంది. వీరిలో ఎవరూ ప్రాణాలతో ఉండేందుకు అవకాశం లేదంటూ జపాన్ రక్షణ మంత్రి యసుకాజు హమదా శుక్రవారం మీడియా సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. వారికోసం గాలింపు కొనసాగిస్తామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పారు. నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమైనట్లు చెప్పారు. చైనా నుంచి ఎదురవుతున్న భద్రతా పరమైన సవాళ్ల నేపథ్యంలో జపాన్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో రక్షణ సన్నద్ధత కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే హెలికాప్టర్ ప్రమాదానికి గురికావడం గమనార్హం.

కరోనాతో జాగ్రత్త

నిర్ధారణ పరీక్షలు, వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలి

- నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులతో సమీక్ష

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి మళ్లీ వేగంగా పెరిగిపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ శుక్రవారం రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, అదనపు ముఖ్య కార్యదర్శులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని, కోవిడ్–19 మేనేజ్‌మెంట్ కోసం సన్నద్ధం కావాలని సూచించారు. కరోనా లక్షణాలు ఎక్కడ అధికంగా వ్యాప్తిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు గుర్తించాలని చెప్పారు. ఎమర్జెన్సీ హాట్‌స్పాట్లలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలతోపాటు వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన నమూనాల జినోమ్ సీక్వెన్సింగ్‌ను పెంచాలని కోరారు. కోవిడ్–19 వ్యాప్తి, నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రజా చైతన్యం ద్వారానే వైరస్ నియంత్రణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలి

గతంలో కరోనా వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేశాయని, చక్కని ఫలితాలు సాధించాయని మాండవీయ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో సమన్వయంతో పనిచేయాలన్నారు. పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆరోగ్య శాఖ సన్నద్ధతపై ఈ నెల 8, 9న జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించాలని రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు పిలుపునిచ్చారు. 10, 11న ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై మాక్‌డ్రిల్స్ నిర్వహించాలన్నారు. కొత్త వేరియంట్లతో సంబంధం లేకుండా వైరస్ నియంత్రణకు ఐదు అంచెల వ్యూహాన్ని అమలు చేయాలని వివరించారు. టెస్ట్–ట్రాక్–ట్రీట్–వ్యాక్సినేట్‌తోపాటు కోవిడ్–19 నియంత్రణ చర్యల పటిష్ట అమలుతో సత్ఫలితాలు లభిస్తాయని వెల్లడించారు. అర్హులైన వారందరికీ కరోనా టీకాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కోవిడ్–19 బాధితులకు ఆసుపత్రుల్లో సరిపడా పడకలు సిద్ధంగా ఉండేలా, ఔషధాలు లభ్యమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామి, తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు తోపాటు వివిధ రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు పాల్గొన్నారు.



6 వేల మార్కు దాటిన కోవిడ్ కేసులు

దేశంలో కరోనా కేసులు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా శుక్రవారం 203 రోజుల తర్వాత 24 గంటల వ్యవధిలో కొత్తగా 6,050 కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో యాక్టివ్ కేసులు 28,303కు చేరుకున్నట్లు శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్ 16న 6,298 కేసులు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొంది. మొత్తం కేసులు 4.47 కోట్లకు చేరాయి. దీంతోపాటు, మరో 14 మరణాలు నమోదు కావడంతో మొత్తం మరణాలు 5,30,943కు చేరాయి. రోజువారీ పాజిటివిటీ రేట్ 3.39%కాగా, మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.06%గా ఉంది.

ప్రతి 10 లక్షల జనాభాకు 100 టెస్టులు

ఎక్స్‌బీబీ.1.5తోపాటు బీక్యూ.1, బీఏ.2.75, సీహెచ్.1.1, ఎక్స్‌బీబీ, ఎక్స్‌బీఎఫ్, ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఒమిక్రాన్, దాని ఉప వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని వెల్లడించింది. ఇతర వేరియంట్ల ప్రభావం బాగా తగ్గిందని పేర్కొంది. ఎక్స్‌బీబీ.1.16 అనే వేరియంట్ వ్యాప్తి ఫిబ్రవరిలో 21.6 శాతం ఉండగా, మార్చిలో 35.8 శాతానికి చేరిందని వివరించింది. అయితే, వైరస్ వ్యాప్తి పెరిగినప్పటికీ ఆసుపత్రుల్లో చేరికలు, మరణాలు పెద్దగా నమోదు కాలేదని స్పష్టం చేసింది. దేశంలో ప్రతి 10 లక్షల జనాభాకు నిత్యం సగటున 100 కరోనా నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది. నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కోరింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, హరియాణాలో కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు పేర్కొంది.

క్రైస్తవ మిషనరీల కంటే హిందూ ఆధ్యాత్మిక సంస్థల సేవలు అపారం

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్



జైపూర్: దక్షిణ భారతదేశంలో క్రైస్తవ మిషనరీల కంటే హిందూ ఆధ్యాత్మిక సంస్థలే ప్రజలకు ఎక్కువ సేవలు అందిస్తున్నాయని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్ చెప్పారు. మిషనరీలతో పోలిస్తే హిందూ ఆధ్యాత్మిక గురువులు సమాజ సేవలో ఎన్నో రెట్లు ముందంజలో ఉంటున్నారని ప్రశంసించారు. అయితే, ఇది పోటీకి సంబంధించిన విషయం కాదని అన్నారు. రాజస్తాన్ రాజధాని జైపూర్ సమీపంలోని జామ్‌డోలీలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన కేశవ్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సేవ సంగమ్ సదస్సును మోహన్ భగవత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజ సేవ గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా మన దేశంలో మేధావులు క్రైస్తవ మిషనరీల గురించి మాట్లాడుతుంటారని చెప్పారు. మిషనరీలు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో విద్యాసంస్థలను, ఆసుపత్రులను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు తమ వంతు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. కానీ, దక్షిణ భారతదేశంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు మాట్లాడే హిందూ మత గురువులు, ఆచార్యులు, సన్యాసులు అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువ సేవలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. సేవ అంటే సేవ మాత్రమేనని, ఇది పోటీ కాదని వివరించారు. నిస్వార్థంగా ప్రజలకు అందించే సేవలను కొలవలేమని వ్యాఖ్యానించారు. సేవ అనేది సహజ మానవత్వ వ్యక్తీకరణ అని మోహన్ భగవత్ తెలియజేశారు. మనమంతా సమాజంలో భాగమేనని, ఐక్యంగా లేకపోతే మనం పరిపూర్ణం కాదని తేల్చిచెప్పారు. సమాజంలో అసమానతలు ఎంత మాత్రం వాంఛనీయం కాదన్నారు. దురదృష్టవశాత్తూ అసమానతలు కొనసాగుతున్నాయని వివరించారు. సేవ అనేది ఆరోగ్యకరమైన మనుషులను, ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు.

ప్రమాదం వారసత్వ రాజకీయాలకే.. ప్రజాస్వామ్యానికి కాదు!: అమిత్ షా



కౌశాంబి: వారసత్వ రాజకీయాలు, కులవాదానికే ప్రమాదం తప్ప దేశ ప్రజాస్వామ్యానికి ఎటువంటి ప్రమాదం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కులతత్వం, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు అనే మూడు అల్సర్లతో కాంగ్రెస్ పార్టీ భారత ప్రజాస్వామ్యాన్ని చుట్టుముట్టిందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ ఈ మూడింటినీ తొలగించి వేసినందుకే, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు భయపడుతోందని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ యూకేలో ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు బదులిచ్చారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబిలో 'కౌశాంబి మహోత్సవ్'ను ప్రారంభించి, అనంతరం జరిగిన సభలో అమిత్ షా ప్రసంగించారు. తమ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుపడిందనే ఒకే ఒక్క కారణంతో పార్లమెంట్ సమావేశాలను సవ్యంగా సాగనీయని కాంగ్రెస్‌ను దేశం క్షమించదని అమిత్ షా ఆరోపించారు. ఎటువంటి కార్యకలాపాలు, చర్చ లేకుండానే బడ్జెట్ సమావేశాలు ముగియడం పార్లమెంట్ చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. గతంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టంలోని నిబంధనల ప్రకారమే రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయిందని ఆయన చెప్పారు. ఒక్క రాహుల్ గాంధీయే కాదు, ఈ చట్టం కింద ఇప్పటి వరకు 17 మంది ఎమ్మెల్యేలు, ఎంపీల సభ్యత్వాలు రద్దయ్యాయన్నారు. చట్టానికి లోబడి నడుచుకుని, హైకోర్టులో అనర్హత వేటు నుంచి బయటపడాలని రాహుల్‌కు సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రధాని మోదీని 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు.

సర్కారు బడి కూల్చివేతకు బీజేపీ యత్నాలు: ఆప్

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించే పార్టీ కేంద్ర కార్యాలయం కోసం బీజేపీ ప్రభుత్వ పాఠశాలను కబ్జా చేస్తోందని ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయాన్ని అనుకుని ఉన్న పాఠశాల స్థలాన్ని ఇప్పటికే కొంత ఆక్రమించిన బీజేపీ..ఇప్పుడు అభివృద్ధి పేరుతో భవనాన్ని సైతం కూలగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆప్ అలా జరగనీయబోదని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. స్కూలు భవనాన్ని కూలగొడితే 350 మంది పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని చెప్పారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఒక్క స్కూల్‌ను కూడా ధ్వంసం కానివ్వమన్నారు.

పేద ఖైదీలకు ఆర్థిక భరోసా

న్యూఢిల్లీ: జరిమానా సొమ్ము గానీ, బెయిల్ రుసుము గానీ చెల్లించే స్తోమత లేక జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీలకు ఆర్థిక భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. దీనివల్ల అర్హులైన ఖైదీలకు జైళ్ల నుంచి విముక్తి లభించనుంది. జైళ్లపై భారం తగ్గనుంది. కొత్త పథకంతో నిమ్న కులాలు, పేద కుటుంబాలు, బలహీన వర్గాలకు చెందిన ఖైదీలకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వారికి ఆర్థిక భరోసా కల్పించే పథకంపై భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంది. ఆధునిక టెక్నాలజీ సాయంతో పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేసింది. ఇందులో భాగంగా ఈ–ప్రిజన్స్ వేదిక ఏర్పాటు, జిల్లా న్యాయ సేవా సంస్థలను బలోపేతం చేస్తామంది.

దక్షిణ లెబనాన్, గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు



గాజా స్ట్రిప్‌లో ఎగిసిపడుతున్న మంటలు

జెరూసలేం: దక్షిణ లెబనాన్‌తోపాటు పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లోని హమాస్ ఉగ్రవాద శిబిరాలపై శుక్రవారం తెల్లవారుజామున వైమానిక దాడులు నిర్వహించింది. బాంబుల వర్షం కురిపించింది. దీంతో పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో యూదులు పాస్‌ఓవర్ అనే వేడుకలు జరుపుకుంటున్నారు. మరోవైపు ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం దక్షిణ లెబనాన్ భూభాగం నుంచి ఉగ్రవాదులు ఇజ్రాయెల్ వైపు 30కిపైగా రాకెట్లు ప్రయోగించారు. ఈ ఘటనలో ఇజ్రాయెల్‌లో ఇద్దరు గాయపడ్డారు. స్వల్పంగా ఆస్తి నష్టం వాటిల్లింది. రాకెట్ల ప్రయోగానికి ప్రతీకార చర్యగా ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లో పాతుకుపోయిన పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ శిబిరాలే లక్ష్యంగా వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. యుద్ధ విమానాల ద్వారా ఇజ్రాయెల్ సైన్యం ప్రయోగించిన క్షిపణులు లెబనాన్‌లో టైర్ సమీపంలోని రషీదియా పాలస్తీనా కాందిశీకుల క్యాంప్ వద్ద నేలను తాకాయని అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ ఒకరు వెల్లడించారు. లెబనాన్‌లోని హిజ్బుల్లా మిలీషియాకు ఇరాన్ అండదండలు అందిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యంపై హిజ్బుల్లా మిలీషియా దాడులు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. అయితే, తాము కేవలం పాలస్తీనా మిలిటెంట్ల శిబిరాలపైనే వైమానిక దాడులు జరిపామని ఇజ్రాయెల్ సైన్యం స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో పాలస్తీనా వాసి ఒకరు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మహిళలు మృతి చెందారు.



శుక్రవారం అసోంలోని కజిరంగ నేషనల్ పార్కులో గజ్ ఉత్సవ్-2023 ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం బెంగళూరు నీలసంద్రలోని చర్చిలో ప్రార్థనలు

న్యూస్‌రీల్

భర్త చాక్లెట్ తేలేదని ఆత్మహత్య



నందిని(ఫైల్)

కృష్ణరాజపురం: సమాజంలో మహిళలు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ ఆత్మస్థైర్యంతో జీవనం సాగిస్తున్నారు. ఇందుకు భిన్నంగా ఇద్దరు పిల్లలున్న ఓ మహిళ చిన్న కారణానికి క్షణికావేశంలో చేజేతులా జీవితాన్ని అంతం చేసుకుంది. భర్త చాక్లెట్ తేలేదని ఉరి వేసుకుంది. ఈ ఘటన నగరంలో హెణ్ణూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెణ్ణూరులో నందిని (30) అనే మహిళ తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సెలూన్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం భర్త సెలూన్‌కు వెళ్లే సమయంలో తనకు చాక్లెట్ తేవాలని కోరింది. అతను ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. దీంతో నందిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త మధ్యాహ్న సమయంలో ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వచ్చి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించింది. హెణ్ణూరు పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

దాడి కేసులో యువకులకు శిక్ష

శివమొగ్గ: యువకులపై దాడి చేసిన కేసులో ఐదుగురికి కోర్టు మూడేళ్ల కఠిన శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. వివరాలు...కొరమకెరె గ్రామానికి నవీన్, నితిన్‌లపై అదే గ్రామానికి చెందిన విజయ్, ప్రవీణ్, నవీన్, చేతన్, సంతోష్‌లు కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో వారు ఆస్పత్రిలో కోలుకున్నారు. ఈ ఘటన 2018 జనవరి ఒకటో తేదీన జరిగింది. స్థానిక తుంగానగర పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. శివమొగ్గ నగర 3వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మాను కేసు పూర్వాపరాలు విచారణ చేసి నేరం రుజువైనట్లు ప్రకటించారు. ఐదుగురికి మూడేళ్ల కఠిన శిక్షతో పాటు రూ.65 వేల జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

దత్తకు కాంగ్రెస్ మొండిచేయి

యశవంతపుర: జేడీఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వైఎస్వీ దత్తకు చేదు అనుభవం ఎదురైంది. కాంగ్రెస్‌లో టికెట్ దక్కని కారణంగా ఈ నెల 9న తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. శుక్రవారం ఆయన చిక్కమగళూరు జిల్లా కడూరులో తన మద్దతుదారులతో కలిసి సమావేశం నిర్వహించారు. రాజకీయంగా కడూరు ప్రజలు, అభిమానులు తీసుకొనే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానన్నారు. కడూరులో 9న ఉదయం సమావేశం నిర్వహించి ఒక నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. తనకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవటానికి కారణాలపై విశ్లేషించుకున్నారు.

షిరిడీ ప్రయాణికులకు షాక్ ఇచ్చిన స్పైస్‌జెట్



స్పైస్‌జెట్ సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం

దొడ్డబళ్లాపురం: షిరిడీకి వెళ్లాల్సిన బాబా భక్తులకు స్పైస్‌జెట్ సంస్థ షాక్ ఇచ్చింది. దీంతో 70 మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం మధ్యాహ్నం 1.45 గంటలకు బెంగళూరులోని కెంపేగౌడ విమానాశ్రయం నుంచి షిరిడీ వెళ్లడానికి 70మంది ప్రయాణికులు సిద్ధమయ్యారు. బోర్డింగ్ పాస్ కూడా చెక్ చేయించుకున్నారు. అయితే విమానం నాలుగు గంటల ఆలస్యంగా బయలుదేరుతుందని అనౌన్స్ చేశారు. నాలుగు గంటలు గడిచిన తరువాత విమానం క్యాన్సిల్ చేశామని ప్రకటించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదు. దీంతో ఆగ్రహించిన ప్రయాణికులు స్పైస్‌జెట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని షిరిడీ వెళ్లారు.

లోకాయుక్తకు చిక్కిన అధికారులు

మైసూరు: చామరాజనగర జిల్లా గుండ్లుపేటె వ్యవసాయ శాఖ కార్యాలయానికి చెందిన ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కారు. వివరాలు... ఓ కంపెనీకి సంబంధించిన బిల్లు మంజూరు చేసే విషయానికి సంబంధించి రూ.2.50 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నగదు మారుతున్న సమయంలో లోకాయుక్త అధికారులు దాడి చేసి వ్యవసాయ శాఖ కార్యాలయం సహాయక డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ విభాగం అధికారి సతీశ్, డీగ్రూప్ ఉద్యోగి అరుణను పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు

కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసమ్మతి

- తలనొప్పిగా మారిన టికెట్ల కేటాయింపు
- టికెట్లు రాని అభ్యర్థులకు నేతల బుజ్జగింపు

సాక్షి,బళ్లారి: విధానసభ ఎన్నికల్లో టికెట్ల కేటాయించడం కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. మొదటి జాబితాలో 124 మంది అభ్యర్థులను ప్రకటించిన సమయంలో ఎలాంటి అసమ్మతి తలెత్తలేదు. గురువారం ప్రకటించిన రెండో జాబితాలో 42 మంది పేర్లను ప్రకటించగా ఒక్కసారిగా అసమ్మతి పతాక స్థాయికి చేరింది. పలు నియోజకవర్గాల్లో ఇద్దరు, ముగ్గురు టికెట్ కోసం తీవ్ర పోటీ పడి చివరికి జాబితాలో పేర్లు లేకపోవడంతో అసమ్మతికి గురై పార్టీ నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. అభ్యర్థుల ఓటమి ఖాయమని అసమ్మతి నేతలు బహిరంగంగా విమర్శలు చేయడంతో మాజీ సీఎం సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లు రంగంలోకి దిగి అసమ్మతిని బుజ్జగించేందుకు యత్నిస్తున్నారు.

రెండో జాబితా వెల్లడితో పెరిగిన అసంతృప్తి

రెండో జాబితా ప్రకటించిన తర్వాత చిత్రదుర్గలో రఘు ఆచార్, కలఘటగిలో నాగరాజ్ చబ్బి, యాదగిరిలో అనురాధ మాలకరెడ్డి, కడూరులో వైఎస్వీ దత్త, తీర్థహళ్లిలో మంజునాథ్‌గౌడ, మొళకాల్మూరులో యోగేష్ బాబు, గోకాక్‌లో అశోక్ పూజారి, నరగుందలో సంగమేశ్ తదితర టికెట్ దక్కని నాయకులు తమ అభిమానులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తూ స్వతంత్రంగా బరిలోకి దిగేందుకు పలువురు వ్యూహరచన చేస్తుండటంతో కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. బళ్లారి జిల్లా కంప్లి నుంచి టికెట్ ఆశించిన రాజునాయక్ టికెట్ దక్కకపోవడంతో జేడీఎస్ తరపున పోటీ చేస్తుండటంతో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా, మరికొందరు పార్టీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు. చిత్రదుర్గ జిల్లా కాంగ్రెస్‌లో అసమ్మతి మరింత రాజుకుంటోంది. చిత్రదుర్గ, మండ్య జిల్లాల్లో ముఖ్య నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా సఫలం కాకపోవడంతో తిరుగుబాటు జెండా ఎగరవేసి పార్టీ కార్యాలయాలను సైతం ముట్టడించారు.



మండ్యలో కాంగ్రెస్ పార్టీ నేత కిలార రాధాకృష్ణకు టికెట్ ఇవ్వాలని మద్దతుదారుల ధర్నా

కిలార రాధాకృష్ణకు టికెట్ ఇవ్వాలి

మండ్య: కాంగ్రెస్‌పార్టీ నేత కిలార రాధాకృష్ణకు టికెట్ ఇవ్వాలని మద్దతుదారులు మండ్య కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ నాయకుడికి టికెట్ ఇవ్వకపోతే తమ నాయకుడితో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపుతామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే బసవరాజన్ రాజీనామా

చిత్రదుర్గ జిల్లాలో టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే బసవరాజన్‌కు టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. ఆయన ఇక ఏ పార్టీలో చేరుతారోనన్న చర్చ సాగుతోంది.

మాకు కాకుండా ఇతరులకు టికెట్లా..

తుమకూరు : తుమకూరు నగర స్థానం నుంచి టికెట్ ఆశించి భంగపడిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే షఫిక్ అహ్మద్, అతని అల్లుడు, మాజీ ఎమ్మెల్యే రఫిక్ అహ్మద్ పార్టీ తీరుపై భగ్గుమన్నారు. తమకు కాకుండా ఇతరులకు టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని శుక్రవారం మీడియాకు తెలిపారు.

బుజ్జగింపుల పర్వం

టికెట్ దక్కని వారు అసమ్మతి లేవనెత్తిన నేపథ్యంలో బుజ్జగింపుల పర్వం మొదలైంది. రంగంలోకి దిగిన సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, టికెట్లు దక్కని వారికి మంచి పదవులు ఇస్తామని, పార్టీకి నష్టం కలిగించవద్దని సముదాయిస్తున్నారు. మొదటి, రెండో జాబితాలో టికెట్ దక్కని వారు అసమ్మతి రాజేస్తుండడంతో మిగిలిన 58 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పోటీ నెలకొన్న నియోజకవర్గాలకు చెందిన నేతలను, టికెట్ ఆశిస్తున్న వారిని ముందుగా సమావేశ పరిచి బుజ్జగించి గెలుపు గుర్రాలకు టికెట్ కేటాయిస్తున్నామంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చిన తర్వాతే మూడో జాబితాను వెల్లడిస్తారని పార్టీ ముఖ్య నేతలు పేర్కొంటున్నారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు



గుడ్‌ఫ్రైడే సందర్భంగా బెంగళూరులోని కోరమంగలలో సెయింట్ ఆంథోని చర్చివద్ద ఏసుక్రీస్తు సిలువ మోసిన ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు



సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

నేడు మైసూరుకు ప్రధాని రాక



హెలికాప్టర్ రిహార్సల్స్



పోలీసుల మోహరింపు

- ఆదివారం బండీపుర సఫారిలో పాల్గొననున్న నరేంద్రమోదీ

మైసూరు: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం మైసూరు రానున్నారు. దీంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి రాత్రి 8 గంటలకు మైసూరులోని మండకళ్లి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో మైసూరులోని పంచతార హోటల్‌కు వెళ్లి బస చేస్తారు. ఆదివారం ఉదయం 7 గంటలకు హెలికాప్టర్‌లో చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకాలోని బండీపురను సందర్శిస్తారు. ఈ సందర్భంగా 15 కిలో మీటర్ల అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రెండు రోజులనుంచి పర్యాటకులకు అనుమతులు నిలిపివేశారు. సఫారీలో పాల్గొనే ప్రధానికి దన్నటిహళ్ల క్యాంప్‌లో ప్రత్యేక రుచితో ఉన్న ఛాయ్ అందిస్తారు. ఈ ఛాయ్‌లో పాలు ఉండవు. భూగర్భ జలం, నిమ్మకాయ రసం , బెల్లంతో ఈ ఛాయ్ తయారు చేస్తారు.

భద్రతా బలగాల కేటాయింపు

శివాజీనగర: విధానసభ ఎన్నికల నేపథ్యంలో తగిన బందోబస్త్ కోసం నగరానికి వచ్చిన 17 కేంద్ర బలగాలను నగరంలోని ఎనిమిది విభాగాలకు కేటాయించారు. బీఎస్ఎఫ్ బెటాలియన్లలో ఈశాన్య విభాగానికి 2 బెటాలియన్‌లు, ఉత్తర విభాగానికి 3, తూర్పు విభాగానికి 1, సెంట్రల్ విభాగానికి 1, పశ్చిమ విభాగానికి 3, ఆగ్నేయ విభాగానికి 2 బెటాలియన్‌ను కేటాయించారు. ఆర్‌పీఎఫ్ మొత్తం 5 బెటాలియన్‌లలో తూర్పు విభాగానికి 2, దక్షిణ విభాగానికి 1 కంపెనీ కేంద్ర బలగాలను కేటాయించారు. ఓటింగ్ రోజు సమీపించగానే మరికొన్ని కేంద్ర బలగాలు వస్తాయి. ఓటింగ్ నాటికి మరిన్ని కేంద్ర బలగాలు రానున్నాయి.

ఎమ్మెల్యే రేణుకాచార్యపై కేసు

యశవంతపుర: దావణగెరె జిల్లా హొన్నాళి ఎమ్మెల్యే రేణుకాచార్యపై ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. బెంగళూరు శివానంద సర్కిల్‌లోని గురురాజ్ కల్యాణమంటపంలో హొన్నాళి నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించటంపై హైగ్రౌండ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా సమావేశం ఏర్పాటు చేశారనే ఆరోపణలపై ఎమ్మెల్యే రేణుకాచార్య, సంతోష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎన్నికల అధికారి విజయ్ తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులపై కేసులు

బనశంకరి: ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారనే ఆరోపణలపై రాజరాజేశ్వరినగర కాంగ్రెస్ అభ్యర్థి కుసుమా, ఎంపీ డీకే.సురేశ్‌తో పాటు ముగ్గురిపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గెలుపు గుర్రాలకే సీట్లు

- మాజీ సీఎం యడియూరప్ప

శివాజీనగర: పార్టీ టికెట్ల కోసం అనూహ్య ఒత్తిడి నెలకొందని, అయినా కూడా తల్లొగ్గకు అధిష్టానంతో చర్చించి గెలుపొందేవారికే టికెట్లు ఫైనల్ చేస్తామని, త్వరలో అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు బీ.ఎస్.యడియూరప్ప స్పష్టం చేశారు. తన అధికారిక నివాసం కావేరిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..టికెట్ ఫైనల్ చేసే నేపథ్యంలో ఢిల్లీకి వెళుతున్నాను.. జాబితా సిద్ధం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రముఖులతో చర్చించి చేయాల్సి ఉంది. అందరితో మాట్లాడి జాబితా ఫైనల్ విడుదల చేస్తాం అని యడియూరప్ప అన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు పేర్లను ఫైనల్ చేసి హైకమాండ్‌కు పంపించామని, తాను, ముఖ్యమంత్రి, మరి కొంత మంది ఢిల్లీకి వెళుతున్నాం. అభ్యర్థుల బలాలను చర్చించి జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.

టెన్త్‌లో మాస్ కాపీయింగ్

- బీదర్ జిల్లాలో 9మంది ఉపాధ్యాయుల సస్పెన్షన్

యశవంతపుర: బీదర్ జిల్లాలో టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నిర్వహిస్తున్న 9 మంది ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశారు. బీదర్ జిల్లా భాల్కి తాలూకా శివాజీపాఠశాలలోని పరీక్ష కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులే మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ గోవిందరెడ్డి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరిగినట్లు తేలడంతో ఉపాధ్యాయులు శేషప్ప, సంపత్, గోవింద్, కుపేంద్ర, శివాజీ, శివకుమార్ బిరాదార్, భీమరాయను సస్పెండ్ చేశారు.

ప్రలోభాలపై అధికారుల నిఘా



బీదర్ జిల్లాలో స్వాధీనం చేసుకున్న వెండి బ్యాగులు



వెండి నగలు

మైసూరు: విధానసభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం ఎర వేస్తున్నారు. అయితే ముమ్మర తనిఖీలతో అధికారులు వాటికి అడ్డుకట్ట వేస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మైసూరు జిల్లాలో ఇప్పటివరకు 2.20 కోట్ల విలువైన వివిధ రకాల వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు మైసూరు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర శుక్రవారం మీడియాకు తెలిపారు. జిల్లాలోని 50కిపైగా చెక్‌పోస్టుల్లో తనిఖీలు పెంచామని, సీసీ కెమెరాలతో నిఘా పెంచామన్నారు. రమ్మనహళ్లి, టీ నరసిపుర చెక్‌పోస్టు వద్ద సుమారు రూ. 80 లక్షల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. బస్సుల్లో నగదు రవాణా అవుతుండగా తనిఖీలు చేసి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు.

141 కేజీల వెండి స్వాధీనం

సాక్షి,బళ్లారి/యశ్వంతపుర: బీదర్ జిల్లా ఔరాద్ తాలూకా వనమారనహళ్లి చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న 141 కేజీల వెండిని అధికారులు పట్టుకున్నారు. దీని విలువ దాదాపు కోటిరూపాయలు ఉంటుందని అంచనా వేశారు. మహారాష్ట్రలోని డేగ్లూరు నుంచి బీదర్ జిల్లాకు ఈ వెండిని తీసుకొస్తున్నట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. కారును, వెండిని సీజ్ చేయడంతో పాటు వాటిని తరలిస్తున్న గజానన, అనిల్, రాహుల్‌ను అరెస్ట్ చేశారు.

తుమకూరు: తుమకూరు జిలా కాటీనహళ్లి చెక్‌పోస్టులో కారులో తరలిస్తున్న రూ. 1.50 లక్షల నగదు, తిపటూరు పట్టణంలో ఓ కారులో రూ. 19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

శిగ్గాంవిలో పోటీకి రండి

- కాంగ్రెస్ నేతలకు బసవరాజబొమ్మై సవాల్

బనశంకరి: నాకు ఏకగ్రీవ ఎన్నిక వద్దు... కుస్తీ కావాలి.. పోటీకి ఎవరు వస్తారో రండి.. ఎవరి శక్తి ఏంటో తెలుస్తుంది అంటూ బసవరాజబొమ్మై కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. శుక్రవారం శిగ్గాంవి నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 మే 13 తేదీన పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తామన్నారు. పార్టీలో చేరినవారిని చూస్తే 35 ఏళ్ల రాజకీయ జీవితంలో తనతో కలిసి పనిచేసినవారన్నారు. మేమంతా ఒకే కుటుంబ సభ్యులమన్నారు. నియోజవర్గంలో చాలా అసత్యప్రచారం చేశారని, బొమ్మై గెలవడం సాధ్యం కాదని హిందీ పత్రికలో రాశారన్నారు. తనను ఓడించడానికి ఢిల్లీ, బెంగళూరులో కూర్చుని ప్రణాళిక సిద్ధం చేశారని కాంగ్రెస్ నేతలపై ఆయన దుయ్యబట్టారు.

లైక్ కొట్టాలన్నారు.. లక్షలు కొల్లగొట్టారు

- కొత్త తరహా సైబర్ మోసం
- రూ.52 లక్షలు మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

బనశంకరి: యూట్యూబ్‌లో వీడియో లైక్ చేసి చందాదారులుగా చేరితే కమీషన్ ఇస్తామని చెప్పి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి సైబర్ వంచకులు రూ.52 లక్షలు కొల్లగొట్టారు. వివరాలు..వసంతనగరకు చెందిన టెక్కీ మొబైల్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాము యూట్యూబ్ లింక్ పంపిస్తాం. లైక్ కొట్టి చందాదారులై స్క్రీన్‌షాట్ వాట్సాప్ చేస్తే కమీషన్ ఇస్తామని ఆశపెట్టారు. రోజూ ఇస్తున్న 23 టాస్క్‌లను పూర్తిచేసి స్క్రీన్‌షాట్ తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌డేట్ చేసేవాడు. ప్రతి లైక్‌కు రూ.50 టెక్కీ బ్యాంకు ఖాతాకు జమ చేశారు. 4 నుంచి 5 టాస్కులకు డబ్బు పెట్టుబడి పెడితే 40 శాతం కమీషన్ ఇస్తామని ఆశపెట్టారు. వారు చెప్పినట్లుగానే భారీగా పెట్టుబడి పెట్టగా ఆమేరకు కమీషన్‌ను అతని బ్యాంక్ ఖాతాకు పంపారు. అయితే నగదు డ్రా కాలేదు. ఒక నంబర్‌కు ఫోన్ చేయగా మీ వ్యాలెట్‌లో తక్కువ డబ్బు ఉందని, ఎక్కువ డబ్బు జమ చేస్తే మీ కమీషన్ నగదు డ్రాచేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దీంతో టెక్కీ తన స్నేహితులు, బంధువుల నుంచి దశలవారీగా రూ.52.67 లక్షలు వంచకుల బ్యాంకు అకౌంట్‌కు జమచేశాడు. కానీ నగదు డ్రా కాలేదు. వంచనకు గురైనట్లు గుర్తించి కేంద్ర విభాగ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువతికి రూ.1.83 లక్షలు వంచన

ఇలాంటి వంచన ఘటనలోనే ఈజీపురకు చెందిన యువతి రూ.1.83 లక్షలు కోల్పోయింది. యూట్యూబ్ మీడియోలను లైక్ చేస్తే కమీషన్ ఇస్తామని ప్రలోభపెట్టిన కేటుగాళ్లు ఆమె వ్యాలెట్‌కు రూ.3 వేలు పంపించారు. బ్యాంక్ అకౌంట్ నుంచి డ్రాచేయడానికి వెళ్లగా మరింత నగదు జమచేయాలని పేర్కొన్నారు. రూ.1.83 లక్షలు జమచేసుకుని వంచనకు పాల్పడ్డారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



వెన్నంటి ఉంటాం

విధానసభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు శుక్రవారం బెంగళూరులోని జేజే నగర్‌లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ బలగాలు

వైభవంగా ద్రౌపదీదేవి కరగ



ధర్మరాయ స్వామి ఆలయం వద్ద రథోత్సవం



అశేషభక్తుల మధ్య వీరకుమారుల సమక్షంలో ద్రౌపదీదేవి కరగను ఎత్తుకొని నగర ప్రదక్షణకు వెళ్తున్న పూజారి జ్ఞానేంద్ర

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- కరగ ధరించి నగర ప్రదక్షిణ చేసిన పూజారి జ్ఞానేంద్ర

బనశంకరి: చారిత్రక ద్రౌపదీదేవి పూలకరగ మహోత్సవం లక్షలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. చైత్రమాసం పౌర్ణమి గురువారం అర్ధరాత్రి తిగళరపేటె ధర్మరాయస్వామి ఆలయంలో ధర్మస్థల ధర్మాధికారి రాజ్యసభ సభ్యుడు వీరేంద్రహెగ్డే పూజల అనంతరం పూజారి జ్ఞానేంద్ర ద్రౌపదీదేవి పూలకరగ ఎత్తుకుని వీరకుమారుల సమక్షంలో నగర ప్రదక్షణకు బయల్దేరారు. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులు కరగపై పూలు చల్లి భక్తిని చాటుకున్నారు. తిగళరపేటె, నగర్తపేటె, కబ్బన్‌పేటె, గాణిగరపేటె, దొడ్డపేటెతో పాటు వివిధ ప్రాంతాల్లో సంచరించి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తిరిగి ధర్మరాయస్వామి ఆలయానికి చేరింది. బెంగళూరు నగరం, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తమిళనాడు, ఏపీనుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో నగర్తపేటె చుట్టుపక్కల పండుగ వాతావరణం నెలకొంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అక్కిపేటె రోడ్డు తవక్కల్‌మస్తాన్ దర్గాతోపాటు శ్రీకృష్ణ ఆలయం, హలసూరుపేటె ఆంజనేయ, శ్రీరామ,శ్రీ ప్రసన్న గంగాధరేశ్వరస్వామి, నగర్తపేటె వేణుగోపాలస్వామి, సిద్దణ్ణగల్లీలోని భైరదేవర ఆలయం, బళేపేటె అణ్ణమ్మదేవి ఆలయం, మస్తాన్‌సాహెబ్ దర్గాను ద్రౌపది దేవి పూల కరగ సందర్శించి పూజలు అందుకుంది.

నేత్రపర్వగా ధర్మరాయస్వామి రథోత్సవం

కరగ మహోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి తిగళరపేటె ధర్మరాయస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరగ బయలుదేరే ముందు ప్రత్యేక అలంకరణ చేపట్టిన పాండవుల ఉత్సవమూర్తుల విగ్రహాలను రథంలో కొలువు దీర్చి రథోత్సవం నిర్వహించారు.

అందరి చూపు..బళ్లారి గ్రామీణ వైపు

- ఒకే చోట నుంచి తలపడిన గురుశిష్యులు
- హోరెత్తుతున్న అభ్యర్థుల ఎన్నికల ప్రచారం


ఓటర్లను కలుసుకుని తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి శ్రీరాములు


నాగేంద్రను పూలమాలలతో స్వాగతిస్తున్న కార్యకర్తలు, ప్రజలు

సాక్షి,బళ్లారి: గత అసెంబ్లీ ఎన్నికల్లో చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీరాములు ఈసారి మళ్లీ బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు పొందిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీరాములు పోటీ చేస్తున్న బళ్లారి గ్రామీణ నియోజకవర్గంపై అందరి చూపు పడింది. పరస్పరం స్నేహితులు, గురుశిష్యులుగా మెలిగిన శ్రీరాములు(బీజేపీ), నాగేంద్ర(కాంగ్రెస్)ల మధ్య నెలకొన్న పోటీ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉమ్మడి బళ్లారి జిల్లాలో 2008 నాటికి నియోజకవర్గాల పునర్విభజన తర్వాత బళ్లారి గ్రామీణ(మోకా) నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వ్ అయింది. దీంతో తొలిసారిగా 2008లో మంత్రి శ్రీరాములు పోటీ చేసి సునాయాసంగా గెలిచారు. అంతకు ముందు బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి 2004లో శ్రీరాములు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తొలిసారి గెలుపుతోనే మంత్రి పదవి

తొలిసారి అసెంబ్లీకి వెళ్లిన తర్వాత 2006లో ఏర్పడిన జేడీఎస్, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం లభించింది. దీంతో జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కూడ్లిగి నియోజకవర్గం కూడా ఎస్టీలకు రిజర్వ్ కావడంతో తొలిసారిగా నాగేంద్ర 2008లో కూడ్లిగి నుంచి బీజేపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 2013 ఎన్నికల్లో నాగేంద్ర కూడ్లిగి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. శ్రీరాములు అదే ఎన్నికల్లో బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా తానే స్థాపించిన బీఎస్‌ఆర్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

ఇద్దరూ బలమైన నేతలే

ముందు నుంచి ఇరువురు అభ్యర్థులు ఎస్టీ సామాజిక వర్గంలో మంచిపేరు కలిగిన బలమైన నేతలుగా జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్య పరిణామాలతో నాగేంద్ర కాంగ్రెస్ పార్టీలో చేరి బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ ఎన్నికల్లో శ్రీరాములు చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి శ్రీరాములు మళ్లీ బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ప్రకటించడంతో పాటు ఇప్పటికే ప్రచారం కూడా ప్రారంభించి హోరెత్తిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నాగేంద్రకు కాంగ్రెస్ అధినాయకత్వం బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఖరారు చేసి ఇప్పటికే ఆయన పేరును ప్రకటించింది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేల పోటీతో ప్రాధాన్యత

ఈనేపథ్యంలో బళ్లారి గ్రామీణ నుంచి పోరు ఆసక్తికరంగా మారింది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి లోక్‌సభ మెంబరుగా, మూడుసార్లు మంత్రిగా పని చేసిన శ్రీరాములు, వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన నాగేంద్ర ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. అన్ని సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు, ప్రముఖులతో ఇద్దరు నేతలకు సత్సంబంధాలున్నాయి. శ్రీరాములు కూడా గత వారం రోజుల నుంచి బళ్లారి గ్రామీణ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇరువురు ప్రముఖ నేతలు ఒకే చోట నుంచి పోటీ చేస్తుండటంతో ఇరు పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తల వలసలు ప్రారంభమయ్యాయి.

క్లుప్తంగా

పారా మిలిటరీ పోలీసుల కవాతు


కవాతును ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

కంప్లి: పారదర్శకంగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు వీలుగా ప్రజల్లో జాగృతి కల్పించేందుకు పోలీసులు, ఐటీబీపీ పారా మిలిటరీ సిబ్బంది పట్టణంలోని కంప్లి కోట ప్రాంతం నుంచి పోలీసు కవాతును ప్రారంభించి ప్రధాన వీధుల్లో నిర్వహించారు. కవాతులో అసిస్టెంట్ కమాండర్ గజేంద్రపాల్‌సింగ్, అమోఘ్, ఆర్‌ఎస్‌ఐ బాక్కిబలి, పట్టణ సీఐ సురేష్ హెచ్ తళ్వార్, కురుగోడు సీఐ జయప్రకాష్, ఎస్పీలు శారదమ్మ, విజయ్‌ప్రతాప్‌తో పాటు 65 మంది స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10న కుమారస్వామి రాక


మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

బళ్లారిఅర్బన్: నగరంలో ఈ నెల 10న జేడీఎస్ సిటీ అభ్యర్థి మున్నాబాయి నేతృత్వంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ సమావేశానికి పార్టీ అధినేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి హాజరవుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సోమలింగనగౌడ, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనళ్లి తాయణ్ణ తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు కుమారస్వామితో పాటు నగరానికి విచ్చేసి అభ్యర్థి మున్నాబాయి తరఫున జరిగే ప్రచార సమావేశంలో పార్టీ అధ్యక్షులు సీఎం ఇబ్రహిం, నాయకులు తిప్పేస్వామి, వెంకట్రావ్ నాడగౌడ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం కురుగోడులోని నాడగౌడ కళాశాల మైదానంలో సాయంత్రం నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. బళ్లారి రూరల్, సిరుగుప్ప నియోజకవర్గాల అభ్యర్థులను కూడా ప్రకటిస్తారన్నారు. ఈ సందర్భంగా బండేగౌడ, విజయ్‌కుమార్, యూత్ కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న సురేష్‌బాబు

కంప్లి: బూత్ స్థాయిలో కార్యకర్తలు ఐకమత్యంగా తన గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం జిల్లా బీజేపీ ప్రముఖులతో వద్దట్టి గ్రామంలో పర్యటించి మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా గత పదేళ్లలో చేసిన అభివృద్ధి పనులకు తోడు మరింత అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. జిల్లా ప్రముఖులు యర్రంగళి తిమ్మారెడ్డి, రామలింగప్ప, గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, అళ్లళ్లి వీరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాదచారి దుర్మరణం

హుబ్లీ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన తాలూకాలోని శిరగుప్పి గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామంలోని నెహ్రూ హైస్కూల్ ఎదుట హైవేను దాటుతుండగా సుమారు 40-45 ఏళ్ల వయస్సుగల పాదచారిని వాహనం ఢీకొనడంతో అతను అక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరగడంతో సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కిమ్స్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కాగడాలతో ఓటరు చైతన్యం


చైతన్యపరుస్తున్న అధికారులు, సిబ్బంది

హొసపేటె: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాలూకా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఓటరు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద అధికారులు ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి తెలిపారు. జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. తమ హక్కును వినియోగించుకోవాల్సిన ముఖ్యమైన రోజున ఎవరూ దూరం కాకుండా ఓటు వేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ సిద్దరామేశ్వర, తహసీల్దార్ విశ్వజిత్ మెహత, నగర సభ అధికారి మనోహర్, టీపీ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


సీఎస్‌ఐ తెలుగు చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్ శామ్యూల్ ప్రసాద్


భక్తిపరవశంతో ఏసుక్రీస్తును ప్రార్థిస్తున్న యువతీయువకులు

- అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

బళ్లారి రూరల్: గుడ్‌ఫ్రైడే పర్వదినం సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన చర్చిలతో పాటు మేరీ మాత చర్చి ప్రాంగణంలోని ఏసుచరిత్ర ప్రతిమల వద్ద సిలువతో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రార్థనా మందిరంలో కరుణామయుడి కృప కోసం ప్రార్థించారు. అదేవిధంగా కోట ప్రాంతంలోని బళ్లారి యూత్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో ఫాదర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. ఈ ప్రార్థనా కార్యక్రమంలో అనేక మంది క్రైస్తవులు పాల్గొని ముక్తకంఠంతో ఏసుక్రీస్తును స్మరించారు. అలాగే సీఎస్‌ఐ తెలుగు చర్చిలో ఫాదర్ శామ్యూల్‌ప్రసాద్ ఏసుప్రభు చరిత్రను భక్తులకు వివరించారు. ఆయా చర్చిలు, ప్రార్థనా మందిరాల వద్దకు పెద్ద సంఖ్యలో నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి క్రైస్తవ సోదరులు తరలివచ్చారు.

జోరుగా అభ్యర్థుల ప్రచారం


ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ తదితరులు


హులిగమ్మ ఆలయంలో సన్మానం అందుకున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ దంపతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని కల్లూరు, సిరవారల్లో పంచరత్న యాత్ర ప్రచారానికి శుక్రవారం మాన్వి ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ కుమారణ్ణ నినాదంతో ప్రచార జాతాను ప్రారంభించి మాట్లాడారు. మాజీ సీఎం కుమారస్వామి చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలన్నారు. గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ దంపతులు అరోలిలోని హులిగమ్మ దేవి ఆలయంలో పూజలు జరిపిన అనంతరం ఎన్నికల ప్రచారం చేపట్టారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించండి


మాట్లాడుతున్న ఎన్నికల అధికారిణి డాక్టర్ నయన, చిత్రంలో తహసీల్దార్ తదితరులు

కంప్లి: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజల సహకారం అవసరమని క్షేత్ర ఎన్నికల అధికారిణి డాక్టర్ నయన తెలిపారు. తన కార్యాలయంలో ఆమె శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశంలో మాట్లాడారు. క్షేత్రంలో 2,12,733 మంది ఓటర్లలో 1,05,719 మంది పురుషులు, 1,06,987 మంది మహిళా ఓటర్లు, 27 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. మొత్తం క్షేత్రంలో 240 పోలింగ్ కేంద్రాలు ఉండగా కంప్లి తాలూకాలో 106, కురుగోడు తాలూకాలో 90, బళ్లారి, గ్రామీణ ఫిర్కాలో 44 కేంద్రాలు ఉన్నాయన్నారు. 64 సూక్ష్మ, గోనాళ, కర్ఛేడులో 3 అతిసూక్ష్మ కేంద్రాలు ఉన్నాయన్నారు. క్షేత్రంలో మొత్తం 64 రెవెన్యూ గ్రామాలు ఉండగా కంప్లి తాలూకాలో 26, కురుగోడు తాలూకాలో 26, బళ్లారి గ్రామీణ ఫిర్కాలో 12 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. 24 గంటల పాటు ఫిర్యాదులు స్వీకరించేందుకు 6 బృందాలు, 1 వీవీటీ టీం, అభ్యర్థుల ఖర్చు పరిశీలన టీం కార్యనిర్వహణలో ఉంటాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ గౌసియాబేగం, ఏఈఈ మహబూబ్ ఖాన్, రాజకీయ పార్టీల ప్రముఖులు హేమయ్యస్వామి, హబీబ్ రహిమాన్, టీవీ సుదర్శనరెడ్డి, హూగార్ రమేష్, ప్రహ్లాద్‌నాయక్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జోడు రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం


పూజలందుకున్న హనుమంతుడు

హొసపేటె: హంపీలో విరుపాక్షేశ్వర, చంద్రమౌళేశ్వర స్వామి జోడు రథోత్సవం గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది అశేష భక్తుల మధ్య రథవీధి నుంచి రథాన్ని లాగారు. ఎండలను సైతం లెక్కించకుండా భక్తులు మంటపాలు, కట్టడాలపై కూర్చొని రథోత్సవాన్ని వీక్షించారు. తేర్లపైకి అరటి పండు, పూలు, ఉత్తత్తిని విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం విద్యారణ్య భారతీ స్వామీజీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు.

వైభవంగా పంచముఖి రథోత్సవం

రాయచూరు రూరల్: తాలూకాలోని గాణధాళ పంచముఖి ఆంజనేయ స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. గురువారం సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. గాణధాళలో వెలసిన పంచముఖి హనుమంతుడికి ప్రత్యేక పూజలు నెరవేర్చారు. గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్‌తో పాటు చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి బీజేపీ ప్రభుత్వమే


మాట్లాడుతున్న ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు దుర్గారావు

గంగావతి రూరల్: గత ఐదేళ్లుగా ఎక్కడా కూడా పంటలు ఎండిపోకుండా సరైన సమయానికి నీరందించిన ఘనత కనకగిరి ఎమ్మెల్యే ధడేసూగూరు బసవరాజ్, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దక్కుతుందని గంగావతి ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు సీహెచ్ దుర్గారావు అన్నారు. ఆయన శుక్రవారం కనకగిరి అసెంబ్లీ పరిధిలోని హణవాళ గ్రామంలో 25వ డిస్ట్రిబ్యూటరీ రైతులతో మాట్లాడారు. కనకగిరి నియోజకవర్గంలో తుంగభద్ర ఎడమ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని, 25వ డిస్ట్రిబ్యూటరీ కింద పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. ఏప్రిల్ 10 వరకు నీరు అందిస్తున్నందున రైతులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి 25వ డిస్ట్రిబ్యూటరీ గేట్లను మరింత తెరిపించి దిగువ ఉన్న రైతులకు నీరందేలా చర్యలు తీసుకున్నారు. ఇదే సందర్భంగా బీజేపీ యువ నాయకుడు ఎంఆర్‌ఎఫ్ రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు కరెంటు వ్యవస్థ సరిగ్గా లేక జనరేటర్ ద్వారా పంటలను సాగు చేయించిన ఘనత మాజీ మంత్రి శివరాజ్ తంగడగి, కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రైతులు కరెంట్ అడిగిన పాపానికి వారిపై కేసులు పెట్టిన ఘనత కూడా వారిదేనని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా శ్రీరామనగర్ కరుటూరి వెంకటరావు జలగం, బిజెపి యువ నాయకులు బాపారావు, దోనేపూడి మోహన్, శేఖర్, సూరి పాల్గొన్నారు.

ఖరారు కాని టికెట్లు..ఆందోళనలో అభ్యర్థులు

రాయచూరు రూరల్: మరో వారం రోజుల్లో ఎన్నికల రణరంగానికి ముహూర్తం దగ్గర పడుతుండగా జిల్లాలో మూడు ప్రధాన పార్టీల్లో ఇంకా టికెట్లు ఖరారు కాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. రాయచూరు నగరం, మస్కి స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కసరత్తు సాగుతోంది. దేవదుర్గలో శివనగౌడ నాయక్(బిజెపి), కరెమ్మ నాయక్(జెడిఎస్) అభ్యర్థులు కాగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం ఇంకా అన్వేషిస్తున్నారు. మాన్విలో హంపయ్య నాయక్(కాంగ్రెస్), రాజా వెంకటప్ప నాయక్(జెడిఎస్), సింధనూరులో హంపనగౌడ బాదర్లి(కాంగ్రెస్), వెంకట్రావ్ నాడగౌడ(జేడీఎస్), లింగసూగూరులో వజ్జల్ మానప్ప(బిజెపి), హులిగేరి(కాంగ్రెస్), సిద్దు బండి(జెడిఎస్), రాయచూరు గ్రామీణలో బసనగౌడ దద్దల్(కాంగ్రెస్), నరసింహ నాయక్(జెడియస్), సుభాష్ చంద్ర శంభూజీ(ఆప్) అభ్యర్థులు కాగా, మస్కి, రాయచూరుల్లో మూడు పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి.

మానవత చాటిన వానరం

- మృతునికి బుగ్గపై ముద్దు పెట్టిన వైనం


మృతుని బుగ్గపై ముద్దు పెడుతున్న వానరం

హొసపేటె: తనకు ప్రతి రోజు అరటిపండు అందిస్తున్న వృద్ధుడు మృతి చెందడంతో మృతుని ఇంటి వద్ద ఉన్న వానరం(కొండముచ్చు) మృతదేహం దగ్గరకు వెళ్లి మృతుని బుగ్గపై ముద్దు పెట్టిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు..విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లిలో నివాసముంటున్న పరశురామ(88) అనే వృద్ధుడు నిత్యం తన ఇంటి వద్ద తిరుగుతున్న వానరానికి అరటిపండు అందించేవాడు. అయితే ఆకస్మికంగా మృతి చెందిన పరశురామ ఎంతసేపైనా అరటిపండును బయటకు తేకపోవడంతో అతనిని వెదుక్కొంటూ వానరం ఇంటి ఆవరణ లోపలకు వెళ్లింది. అక్కడ మృతదేహం వద్ద మృతుడి బంధువులు రోదిస్తున్న దృశ్యాన్ని గమనించిన వానరం వెంటనే మృతదేహం వద్దకు వెళ్లి కొంతసేపు పక్కనే మౌనంగా కూర్చొని అనంతరం బుగ్గపై ముద్దిచ్చి వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మూగజీవాల మృత్యువాత

కంప్లి: యర్రంగళి గ్రామ సమీపంలోని భూముల్లో జొన్నపంట చిగురు తిని 22 వలస మూగజీవాలు మృతి చెందిన ఘటన జరిగింది. గంగావతి తాలూకా హణవాళ గ్రామానికి చెందిన 13 ఆవులు, కొప్పళ తాలూకా కూకనపళ్లి గ్రామ సణ్ణప్పకు చెందిన 5 ఆవులు, వెంకటగిరి గ్రామ కరియప్పకు చెందిన 4 ఆవులు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందగానే పశు వైద్యాధికారి డాక్టర్ బసవరాజ్, రెవెన్యూ శాఖ అధికారి మల్లికార్జునగౌడ, వీఏఓ నాగరాజ్ ఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ పేలి బాలుడి మృతి

రాయచూరు రూరల్: గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ బాలుడు మరణించిన ఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు..నేతాజీ నగర్‌లో శంషుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై పేలడంతో ఏడాది వయస్సున్న అతని కుమారుడు మరణించగా, తబుస్సుమ్, నఫీజాబాను, పద్మ అనే ముగ్గురు మహిళలు గాయ పడ్డారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నేతాజీ నగర్ ఎస్‌ఐ అనితా రామ్ తెలిపారు.

స్నానానికి వెళ్లి పౌర కార్మికుడు..

మస్కిలో ఓ పౌర కార్మికుడు స్నానానికి వెళ్లి మరణించిన ఘటన వెలుగు చూసింది. గురువారం రాయచూరుకు చెందిన జంబయ్య(45) అనే వ్యక్తి కాలు జారి తుంగభద్ర ఎడమ కాలువలో పడి కొట్టుకు పోయినట్లు పోలీసులు తెలిపారు. అతనితో పాటు వెళ్లిన మరో పౌర కార్మికుడు రాజప్ప ఆయనను రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని తెలిసింది.

వ్యక్తి మృతదేహం లభ్యం

తాలూకాలోని మలయాబాద్ వద్ద గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడిని నగరంలోని మాణిక్ నగర్ నివాసి ఆంజనేయ(35)గా యరగేర పోలీసులు గుర్తించారు. మలయాబాద్ పరిసర ప్రాంతంలో పందుల పంపకంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఈ దుర్ఘటన జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోలారు వార్తలు...

కాంగ్రెస్‌తోనే రైతు శ్రేయస్సు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌కుమార్

శ్రీనివాసపురం: రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మిలన్సర్ మ్యాంగో మండీలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రకృతి వైపరీత్యాలతో ధరల పతనం నివారణకు వ్యవసాయ ఉత్పత్తుల కమిషన్‌ను రచిస్తామన్నారు. ఎత్తినహొళె ద్వారా జిల్లాలోని చెరువులకు నీటిని అందిస్తామన్నారు. తనపై మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను ఖండిస్తూ తాను ఎలాంటి భూ ఆక్రమణలకు పాల్పడలేదన్నారు. ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్‌కుమార్, జెడ్పీ మాజీ అధ్యక్షుడు ఎం శ్రీనివాసన్, మాజీ సభ్యుడు నారాయణస్వామి, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అశోక్, కోచిముల్ మాజీ అధ్యక్షుడు ఎన్ జీ బ్యాటప్ప తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌కు స్పందన భేష్

కోలారు: కోలారు అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి జేడీఎస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి నాయకత్వంపై విశ్వాసం ఉంచి ఎంతో మంది ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర తిరుమలేష్ తెలిపారు. గురువారం రాత్రి నగర సమీపంలోని ఏపీఎంసీ మార్కెట్ వద్ద కల్వమంజలి గ్రామస్తులను జేడీఎస్ పార్టీలోకి ఆహ్వానించి ఆయన మాట్లాడారు. ప్రతినిత్యం వందల సంఖ్యలో కార్యకర్తలు జేడీఎస్‌లో చేరుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు ఈసారి జాతీయ పార్టీలపై విశ్వాసం కోల్పోయి ప్రాంతీయ పార్టీని అధికారంలోకి తేవాలని ఆశిస్తున్నారన్నారు. కుమారస్వామి పంచరత్న పథకం ద్వారా విద్య, ఉద్యోగ, మహిళా సబలీకరణ, వ్యవసాయ రంగంలో అనేక మార్పులు తెస్తున్నారన్నారు. కోలారు నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎంఆర్ శ్రీనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. పార్టీ నాయకులు శంకర్, వేణు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగృతి జాతా

కోలారు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేడీపీఏ ఆధ్వర్యంలో నగరంలో జాగృతి జాతా నిర్వహించారు. జాతాను డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ జగదీష్ ప్రారంభించారు. త్రివిధ ఆరోగ్య సూత్రాలు వ్యాయామం, యోగా, సమతుల ఆహార పద్ధతును పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జాతా అనంతరం అంతరగంగ పర్వత పాదం వద్ద యోగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ అంబరీష్, డాక్టర్ ఆశా తదితరులు ఉన్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తా


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామేగౌడ

మాలూరు: వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని జేడీఎస్ అభ్యర్థి రామేగౌడ ప్రజలను కోరారు. శుక్రవారం మాస్తి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే అవినీతి రహిత పాలన అందించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించడంతో పాటు 10 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానన్నారు.

ఘనంగా హనుమ జయంతి

రాయచూరు రూరల్: జిల్లాలో హనుమ జయంతిని ఘనంగా ఆచరించారు. ఐబీ రోడ్డులో వెలసిన వరసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి కిల్లే బృహన్మఠాధిపతి శాంత మల్ల శివాచార్య, ఆలయ ట్రస్టీ రాజా శంకర్ ప్రత్యేక అలంకరణలో హనుమంతుడికి పూజలు జరిపారు. భక్తులు ఊయల సేవ, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీ టికెట్ ఇవ్వాలని ధర్నా

కేజీఎఫ్: బీజేపీ టికెట్‌ను మోహనకృష్ణకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆయన మద్దతుదారులు శుక్రవారం పార్టీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు రవి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మోహనకృష్ణ గత నాలుగేళ్లుగా పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. మోహన్‌కృష్ణకు హైకమాండ్ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఈ సందర్భంగా జీపీ అధ్యక్షుడు రఘు, శ్రీనివాస్, శ్రీనాథ్, సుధాకర్ రెడ్డి, తేజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రవేశానికి న్యాయపోరాటం చేస్తాం

హుబ్లీ: జెడ్పీ సభ్యుడి హత్య కేసులో బెయిల్‌పై ఉన్నప్పటికీ జిల్లాలోకి ప్రవేశించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశం నేపథ్యంలో ధార్వాడ గ్రామీణ కాంగ్రెస్ టికెట్ కేటాయించిన మాజీ మంత్రి వినయ్ కులకర్ణికి ధార్వాడ జిల్లాలో ప్రవేశం కోసం న్యాయపరంగా పోరాటం చేస్తామని మంత్రి భార్య శివలీల తెలిపారు. ధార్వాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు వినయ్ కులకర్ణి శివళ్లి గ్రామంలో దుర్గాదేవికి పూజ చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టేవారన్నారు. అందుకోసమే తాను అక్కడ పూజలు చేసినట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని వినయ్ కులకర్ణి రావాలని ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆ మేరకు పార్టీ టికెట్ కూడా లభించిందని ఆమె అభిప్రాయపడ్డారు. వినయ్ కులకర్ణిని రాజకీయంగా అనగదొక్కడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరణ వల్ల పార్టీ టికెట్ కేటాయించిందన్నారు. న్యాయపరంగా తన భర్తకు జిల్లాలో ప్రవేశానికి సుప్రీంకోర్టు అనుమతి లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ముఖ్యమంత్రి బొమ్మై సారథ్యం వహించిన శిగ్గాంవి నుంచి ఈసారి వినయ్‌కులకర్ణి పోటీ చేస్తారన్న ఊహాగానాలకు ఎట్టకేలకు తెరపడింది. ఈ విషయంపై శివలీల స్పందిస్తూ అదంతా మీడియా సృష్టే అని, ధార్వాడ గ్రామీణ క్షేత్రం వదిలి వేరే చోటకు వెళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

ఓటు హక్కు వినియోగంపై ప్రమాణం


ప్రమాణం చేస్తున్న నరేగ కూలీ కార్మికులు

రాయచూరు రూరల్: మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఐఈసీ అధికారి ధన్‌రాజ్ సూచించారు. ఆయన శుక్రవారం తాలూకాలోని బిజినగేరలో జాతీయ ఉద్యోగ ఖాత్రి పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఓటు హక్కుపై జాగృతి కల్పించి ఆయన మాట్లాడారు.

క్లుప్తంగా

వరుణలో కాంగ్రెస్‌-బీజేపీల మధ్య అంగీకారం

● మాజీ సీఎం కుమార స్వామి

మైసూరు: మైసూరులోని వరుణ నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్యను గెలిపించడానికి కాంగ్రెస్, బీజేపీల మధ్య సయోధ్య జరిగిందని మాజీ సీఎం కుమార స్వామి ఆరోపించారు. శుక్రవారం మైసూరు జిల్లాలో పిరియా పట్టణ తాలూకా కంపలాపురలో నిర్వహించిన రోడ్డుషోలో పాల్గొని కుమారస్వామి మాట్లాడుతూ...సిద్దరామయ్య రాష్ట్రంలో ఎక్కడ నిలబడినా కూడ ఓడి పోతారనే భయం పట్టుకుందని, వరుణతో పాటు మరో నియోజకవర్గం కోసం ఎదురు చూస్తున్నారని, వరుణలో సిద్దరామయ్యను గెలిపించడానికి బీజేపీతో కాంగ్రెస్ అంతర్గత ఒప్పందం చేసుకుందని, దీంతో అక్కడ బీజేపీ బలమైన అభ్యర్థిని నిలబెట్టలేదని అన్నారు. 125 స్థానాల్లో జేడీఎస్ విజయఢంకా మోగిస్తుందని కుమార ఆశాభావం వ్యక్తం చేశారు.

బొమ్మనహళ్లిలో జోరందుకున్న కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న అభ్యర్థి ఉమాపతి గౌడ

బొమ్మనహళ్లి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆశావహులు నేరుగా ప్రచారానికి దిగుతున్నారు. తాజాగా నగరంలోని బొమ్మనహళ్లి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న కన్నడ సినీ నిర్మాత ఉమాపతి శ్రీనివాస గౌడ ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసుదేవ రెడ్డి, బొమ్మనహళ్లి కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనిల్ ఎస్. రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో పార్కుకు వచ్చిన వారిని స్వయంగా కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరుతున్నారు. అదే విధంగా ఫుట్‌పాత్‌పై కూరగాయాలు కొనుగోలు చేయడానికి వచ్చిన వారిని కూడా కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ...ఈ ఎన్నికల్లో బొమ్మనహళ్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యమన్నారు.

రాగిగుడ్డలో అగ్ని ప్రమాదం

శివమొగ్గ: శివమొగ్గ నగరానికి సమీపంలో ఉన్న రాగిగుడ్డలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు గంటకుపైగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పక్షులు, అడవి జంతువులు ఉంటాయి. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

బాంబే సలీంది ఆది నుంచీ నేరచరిత్రే

కృష్ణరాజపురం : బెంగళూరులో బంగారం నగలు చోరీ చేసి అమృతహళ్లి పోలీసులకు పట్టుబడిన దొంగ బాంబే సలీంది ఆదినుంచి నేరచరిత్రే, పదో తరగతి చదివిన ఈయన తొలుత జేబుదొంగ. చోరీ కేసుల్లో రెండు సార్లు జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై బయటకు వచ్చి బెంగళూరుకు వలస వచ్చాడు. ఇక్కడ దర్జాగా కారులో సంచరిస్తూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడి కారులోనే ముంబైకి వెళ్లేవాడు. చోరీలతో వచ్చిన డబ్బు పూర్తిగా ఖర్చు అయ్యాక తిరిగి బెంగళూరుకు వచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఒక మహిళతో అనైతిక సంబంధం పెట్టుకొని ఆమె ద్వారానే చివరకు కటకటాల పాలైనట్లు చెబుతున్నారు.

బీజేపీ కార్యకర్తల పార్టీ



పాల్గొన్న నాయకులు

గౌరిబిదనూరు: బీజేపీ కార్యకర్తల పార్టీ అని, దేశభక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే పార్టీ ఒక్క ముఖ్య లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్ అన్నారు. శుక్రవారం నగర బీజేపీ అధ్యక్షుడు మార్కెట్ మోహన్ కార్యాలయంలో పార్టీ సంస్థాపన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 43 ఏళ్లుగా పార్టీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, దృఢమైన సిద్ధాంతాలు, ప్రభలమైన నాయకులు, నిష్టావంతులైన కార్యకర్తల శ్రమ ఫలితంగా నేడు ప్రపంచంలోనే ఎక్కువ మంది సభ్యులున్న పార్టీగా గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో మానస ఆస్పత్రి వైద్యులు డా శశిధర్, రవినారాయణరెడ్డి, రమేశ్ రావ్ శేల్కే, జయణ్ణ, లక్ష్మీనరసమ్మ, అరుణమ్మ, పార్వతమ్మ, వేణుమాధవ్, శాంతకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఆర్‌కే.రమేశ్

బనశంకరి: అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న ఆర్‌కే.రమేశ్ మనవి చేశారు. దొడ్డకల్లసంద్రలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. సిద్దరామయ్య హయాంలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు.

శిలువధారీ నీ శరణు కోరి..







మిస్పా తెలుగు చర్చిలో పార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ రెవరెండ్ డీ.బెరాకా అండీ, హాజరైన పాస్టర్లు, సంఘ పెద్దలు, మండ్యలో ఏసుప్రభువు జీవితంపై నాటిక

శివాజీనగర: పాపులను పరిశుద్ధులుగా మార్చడానికి శిలువనెక్కిన దైవకుమారుడి శుభ శుక్రవారం ప్రార్థనలు బెంగళూరు నగరంలో ఘనంగా జరిగాయి. ప్రతి ప్రార్థనా మందిరంలో క్రైస్తవులు అసంఖ్యాకంగా తరలి వచ్చి ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నారు. ఎం.జీ.రోడ్డు సెయింట్ మార్క్స్ జేవియర్ క్యాథడ్రల్, క్లీవ్ ల్యాండ్ టౌన్, హలసూరులోని హోలి ట్రినిటీ చర్చ్, శివాజీనగర సెయింట్ మేరీస్ చర్చ్, హడ్సన్ చర్చ్‌తో, మిస్పా తెలుగు చర్చ్‌తో పాటు తదితర అన్ని ప్రాంతాల్లోనూ చర్చిల్లో యేసు శిలువపై పలికిన ఏడు మాటలనే ప్రత్యేకంగా ధ్యానించారు. మిస్పా తెలుగు చర్చిలో పాస్టర్ రెవరెండ్ డీ.బెరాకా అండీ, రెవరెండ్ క్రిస్టఫర్, బ్రదర్ హెచ్.విజయరాజు, ఎమ్.ప్రభుదాస్, పాస్టర్ రెవరెండ్ డీ.బెరాకా అండీ, కార్యదర్శి కెప్టెన్ జాన్, పాస్టర్ రెవరెండ్ పీ.డీ.విజయకుమార్, పాస్టర్ డీ.బెరాకా అండీలు పరిశుద్ధ బైబిల్‌లో పొందుపరిచిన యేసు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు.

మండ్య: మండ్యలోని కార్మల్ కాన్వెంట్‌లో గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. మనుకుల మాత ధర్మ కేంద్రం ఆధ్వర్యంలో సిలువ ఎక్కి ఏసు మరణించిన ఘట్టాన్ని ప్రదర్శించారు. ఫాదర్ చిన్నప్ప ప్రభువు సందేశాన్ని వినిపించారు.

తుమకూరు: నగరంలోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాసం ఆచరించి మధ్యాహ్నం వరకు క్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువు సిలువ మోసిన ఘట్టాన్ని ప్రజలకు చూపించారు.

ఎన్నికల విధులకు ఆటంకం

● వ్యక్తిపై కేసు నమోదు

దొడ్డబళ్లాపురం: ఎన్నికల విధులకు ఆటంకం కలిగించిన దొడ్డ తాలూకా గడ్డంబచ్చహళ్లి గ్రామానికి చెందిన జీఎం రాజన్నపై దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఏసీ కార్యాలయంలో ఏసీ తేజస్‌కుమార్ అధికారులతో సమావేశమై చర్చిస్తుండగా రాజన్న అనుమతి లేకుండా మీటింగ్ హాల్‌లోకి ప్రవేశించాడు. తన పని త్వరగా చేసివ్వాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. ఏసీ తేజస్‌కుమార్ నచ్చజెప్పాలని చూసినా రాజన్న మాట వినలేదు. ఏసీ తేజస్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు రాజన్నపై క్రిమినల్ కేసు నమోదుచేశారు.

చాక్లెట్ గోదాములో అగ్ని ప్రమాదం



కాలి బూడిదైన వస్తు సామగ్రి

కృష్ణరాజపురం: నగరంలోని బెంగళూరు ఉత్తర తాలూకా కాడుగోడులోని కాశీ విశ్వనాథ స్వామి ఆలయ సమీపంలోని ఒక చాక్లెట్ గోదాములో అగ్ని ప్రమాదం జరిగింది. ఏసీ యంత్రం నుంచి మంటలు చెలరేగి గోదాము మొత్తం వ్యాపించాయి. దీంతో వస్తు సామగ్రి బూడిదైంది. కాడుగోడి పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో వచ్చి మంటలు ఆర్పివేశారు. సంస్థ యజమాని గోపాల్ మాట్లాడుతూ రూ. 50 లక్షల మేర నష్టం జరిగిందని తెలిపాడు.

ధ్రువ నారాయణ భార్య మృతి

మైసూరు: కేపీసీసీ కార్యాధ్యక్షుడు, దివంగత ధ్రువ నారాయణ భార్య వీణ (54) శుక్రవారం మృతి చెందారు. నెల క్రితమే తీవ్రమైన గుండెపోటుతో ధ్రువ నారాయణ మృతి చెందిన విషయం తెల్సిందే. పదేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వీణ భర్త మృతిలో తీవ్ర షాక్‌లో ఉన్నారు. మైసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఎన్నికల్లో ధ్రువనారాయణ నంజనగూడు రిజర్వు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని భావించారు. ఇటీవల ఆయన మరణంతో పార్టీ పెద్దలు ఆయన కుమారుడికి ఈ సీటు కేటాయించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మైసూరు: మైసూరు నగరంలోని అఖిల భారత వాక్, శ్రవణ సంస్థకు చెందిన ఉద్యోగి ఒకరు హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సంస్థలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ప్రాణేశ్ (26) విభిన్న ప్రతిభావంతుడు. ఆయన విజయపురలోని శ్రీ వెంకటేశ్వర విద్యార్థుల హాస్టల్‌లో ఉంటున్నారు. గది నుంచి బయటకు రాకపోవడంతో సహచరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జయలక్ష్మీపురం పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా ప్రాణేశ్ విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు...

కెలమంగలం: నిలిపి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపంలోని కలపంబాడి గ్రామానికి చెందిన రాజేంద్రన్ కొడుకు బైరాజ్ (23) డెంకణీకోటలోని ఓ దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో డెంకణీకోట- అంచెట్టి రోడ్డుపై వస్తూ ప్రభుత్వ రేషన్ గోడన్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన బైరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నటుడు సుదీప్ ప్రకటనలు నిలిపివేయాలి

శివాజీనగర: నటుడు సుదీప్ బీజేపీకి మద్దతు ప్రకటించడంతో ఆయన చిత్రాలు, ప్రకటనలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం జేడీఎస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. బీజేపీ స్టార్ క్యాంపైన్‌గా ఉన్న సుదీప్ చిత్రాలు, ప్రకటనలు ప్రసారం చేయకుండా నిలిపివేయాలని కోరారు.

పాల సంఘం అధ్యక్షురాలిగా వీణ

మండ్య: మండ్య తాలూకా హొనగానహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన అధ్యక్షురాలిగా హెచ్.ఆర్. వీణా, ఉపాధ్యక్షుడుగా హెచ్.బీ.రామచంద్రు ఎన్నికయ్యారు. మొత్తం సుమారు 12 మంది సభ్యులున్న ఈ డెయిరీలో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రాజీనామా చేయడంతో ఆ స్థానాలకు శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. వీణ, రామచంద్ర మాత్రమే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష రాసిన విద్యార్థిని



విద్యార్థిని కీర్తన

బనశంకరి: తమ్ముడి మృతితో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థిని పరీక్ష రాసి అంత్యక్రియల్లో పాల్గొన్న ఘటన బీదర్ జిల్లా తాళమడగి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. తాళమడగి గ్రామానికి చెందిన కీర్తన సోదరుడు కార్తీక్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం కార్తీక్ అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. తమ్ముడి మృతితో దుఃఖంలో ఉన్న కీర్తనా పదోతరగతి పరీక్ష రాయడానికి నిరాకరించింది.పరీక్షాకేంద్రం చీఫ్ సురేశ్‌కట్టమని, కస్టోడియన్ మల్లప్పజిగజీవణి వెళ్లి బాలికతో మాట్లాడి పరీక్ష రాసేందుకు ఒప్పించారు. తాళమడగి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో పరీక్ష రాసి అనంతరం తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొంది.

మైదానంలోకి అనుమతించాలి

తుమకూరు: నెల రోజుల క్రితమే ప్రారంభమైన మహాత్మాగాంధీ క్రీడా మైదానం ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరూ తీసుకోకపోవడం వల్ల యువ క్రీడాకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైదానం అభివృద్ధి పనులు పూర్తయినా క్రీడాశాఖ అధికారులు కాని, స్మార్ట్ సిటీ అధికారులు, యువజన సేవ సంస్థ ఎవరూ ముందుకు రాకపోవడంతో మైదానం నిర్మాణం చేసింది ఎవరి కోసమని మండిపడుతున్నారు. వెంటనే మైదానంలో క్రీడాకారులను అనుమతించాలని క్రీడాకారులు డిమాండ్ చేశారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

చిక్కబళ్లాపురం: నగరంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ఈనెల 16 నుంచి మే 6 వరకు సకల రంగ హెజ్జె ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి శిబిరం ఏర్పాటు చేశామని ట్రస్ట్ నిర్వాహకులు, నటుడు దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వేసవి శిబిరాలలో పిల్లల వ్యక్తిత్వ వికాసం, వివిధ ఆటలు, పాటలను ఏర్పాటు చేస్తామని, నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. యక్షగానం, జానపద నృత్యాలు ఉంటాయని, చివరి రోజు పిల్లలతో నాటక ప్రదర్శ, నృత్య, పాటల పోటీలు ఉంటాయన్నారు. పిల్లలు ఆరేళ్ల నుంచి 16 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు ఈ శిబిరంలో పాల్గొన వచ్చన్నారు.

పట్టాలపై ఆర్టీసీ ఉద్యోగి మృతదేహం

యశవంతపుర: దక్షిణకన్నడ జిల్లా పుత్తూరులో కేఎస్ ఆర్టీసీ ఉద్యోగి రైలు పట్టాలపై శవమై తేలాడు. కడబ తాలూకా బెళ్లందూరుకు చెందిన అబీర నివాసి కుసుమాధర(28) తొమ్మిదేళ్లుగా కేఎస్‌ఆర్‌టీసీ పుత్తూరు విభాగంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం వివాహమైంది. ఈక్రమంలో కాణియూరు రైల్వే ట్రాక్‌పై శవమై తేలాడు. స్థానికులతో సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా మిలాప్ ఫెస్ట్



సాక్షి బెంగళూరు: దేశాల ఏర్పాటు చారిత్రక ప్రక్రియ అని ప్రొఫెసర్ ఎస్.గణేశ్ దేవీ అభిప్రాయపడ్డారు. మణిపాల్ అంతర్జాతీయ సాహిత్య, కళా వేదిక (మిలాప్) ఏర్పాటు చేసిన మూడు రోజులు వార్షిక సాహిత్యోత్సవాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెస్ (ఎంయూపీ) రెండు పుస్తకాలను విడుదల చేసింది.అనంతరం వివిధ స్థలాల్లో మాస్టర్ తరగతులు, ప్యానెల్ డిష్కసన్స్, చలనచిత్ర ప్రదర్శనలు నిర్వహించారు. ఈ మిలాప్ శనివారంతో ముగియనుంది.

ఎమ్మెల్యేపై ఈసీకి ఫిర్యాదు

బనశంకరి: జయనగర శాసనసభ్యురాలు సౌమ్యారెడ్డిపై బెంగళూరు దక్షిణజిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు ఎన్‌ఆర్.రమేశ్, ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్‌కుమార్‌మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. సౌమ్యారెడ్డి ఓటర్లకు పంచడానికి తీసుకువచ్చిన చీరలు ఉన్న కారును తిలక్‌నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, ఈమేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదుచేయాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భాస్కర్‌రావ్ యోగేంద్ర హుడాఘట్ట, చంద్రశేఖర్‌రాజు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో ల్యాండింగ్ సమస్య

యశవంతపుర: మంగళూరు విమానాశ్రయంలో ఇండిగో విమానంలో సాంకేతిక సమస్యతో ల్యాండింగ్ సమస్య ఎదురైంది. బెంగళూరునుంచి మంగళూరు వెళ్లిన విమానాన్ని ల్యాండింగ్ చేస్తుండగా సాంకేతిక సమస్యతో కొన్ని నిమిషాలపాటు గాలిలోనే చక్కర్లు కొట్టించిన అనంతరం సాఫీగా ల్యాండింగ్ చేశారు.

రాష్ట్రీయ జనహిత పార్టీ చిహ్నం కుక్కర్



గుర్తును విడుదల చేస్తున్న మంజునాథ్ తదితరులు

శివాజీనగర: రాష్ట్రీయ జనహిత పార్టీకి ఎన్నికల కమిషన్ కుక్కర్ చిహ్నాన్ని కేటాయించింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మంజునాథ్ విశ్వకర్మ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కుక్కర్ గుర్తును ఆవిష్కరించి మాట్లాడారు. 224 నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను పోటీ చేయిస్తామన్నారు. రాష్ట్రాధ్యక్షుడు ఎస్.బీ.రమేశ్, రియాజ్ హుసేన్, ప్రకాశ్, రఘునాథ్‌రావు, రామకృష్ణ, మునిరాజ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టు

మండ్య: సోషల్ మీడియాలో ఎమ్మెల్యే సురేష్ గౌడపై అసభ్యకరంగా పోస్టు పెట్టడంపై జేడీఎస్ మండ్య జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు మహేశ్ మండ్య జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఉమేశ్ అనే వ్యక్తి తన ఫేస్‌బుక్ ఖాతాలో అమ్మాయిలతో పాటు ఎమ్మెల్యేపై అసభ్యకరపోస్టులు పెట్టారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

హోసూరు వార్తలు..

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం



కార్మికురాలికి వీడ్కోలు చెబుతున్న సిబ్బంది

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీ ప్రభుత్వ ఆస్పత్రిలో 20 ఏళ్లుగా తాత్కాలిక పారిశుద్ధ కార్మికురాలి పనిచేస్తున్న మేఘల శుక్రవారం రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేఘలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెక్కేరి పంచాయతీ అధ్యక్షుడు రాజేశ్, బైరమంగలం పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎన్.ఎస్.మాదేశ్వరన్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేట్ హోటల్లో రోటరీక్లబ్, తిరుపతి రాజాముత్తులక్ష్మి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని పారిశుద్ధ కమిటీ అధ్యక్షుడు ఎన్.ఎస్.మాదేశ్వరన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ శిబిరంలో వందకు పైగా యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు, పండ్లు, భోజనం అందజేశారు. కార్యక్రమంలో మనోహరన్, చెన్నైసిల్క్స్ మేనేజర్ విక్రమ్ నారాయణన్, మునీశ్వర్‌నగర్ గృహవసతి సంఘ అధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చింతామణి: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం చింతామణి పట్టణ ప్రముఖ వీధుల్లో బీఎస్‌ఎఫ్ దళాలు, పోలీసులు పెద్ద ఎత్తున కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ, రూరల్ సీఐలు పాల్గొన్నారు.

మైసూరులో ..

మైసూరు: మైసూరు నగరంలో ఉన్న అతి సున్నితమైన నియోజకవర్గంగా గుర్తింపు పొందిన నరసింహరాజ నియోజకవర్గంలో పోలీసులు శుక్రవారం భారీ కవాతు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ రమేశ్ బానోత్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు కల్పతరు, సరస్వతీపుర, ఎండీసీసీ సర్కిల్, అయ్యప్ప హోటల్ సర్కిల్, లీలా థియేటర్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కవాతు చేపట్టారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం



ర్యాలీలో కార్యకర్తలతో ఎమ్మెల్యే సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి బీజేపీ కార్యకర్తలు, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ఈ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి నగరంలోని మంగమ్మపాళ్య సర్కిల్‌లో ఉన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలహారం వేసి కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీలకు బొమ్మనహళ్లి ఒక టూరిస్ట్ ప్రాంతంగా ఉందని, ఎన్నికల సమయం వస్తే తప్ప వారికి ప్రజలు గుర్తుకు రారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఒక్కో నాయకుడిని ఇక్కడకు తీసుకువచ్చి పోటీ చేయిస్తారని, ఎన్నికలు అయ్యాక వారు మళ్లీ ఇటువైపు చూడరన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్‌సలాం, బొమ్మనహళ్లి బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.వి.శ్రీనివాస్‌గౌడ, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, వార్డు అధ్యక్షుడు గోపినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ మహిళా మేనేజర్ ఆత్మహత్య

బనశంకరి: భవనం నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) కంపెనీ మహిళా మేనేజర్ ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన ఎస్‌జే.పార్కుపోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. అశోకనగర నివాసి అపర్ణకుమారి (41) నగరంలోని టౌన్‌హాల్ సమీపంలోని యూనిటీబిల్డింగ్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్‌గా పనిచేస్తోంది. అపర్ణకుమారి దంపతులు గతంలో ఢిల్లీలో పనిచేసేవారు. ఇటీవల అపర్ణకుమారి బెంగళూరుకు బదిలీ అయ్యింది. ఏం జరిగిందో ఏమో మనో వేదనకు గురైన అపర్ణకుమారి రాత్రి 7గంటల వరకు ఐఓసీఎల్ కార్యాలయంలో ఉన్నారు. బాత్‌రూమ్‌వెళ్లి గంటపాటు అక్కడే ఉన్నారు. తర్వాత బయటికి వచ్చి కార్యాలయం కిటికీ తెరిచి దానికి వస్త్రం కట్టి దూకేందుకు ప్రయతించారు. గమనించిన సిబ్బంది కాపాడటానికి వెళ్లగా అప్పటికే అపర్ణకుమారి భవనం నాలుగో అంతస్తుకు చేరుకొని కిందికి దూకింది. తల, చేతులు,కాళ్లకు తీవ్రగాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారని పోలీసులు తెలిపారు. అపర్ణకుమారి ఆత్మహత్యకు కచితమైన కారణం తెలియరాలేదు. ఆమెకు చెందిన డైరీ, కొన్ని వస్తువులను ఎస్‌జేపార్కు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భర్త ఢిల్లీ నుంచి వచ్చిన అనంతరం సమాచారం తెలియనుంది.

దంపతుల బలవన్మరణం

యశవంతపుర: కుటుంబం కలహాలతో దంపతులు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరు పీణ్యా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. తుమకూరుకు చెందిన జగదీశ్ (35) ఆయన భార్య నందిని (30)లు చొక్కసంద్రలో అద్దె ఇంటిలో ఉంటున్నారు. అదే ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం సాయంత్రం ఇంటి యజమాని వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. టెంపో డ్రైవర్‌గా పని చేస్తున్న జగదీశ్, నందిని గార్మెంట్స్ ఉద్యోగిని. మూడేళ్ల నుంచి బెంగళూరులో నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియటం లేదని పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

సుబ్రమణ్యపుర సమీపంలోని పూర్ణప్రజ్ఞ లేఔట్‌లో రశ్మి (30) అనే మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. రశ్మిని భర్త అరవింద్ హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అరవింద్ హత్య చేసినట్లు రశ్మి తల్లిదండ్రులు సుబ్రమణ్యపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండ్య జిల్లా మద్దూరుకు చెందిన రశ్మితో శ్రీరంగపట్టణకు చెందిన అరవింద్‌తో పదేళ్ల క్రితం వివాహం చేశారు. అరవింద్ టెక్కీగా పని చేస్తుండగా, రశ్మి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో ఇద్దరు గొడవ పడ్డారు. శుక్రవారం ఉదయం రశ్మి ఉరి వేసుకున్న స్థితిలో కనిపించింది. రశ్మి కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా అరవింద్‌పై కేసు నమోదు చేసుకున్నారు.

ప్రత్యంగిరాదేవి ఆలయంలో పౌర్ణమి పూజలు





విశేష అలంకరణతో శ్రీ ప్రత్యంగిరాదేవి మూలవిరాట్, హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లిలో వెలసిన ప్రసిద్ధి అదర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో గురువారం రాత్రి పౌర్ణమి పూజలను నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారిని అభిషేకించి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి హోమాలు జరిపించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. హోసూరు, సూళగిరి, బాగలూరు, బేరికె తదితర ప్రాంతాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీకి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 36వ వార్డు అందివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ప్రహరీ, వంటగది నిర్మాణానికి శుక్రవారం హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ.సత్య భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మనకు మనమే పథకం ద్వారా టీవీఎస్ శ్రీనివాసన్ సేవా సంస్థ ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ. 48 లక్షల నిధులను అందజేశారు. కమిషనర్ స్నేహ, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, మాదేశ్వరన్, చెన్నీరప్ప, దేవిమాదేష్, ఇంద్రాణి, కంపెనీ కార్మిక సంఘ అధ్యక్షుడు కుప్పుస్వామి పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

కెలమంగలం: ప్రేమ విషయంపై తల్లిదండ్రులు నిలదీయడంతో జీవితంపై విరక్తి చెందిన 14 ఏళ్ల బాలిక చెరువులో పడి ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట సమీపంలోని ఇరుదుకోట ప్రాంతానికి చెందిన బాలిక ఓ యువకుడిని ప్రేమించింది. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు బాలికను మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెంది సమీపంలోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకొంది. డెంకణీకోట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కమిషనర్ వర్సెస్ జేడీఎస్

యశవంతపుర: కలబురిగి నగరంలో జేడీఎస్ నాయకుడు, కమిషనర్ మధ్య వాగ్వాదం జరిగింది. ముస్లిం చౌక్ రోడ్డులో తోపుడు బండ్లపై ఫాస్ట్‌ఫుడ్ అమ్ముతున్నారు. అదే మార్గంలో వచ్చిన కమిషనర్ ఆర్ చేతన్ వెళ్తూ తోపుడు బండ్ల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందనాన్రు. అక్కడికి వచ్చిన జేడీఎస్ నాయకుడు నాసీర్ హుసేన్.. రంజాన్ పండుగ సీజన్‌లో తోపుడు బండ్లు వేయటం ఆనవాయితీ అని తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తోపుడు బండ్లు వ్యాపారులు కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాసీర్‌తో పాటు తోపుడు బండ్లు వ్యాపారులపై కేసు నమోదు చేశారు.



విజయపుర(బెంగళూరు గ్రామీణ): విజయపురలో రేణుకా యల్లమ్మ దేవి కరగ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై నిఘా



మాట్లాడుతున్న ఉజ్వల్‌కుమార్‌ఘోష్

బనశంకరి: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించేవారిపై నిఘా పెడుతున్నట్లు బీబీఎంపీ ఎన్నికల విభాగ ప్రత్యేక కమిషనర్ ఉజ్వల్‌కుమార్‌ఘోష్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలపై బెంగళూరు పరిధిలోని 28 నియోజకవర్గాల అధికారులలతో బీబీఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సారి సోషియల్‌మీడియా వినియోగదారులపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘాపెట్టిందన్నారు. అభ్యర్థుల తరఫున ప్రచారం, ప్రలోభాలకు గురిచేసే మెసేజ్‌లు వస్తేఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేయవచ్చునన్నారు. ఒకే అకౌంట్ నుంచి సుమారు 50 నుంచి 100 మందికి పదేపదే నగదు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ ప్రకటనల్లో వ్యక్తిగత దూషణలు, కులం, మతం గురించి ప్రస్తావించరాదన్నారు. మీడియాలో ప్రకటనలు ప్రకటించే ముందు ఎంసీ అండ్ ఏ కమిటి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ డాక్టర్ నాగరాజ్, ఎంసీఎంసీ శిక్షణదారుడైన మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

హోసూరు: హోసూరు- బెంగళూరు జాతీయ రహదారిపై విళుపురం డివిజన్ ఖనిజ సంపద శాఖ అధికారిణి విజయలక్ష్మి నేతృత్వంలో అధికార్లు తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో రవాణా సాగిస్తున్న అక్రమ ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

ముగిసిన డాక్టర్ అచ్చెన్న హత్య కేసు నిందితుల కస్టడీ

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ హత్యకు గురైన డాక్టర్ అచ్చెన్న కేసులో సుభాష్ చంద్ర బోస్, బావలూరి చెన్నకృష్ణ, మూడే బాలాజీ నాయక్‌ల పోలీసు కస్టడీ ముగిసింది. అంతకు ముందు.. వీరిని మేజిస్ట్రేట్ అనుమతితో కేసు దర్యాప్తు అధికారి, కడప 'దిశ' పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్. వాసుదేవన్ ముగ్గ్రోజుల పాటు అంటే ఈనెల 6 నుంచి 8 వరకు కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టారు. కస్టడీ ముగియడంతో రిమాండ్ నిమిత్తం వీరిని తిరిగి శనివారం కడప కేంద్ర కారాగారానికి తీసుకెళ్తారు. నిందితులను పోలీసులు గత నెల 27న అరెస్టుచేశారు.

ఇదీ చంద్రబాబు గంజాయి నీతి

ఓ కేసులో నిందితురాలిపై సస్పెన్షన్ ఎత్తివేత

సాక్షి, అమరావతి : రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ ఓ గంజాయి మొక్కని.. ద్వంద్వ నీతికి తాను నిలువెత్తు నిదర్శనమని చంద్రబాబు మరోసారి నిరూపించారు. గంజాయి స్మగ్లర్లకు టీడీపీ అండగా ఉంటుందని కూడా చేతల్లో చూపించారు. ఇందుకు సంబంధించిన ఓ కేసులో కీలక నిందితురాలిగా ఉన్న.. పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన నరసరావుపేటకు చెందిన మానుకొండ జాహ్నవికి పార్టీలోకి తిరిగి ఎర్ర తివాచీ పరిచారు. తద్వారా గంజాయి స్మగ్లర్లకు టీడీపీ అడ్డా అని నిరూపించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో నర్సీపట్నం కేంద్రంగా అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు అనుచర వర్గమే రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్‌ను యథేచ్ఛగా నిర్వహించింది. అధికారం కోల్పోగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఈ విషయంలో దుష్ప్రచారం చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు.. చంద్రబాబు తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఎందుకంటే.. 2013లో గంజాయి స్మగ్లింగ్ ముఠాపై అప్పటి హైదరాబాద్ పోలీసులు దాడిచేసి కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిందితురాలిగా ఉన్న జాహ్నవిని తెలంగాణ పోలీసులు 2022 మేలో అరెస్టుచేశారు. దాంతో టీడీపీ బండారం బట్టబయలైంది. ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు చంద్రబాబు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అప్పట్లో ప్రకటించారు. తుదితీర్పు వచ్చేవరకు ఈ సస్పెన్షన్ అమలులో ఉంటుందని కూడా చెప్పారు. కానీ, జాహ్నవి మాత్రం టీడీపీలో క్రియాశీలంగానే కొనసాగుతోంది. అలాగే, ఆమెపై ఉన్న సస్పెన్షన్‌ను తొలగించాలని చంద్రబాబు తాజాగా నిర్ణయించారు. దీంతో జాహ్నవిపై ఉన్న సస్పెన్షన్‌ను తొలగిస్తున్నట్లు టీడీపీ ఏపీ శాఖ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. కానీ, ఆమెపై ఉన్న స్మగ్లింగ్ కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ పార్టీలో ఆమెపై సస్పెన్షన్‌ను తొలగించి టీడీపీలోకి ఆమెను తిరిగి ఆహ్వానించడం ద్వారా చంద్రబాబు తన నైజాన్ని మరోసారి చాటుకున్నారు.

గంజాయి రాష్ట్రంగా ఏపీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



మామ బాలకృష్ణతో కలిసి పాదయాత్ర చేస్తున్న నారా లోకేశ్

శింగనమల/ గార్లదిన్నె: ఆంధ్రప్రదేశ్ గంజాయి రాష్ట్రంగా మారిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత ఇంట్లోని పిల్లలకు కూడా గంజాయి అలవాటు చేశారని, చంద్రగిరి నియోజకవర్గంలో తాను కళ్లారా చూశానని ఆరోపించారు. శుక్రవారం ఆయన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలో పాదయాత్ర చేశారు. శింగనమల క్రాస్‌లో జరగిన సభలో మాట్లాడారు. జగన్‌కు రాజారెడ్డి రాజ్యాంగం అయితే, తనకు అంబేడ్కర్ రాజ్యాంగం ఉందని చెప్పారు. సాగనిస్తే పాదయాత్ర , అడ్డుకుంటే దండయాత్ర చేస్తానన్నారు. 'నీవే మా భవిష్యత్తు' అంటూ స్టిక్కర్లు అతికించేందుకు వస్తున్న వలంటీర్లకు బంధువులే జగన్‌ను నమ్మడంలేదని, తామెలా నమ్ముతామని చెప్పాలని ప్రజలకు సూచించారు. జగన్‌కు చెబుదాం కార్యక్రమంలో ప్రత్యేక హోదా గురించి చెబుదామా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ గురించి చెబుదామా, కడప స్టీల్ ప్లాంట్ గురించి చెబుదామా అని అన్నారు. శింగనమలలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవినీతి, అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పాదయాత్రలో లోకేశ్ మామ, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా పాల్గొన్నారు.

ఎమ్మెస్పీకి మించి మార్కెట్ ధరలు

ఫైన్ వెరైటీ ధాన్యంతో సహా 13 రకాల పంటలకు మంచి ధరలు

- సాధారణ, గ్రేడ్–ఏ ధాన్యం పూర్తిగా ఎమ్మెస్పీకి ప్రభుత్వం కొనుగోలు
- ధరలు తగ్గిన ప్రతీసారి అండగా సర్కారు
- 'రైతుబంధు' అవసరం లేకుండానే కల్లాల నుంచే రైతుల అమ్మకాలు
- నాలుగేళ్లలో రైతుబంధు పథకానికి రూ.310 కోట్లు కేటాయింపు
- అయినా ఈ పథకాన్ని నిలిపివేశారంటూ విష ప్రచారం
- రైతులకు రుణాలివ్వడం లేదంటూ ఈనాడు గగ్గోలు

సాక్షి, అమరావతి: గతంలో విత్తుకునే సమయంలో ఉండే ధర పంటలు కోతకోసే నాటికి ఉండేది కాదు. దీంతో కాస్త మంచిరేటు వచ్చేవరకు మార్కెట్ గోదాముల్లో నిల్వచేసుకుని, 'రైతుబంధు' పథకం కింద రుణాలు తీసుకుని సాగుకోసం పెట్టిన అప్పులను తీర్చుకునేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో పండే ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటలకు గతంలో ఎన్నడూలేని రీతిలో కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)లకు మించి మార్కెట్‌లో ధరలు పలుకుతున్నాయి. కల్లాల నుంచి నేరుగా కొనేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. ఫలితంగా తాము పండించిన పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేందుకు గోదాముల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. రుణాలు పొందేందుకు ఆసక్తి చూపడంలేదు. ఈ వాస్తవాలను తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా ఈనాడు కట్టుకథలను అచ్చేస్తూ నిత్యం అభాసుపాలవుతోంది.

ఏటా బడ్జెట్ కేటాయింపులు..

కనీస మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తులకు మంచి ధర లభించేంత వరకు వారికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిందే రైతుబంధు పథకం. మార్కెట్ గోదాముల్లో నిల్వచేసిన పంట ఉత్పత్తులపై గరిష్టంగా రూ.2 లక్షల వరకు అందించే రుణంపై 180 రోజుల వరకు వడ్డీ ఉండదు. ఆ తర్వాత 181వ రోజు నుంచి 270 రోజుల వరకు 12శాతం చొప్పున వడ్డీ వసూలుచేస్తారు. ఈ పథకానికి 2019–20లో రూ.70 కోట్లు, 2020–21లో రూ.70 కోట్లు, 2021–22లో రూ.80 కోట్లు కేటాయించగా, గడిచిన 2022–23లో ఏకంగా రూ.90 కోట్లు కేటాయించింది. 2019–20లో ఈ పథకం కింద తమ పంట ఉత్పత్తులను నిల్వచేసుకోవడం ద్వారా 1,826 మంది రూ.17.23 కోట్ల రుణాలు పొందగా, 2020–21లో 517 మంది రూ.71లక్షలరుణాలు పొందారు.

ఎమ్మెస్పీకి మించి మార్కెట్ ధరలు

సీఎం యాప్ ద్వారా గ్రామస్థాయిలో పంట ఉత్పత్తుల ధరలను ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. ఎమ్మెస్పీకి మించి ధరలు పతనమైన ప్రతీసారి మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ ధరలు పెరిగేలా చేస్తోంది. సాధారణ, గ్రేడ్–ఏ రకం ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఫలితంగా ఇతర పంట ఉత్పత్తులకు కూడా మంచి రేటు పలుకుతోంది. కోతల దశలోనే ఎమ్మెస్పీకి మించి ధరలు పలుకుతుండడంతో మంచి ధర కోసం పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వచేసుకోవడం, రైతుబంధు పథకం కింద రుణాలు పొందాలన్న ఆసక్తి రైతుల్లో కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో వాస్తవాలిలా ఉంటే.. రైతుబంధు పథకాన్నే రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసినట్లు, పంట నిల్వచేసుకునే రైతులకు రుణాలివ్వడానికి ప్రభుత్వం ముఖం చాటేసినట్లుగా ఈనాడు విషప్రచారం చేస్తుండడంపట్ల రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుబంధుకు ఏటా కేటాయింపులు



మార్కెట్‌లో మించి ధరలు లభిస్తుండడంవల్లే గోదాముల్లో దాచుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు.అలాగే రైతులెవ్వరూ రైతుబంధు పథకం కింద రుణం పొందేందుకు ముందుకు రావడం లేదు. దీనిని రద్దు చేయడం గానీ, ఏటా నిధుల కేటాయింపులు ఆపడంగానీ చేయలేదు. రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
– రాహుల్ పాండే, కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ

గడిచిన రెండేళ్లుగా ఎమ్మెస్పీకి మించి ధరలున్న పంటలివే.. (క్వింటాల్.. రూపాయల్లో)

పంటలు	రకము	ఎమ్మెస్పీ	లోకల్ మార్కెట్ ధర 2021-22	లోకల్ మార్కెట్ ధర 2022-23
ధాన్యం	సాధారణ	2,040	2,400 (ఫైన్)	2,600 (ఫైన్)
	గ్రేడ్ ఏ	2,060	2,415 (ఫైన్)	2,515 (ఫైన్)
జొన్నలు	హైబ్రిడ్	2,970	3,400	3,500
	మాల్దిండి	2,990	5800	6,000
సజ్జలు		2,350	2,600	2,800
రాగులు		3,578	4,000	4,200
మొక్కజొన్న		1,962	2,500	2900
కందులు		6,600	7,965	8,000
పెసలు		7,755	7,900	8,500
మినుములు		6,600	7,500	8,800
వేరుశనగ		5,850	7,000	7,280
నువ్వులు		7,830	8,500	10,000
పత్తి	మధ్యస్థ పింజ	6,080	8,300	8,500
	పొడవు పింజ	6,380	8,600	8,900

శ్రీవారి సేవలో సీజే, కేంద్రమంత్రి



జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న జేఈవో



ఆలయం వెలుపల కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ


తిరుమల: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మంలు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనాన్ని, అధికారులు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం సీజే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ గోపాలకృష్ణారావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు దర్శనం ఏర్పాట్లు చేసి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. క్యూ వెలుపలకు వచ్చింది. నారాయణగిరి షెడ్లు అన్నీ నిండిపోయాయి. క్యూ గోగర్భం రింగ్ రోడ్డు వరకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 60,101 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.03 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 30 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, జంషెడ్‌పూర్‌కు చెందిన సర్ లాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళమిచ్చింది. సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర చెక్కులను తిరుమల అన్నమయ్య భవనంలో ఈవోకి అందజేశారు.

కుప్పంలో లక్ష మెజార్టీతో గెలుస్తా

- 175 నియోజకవర్గాల్లో ప్రజలు టీడీపీని గెలిపిస్తారు
- రూ.5 వేలు కడితే పర్మినెంట్ మెంబర్‌షిప్ ఇస్తాం
- జగనే రాష్ట్రానికి దరిద్రం, శని, సైతాన్
- టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల సమావేశంలో చంద్రబాబు



నెల్లూరులోని టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీ దిగిన చంద్రబాబు

నెల్లూరు (టౌన్): వచ్చే ఎన్నికల్లో తాను కుప్పం నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తానని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, పార్టీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఫండ్ రైజింగ్ పేరుతో రూ.5 వేలు చెల్లిస్తే పార్టీ పర్మినెంట్ మెంబర్‌షిప్ ఇస్తామన్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో వైఎస్సార్‌సీపీ పతనం ప్రారంభమైందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలు 175 నియోజకవర్గాల్లో టీడీపీని గెలిపించి వైఎస్సార్‌సీపీని ఇంటికి పంపిస్తారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైనాట్ కుప్పం అని చెబుతున్నారని, తాము వైనాట్ పులివెందుల అనే లక్ష్యంతో పనిచేస్తామని తెలిపారు. 2024 ఎన్నికల్లో క్లస్టర్, మండల, బూత్ ఇన్‌చార్జిలు ఎన్ని ఓట్లు సంపాదిస్తామో అన్న ప్రణాళికను రచించుకోవాలన్నారు. ప్రజాసంబంధాలు ముఖ్యమని, ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్ ప్రజలతో సంబంధం లేకనే లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేదన్నారు. తనకు మనుషులే లేరని చెబుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు, 9 మంది రాజ్యసభ సభ్యులను ప్రజలే ఇచ్చారన్నారు. తాము 7.70 లక్షల ఇళ్లు పేదలకు కట్టిస్తే వాటిని గత నాలుగేళ్లుగా వారికి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. జగనే రాష్ట్రానికి దరిద్రం, శని, సైతాన్ అని అన్నారు. పోస్టింగ్‌లు పెట్టినా, వార్తలు రాసినా జైలుకు పంపిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని ప్రజలు నిలదీయాలన్నారు. వలంటీర్ వ్యవస్థ ప్రజల కోసం పెట్టారని, ప్రజలు కట్టిన పన్నుల తోనే వారికి జీతాలు ఇస్తున్నారన్నారు. వలంటీర్లు జగన్‌కు, వైఎస్సార్‌సీపీకి సేవలు చేయాల్సిన అవసరం లేదన్నారు. వలంటీర్ల వ్యవస్థను వ్యతిరేకించడంలేదని, వారు జవాబుదారీతనంగా ఉండాలని అన్నారు. వైఎస్సార్‌సీపీకి పనిచేసే వారిని క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ నాయకులు నిలదీయాలన్నారు. దేశంలో 100 నగరాల్లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. 100వ కార్యక్రమంలో భాగంగా మే 31న రాజమండ్రిలో మహానాడు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఎన్ని ఇళ్లు కట్టారు

సాక్షి, అమరావతి : ఈ నాలుగేళ్లలో మీరు ఎన్ని ఇళ్లు కట్టారని ప్రతిపక్ష నేత చంద్రబాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ట్విటర్‌లో ప్రశ్నించారు. నెల్లూరులో నిర్మించిన టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీ దిగి దాన్ని సీఎం జగన్ ట్విటర్‌కు ట్యాగ్ చేసారు. తమ ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్క నెల్లూరులోనే వేలాదిగా కట్టిన టిడ్కో ఇళ్లు ఇవేనని, లక్షల టిడ్కో ఇళ్లకు ఇవి సజీవ సాక్ష్యాలని తెలిపారు. మీరు కట్టిన ఇళ్లు ఎన్నో చెప్పాలని ప్రశ్నించారు.

సెల్ఫీ బాబులు.. కామెడీ రాజాలు

- నెల్లూరులో బాబు సెల్ఫీపై రాష్ట్ర మంత్రి జోగి రమేశ్
- వైఎస్ జగన్ ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రూ. 8,734 కోట్లు ఖర్చు చేసింది
- బాబు వదిలిపెట్టిన బకాయిలనూ తీర్చాం
- ఈ పథకం పేరిట చంద్రబాబు చేసింది అవినీతి మాత్రమే
- నెల్లూరులో బాబు కట్టని ఇళ్ల వద్ద సెల్ఫీలు దిగటం సిగ్గుచేటు
- బాబు వస్తే మేం కట్టిన ఇళ్లు చూపిస్తాం
- పేదల కోసం సీఎం వైఎస్ జగన్ కడుతున్న ఊళ్లను చూస్తే బాబు గుండె ఆగుతుంది





నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లు..



సాక్షి, అమరావతి: నారా చంద్రబాబు, లోకేశ్ సెల్ఫీ బాబులు, కామెడీ రాజాలుగా తయారయ్యారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ఎద్దేవా చేశారు. పేదలకు వారు నిర్మించిన ఇళ్లంటూ నెల్లూరులో టిడ్కో ఇళ్ల వద్ద బాబు సెల్ఫీ దిగడంపై మంత్రి ఒక ప్రకటనలో స్పందించారు. టీడీపీ హయాంలో నెల్లూరులో టిడ్కో ఇళ్లు, ఇప్పుడున్న ఇళ్ల నాడు–నేడు ఫోటోలను విడుదల చేశారు. నెల్లూరులో టిడ్కో ఇళ్లన్నీ ఆయనే కట్టేశానని చెప్పుకోవడానికి సిగ్గులేదా? అని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబే టిడ్కో ఇళ్లన్నీ కట్టేస్తే మరి వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టినవేమిటని అన్నారు. టిడ్కో ఇళ్ల రూపంలో పేద, మధ్యతరగతి ప్రజలకు చంద్రబాబు చేసిందేమీ లేదని చెప్పారు. టిడ్కో ఇళ్ల పేరిట పేదవారి ఆశలను ఆసరాగా చేసుకుని అవినీతికి పాల్పడ్డారని అన్నారు. చదరపు అడుగు నిర్మాణానికి ఆ రోజుల్లో రూ.1,000–1,100 మధ్య ఖర్చయితే అంతకు రెండు మూడు రెట్లు అధికంగా టెండర్లు ఖరారు చేసి దోచేశారన్నారు. అది కూడా ఒక్క చోటా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, అస్తవ్యస్తంగా వదిలేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాకే టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, అన్ని మౌలిక వసతులతో ప్రజలకు అందిస్తోందని తెలిపారు. నెల్లూరులోనూ బాబు కట్టని ఇళ్ల వద్ద సెల్ఫీలు తీసుకొని తానే కట్టానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక టిడ్కో ఇళ్ల కోసం రూ. 8,734 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అందులో రూ. 5,840 కోట్లు, నిర్మాణ పనులకు, టీడీపీ అస్తవ్యస్తంగా వదిలేసిన ఇళ్లకు మౌలిక సదుపాయాల కోసం రూ.725 కోట్లు ఖర్చు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వదిలిన రూ.3 వేల కోట్లు బకాయిలు కూడా తమ ప్రభుత్వమే తీర్చిందని తెలిపారు. బాబు హయాంలో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లకు ఒక్కో లబ్ధిదారుడిపై రూ. 7.2 లక్షలు భారం వేయగా, వైఎస్ జగన్ ఆ భారాన్ని తొలగించి, ఇళ్లను ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. ఇలా పేదలపై రూ. 3,805.4 కోట్ల మేర భారాన్ని తప్పించారన్నారు. 365 చ.అ, 430 చ.అ ఇళ్ల లబ్ధిదారులకు ముందస్తు చెల్లింపుల్లో 50 శాతం సబ్సిడీని సీఎం జగన్ కల్పించారన్నారు. ఈ రూపేణా రూ.482.31 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించిందన్నారు. ఒక్క రూపాయికే ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయిస్తూ రూ.1,200 కోట్ల రిజిస్ట్రేషన్ భారాన్ని కూడా తొలగించామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్ల అంచనాలు పెంచేసి, దోచేస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక రివర్స్ టెండరింగ్ చేపట్టి రూ.392 కోట్లు ప్రజాధనం ఆదా చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అస్తవ్యస్తంగా వదిలేసిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ఇప్పటికే 50వేల ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరలోనే లబ్ధిదారులు అందిస్తామని చెప్పారు. చంద్రబాబు తమతో వస్తే ఇళ్లు ఎక్కడ కడుతున్నారో చూపిస్తామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఊళ్లను చూస్తే చంద్రబాబు గుండె ఆగిపోయినా ఆశ్చర్యం లేదన్నారు. టీడీపీం సెల్ఫీల పార్టీ అని ఆరోపించారు. చంద్రబాబు వాలకం చూస్తుంటే చార్మినార్, తాజ్‌మహల్ కూడా ఆయనే కట్టేశానని ఓ సెల్ఫీతీసుకునేట్టు ఉన్నారన్నారు. తండ్రీ కొడుకుల కామెడీని రాష్ట్ర ప్రజలు చూడలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.

చంద్రబాబుకు నిలువెల్లా విషమే

- 175 సీట్లలో పోటీ చేస్తామని చెప్పే ధైర్యం ఉందా?
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(సెంట్రల్): టీడీపీ అధినేత చంద్రబాబుకి నిలువెల్లా విషమే ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఆయన శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అసలు వైఎస్ జగన్ పేరు పలికే అర్హత కూడా బాబుకు లేదని చెప్పారు. అధికారంలో ఉన్న సమయంలో జిల్లాకు ఏమి చేశారో చెప్పలేని స్థితిలో ఉన్న చంద్రబాబు.. నెల్లూరుకు ఏ ముఖం పెట్టుకుని వచ్చారని మండిపడ్డారు. పెన్నా నది పక్కనే ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీ తీసుకుని ఆయనే కట్టించాడని చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఈ ఇళ్లు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని నిలదీశారు. షీర్‌వాల్ టెక్నాలజీ పేరుతో కమీషన్లు దండుకోవడం తప్ప, లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. నెల్లూరు, సంగం బ్యారేజీల వద్ద సెల్ఫీ తీసుకుని, నేను పూర్తి చేయలేకపోయాను, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి రైతాంగానికి నీరిస్తున్నారని చెప్పి సిగ్గుపడాలని బాబుకు హితవు పలికారు. చంద్రబాబుకు కమీషన్లపై శ్రద్ధ తప్ప కమిట్‌మెంట్ లేదని విమర్శించారు. పులివెందులలో పాగా వేస్తామని చెబుతున్న బాబుకు 175 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ చేస్తారని చెప్పే ధైర్యం ఉందా అని సవాల్ చేశారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వివరిస్తున్నామని మంత్రి అన్నారు. చంద్రబాబు మాత్రం బాదుడే బాదుడు అంటూ కార్యక్రమం పెట్టి ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేక తోకముడిచారని చెప్పారు. విషాదానికి, వినోదానికి తేడా తెలియని వాళ్లు కూడా వారి పార్టీని గెలిపిస్తారని చెబుతున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థ గురించి నీచంగా మాట్లాడడం మానుకోవాలని మంత్రి చెప్పారు.

రిజిస్ట్రేషన్లలో అనూహ్య వృద్ధి

- 2018లో కేవలం 16 లక్షల రిజిస్ట్రేషన్లు
- 2023లో 26 లక్షలకు పెరుగుదల

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు అనూహ్యంగా పెరిగాయి. గత ప్రభుత్వం కంటె వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక భారీ పెరుగుదల నమోదైంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2018–19 సంవత్సరంలో 17.60 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022–23 సంవత్సరంలో ఆ సంఖ్య 26.25 లక్షలకు చేరింది. అంటే టీడీపీ హయాం కంటే 50 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు పెరిగాయన్నమాట. 2020–21కి ముందు నామమాత్రంగా ఉన్న రిజిస్ట్రేషన్లు ఆ తర్వాత అనూహ్యంగా పెరిగాయి. 2021–22 సంవత్సరంలో ఏకంగా 52 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం కూడా అది కొనసాగడంతో పాటు కొంత పెరుగుదల కూడా కనిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు గతం కంటె బాగా పెరిగినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా గతం కంటే బాగా పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల ఆదాయం 9.86 శాతం పెరిగింది. గతేడాది కంటే రూ.725 కోట్ల ఎక్కువ ఆదాయం లభించింది. గతేడాది రూ.7,347 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.8,071 కోట్లకు పెరిగింది. అత్యధికంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 24 శాతం ఆదాయం పెరిగింది. ఆ తర్వాత ఉమ్మడి కృష్ణా జిల్లాలో 21.95 శాతం, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 19.80 శాతం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 19.07 శాతం మేర ఆదాయం పెరిగింది.

పదేళ్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం, డాక్యుమెంట్ల వివరాలు

సంవత్సరం	రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం (కోట్లలో)
2014-15	13,70,469	2,874.44
2015-16	15,12,008	3,585.12
2016-17	13,71,415	3,457.96
2017-18	15,43,050	4,242.23
2018-19	17,60,858	4,724.75
2019-20	17,02,488	4,895.15
2020-21	17,20,402	5,399.41
2021-22	26,16,694	7,346.11
2022-23	26,25,177	8,071.13

లోకేశ్ సాక్షిగా దళితుడిపై దాడి

- నియోజకవర్గ ఇన్‌చార్జి తండ్రినే కొట్టిన 'తమ్ముళ్లు'
- లోకేశ్ విడిది వద్ద అగ్రవర్ణ నేతల అనుచరులు

శింగనమల/గార్లదిన్నె: తెలుగుదేశం పార్టీ నేతలు తమ పార్టీకే చెందిన ఓ దళితుడిపై దాడికి పాల్పడ్డారు. అదీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎదుటే ఈ దాడి జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తండ్రినే టీడీపీ నాయకులు కొట్టారు. ఈ దాడిలో గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం (ఎస్సీ రిజర్వుడ్) నుంచి గత ఎన్నికల్లో బండారు శ్రావణి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత ఆమెను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు. కానీ పార్టీపరంగా అధిష్ఠానం పూర్తి స్వేచ్ఛ ఇవ్వలేదు. ఆమెకు పోటీగా అగ్రవర్ణాలకు చెందిన ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడుతో ద్విసభ్య కమిటీని నియమించింది. ప్రస్తుతం ఇన్‌చార్జి, కమిటీ సభ్యుల మధ్య వర్గ పోరు నడుస్తోంది. గురువారం రాత్రి పాదయాత్రకు వచ్చిన నారా లోకేశ్‌ను కలిసేందుకు గార్లదిన్నె మండలం మర్తాడులోని విడిది కేంద్రానికి నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణి, ఆమె తండ్రి బండారు రవికుమార్, తల్లి లీలావతి వెళ్లారు. అక్కడే ఉన్న ద్విసభ్య కమిటీ సభ్యుల అనుచరులు వారిని అడ్డుకున్నారు. బండారు రవికుమార్‌పై దాడి చేశారు. గాయాలపాలైన ఆయన స్పృహతప్పి పడిపోయారు. అక్కడ ఉన్న పోలీసులు దాడిని అడ్డుకున్నారు. రవికుమార్‌ను అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అలాగే గార్లదిన్నె సభా స్థలం వద్ద బండారు శ్రావణి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ద్విసభ్య కమిటీ సభ్యుల అనుచరులు చించేశారు. టీడీపీలో ఎస్సీలకు ఏ మేరకు ప్రాధాన్యత ఉందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయని అంటున్నారు.

వై నాట్ 175.. వై నాట్ కుప్పం?

- రానున్న ఎన్నికల్లో ఇదే మా పార్టీ నినాదం
- నాలుగేళ్లలో 98.6 శాతం హామీల అమలు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు నాలుగు మెడికల్ కాలేజీలు
- గీతం భూకబ్జాపై చంద్రబాబు ఎందుకు మాట్లాడలేదు?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం : రానున్న ఎన్నికల్లో 'వై నాట్ 175.. వై నాట్ కుప్పం' అనేది తమ పార్టీ నినాదమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఎన్నికలకు ముందు తమ నాయకుడు ఇచ్చిన హామీలన్నింటినీ మేనిఫెస్టోలో పొందుపరిచి.. ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలోనే 98.6 శాతం అమలు చేసి చూపించామని చెప్పారు. సీఎం జగనన్న అందించిన సంక్షేమం, అభివృద్ధే రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో గెలిచేందుకు దోహదపడుతుందన్నారు. శుక్రవారం ఆమె మద్దిలపాలెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనతో ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా సీఎం జగన్ తీర్చిదిద్దారని కొనియాడారు. 14 ఏళ్ల పాటు సీఎంగా చంద్రబాబు చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలో సీఎం జగన్ చేసి చూపించారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు నాలుగు మెడికల్ కాలేజీలు, ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ.10 వేల పింఛను ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. విశాఖకు వచ్చి ఎన్నో విషయాలపై ప్రశ్నించిన చంద్రబాబు.. గీతం 40 ఎకరాల భూకబ్జా గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఈ ప్రాంతాన్ని పరిపాలనా రాజధానిగా చేస్తుంటే అడుగడుగునా అడ్డుకుంటున్న బాబుకు ఈ ప్రాంత ప్రజలు ఎలా ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక నిర్వహించిన పవర్‌ఫుల్ ఇండియన్ సర్వేలో సీఎం జగన్‌కు స్థానం దక్కడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్ సర్వేలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు.

ఆమె పేరులో భాగ్యం ఉంది.
ఆ భాగ్యం జీవితంలో కొరవడింది.
ఆమె పేదరికంతో పోరాడింది.
శారీరక వైకల్యంతో ఎదురీదింది.
సమాజంలో విజేతగా నిలిచింది.
అభినందనలు అందుకుంటోంది.

భాగ్య మయూరి



తమిళనటి, నర్తకి సుధాచంద్రన్ ఒక అద్భుతం. నాట్య మయూరిగా పేరు తెచ్చుకుంది. నెమలిలా నాట్యం చేసే ఆమెతో విధి వింత నాటకం ఆడింది. ఒక కాలిని తీసుకెళ్లింది. ఆమె నిర్ఘాంతపోయింది. నడవడమే కష్టం అనుకున్న స్థితి నుంచి కోలుకుని కృత్రిమ కాలితో నాట్యం చేసింది. మన తెలుగు నాట్య మయూరితో విధి మరింత ఘోరంగా ఆటలాడుకుంది. ఆమెను ఒక్క కాలితోనే భూమ్మీదకు పంపించింది. డాన్స్ చేయాలంటే రెండు కాళ్లు ఉంటే మంచిదే... కానీ లేదని ఊరుకోవడమెందుకు? ఒక కాలు లేకపోతేనేం... మరో కాలుందిగా... అంటూ డాన్స్ చేస్తోంది. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం గెలిచాయి. తెలంగాణ జానపద కళలంటే ప్రాణం పెట్టే భాగ్య అందులోనే ఎం.ఏ చేస్తోంది. తన విజయగాథను సాక్షితో పంచుకుంది.



నాట్య ప్రదర్శనలో...

బస్సులు మారలేక...

''మాది మహబూబాబాద్ జిల్లా, గూడూరు గ్రామం. అమ్మ కూలిపనులకు వెళ్తుంది. నాన్న మేకలు కాస్తాడు. అన్న, నేను ఇద్దరం పిల్లలం. నేను పుట్టడమే ఒక విచిత్రం. బిడ్డ ఒక కాలు లేకుండా పుట్టిందని ఊరంతా వచ్చి చూశారట. ఆ తర్వాత నేను పెరగడం, చదువు, డాన్స్ నేర్చుకోవడం... అన్నీ విచిత్రంగానే గడిచాయి. సెవెన్త్ క్లాస్ వరకు వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, పెద్ద కొర్పోల్‌లో చదువుకున్నాను. ఆ తర్వాత హన్మకొండలో సాగింది. ఇంటర్ ప్రైవేట్ కాలేజ్‌లో చదివించడం డబ్బుండి కాదు. ప్రభుత్వ కాలేజీకి రెండు బస్సులు మారి వెళ్లాల్సి ఉండింది. నేనలా వెళ్లలేనని ప్రైవేట్ కాలేజ్‌లో చేర్చారు. వరంగల్ ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చేసి, ఇప్పుడు హైదరాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద కళల్లో ఎం.ఏ. చేస్తున్నాను. ఇంతకీ నేను డాన్సర్‌గా మారిన వైనం మరీ విచిత్రం.

కొత్త అడుగులు

ఎల్‌బి స్టేడియంలో ఇచ్చిన ప్రదర్శన నా జీవితాన్ని కొత్తగా రాసింది. డిసెంబర్ మూడవ తేదీ 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్'. ఆ సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో నాలుగు రోజుల ముందు నుంచి ఆటలు, డాన్స్ ప్రోగ్రామ్‌లు జరిగాయి. నా డాన్స్ ఫొటోలు పేపర్‌లో వచ్చాయి. ఆ పేపర్ చూసి మా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కిషన్‌రావు సర్ నన్ను పిలిచి మాట్లాడారు. మా ఆర్థిక పరిస్థితి, గవర్నమెంట్ పెన్షన్‌తో హాస్టల్ ఫీజు కట్టుకుంటూ చదువుకుంటున్నానని తెలుసుకుని ఆయన చలించిపోయారు. ఆయన ఎవరెవరితో మాట్లాడారో తెలియదు. వీసీ సర్, రిజిస్ట్రార్ సర్ కలిసి మూడు లక్షల నిధులు సేకరించి, జర్మనీ నుంచి డాన్స్ చేయడానికి వీలుగా ఉండే ప్రొస్థటిక్ లెగ్‌ను తెప్పించి పెట్టించారు. ఇప్పుడు ఆ కాలితో నడక ప్రాక్టీస్ చేస్తున్నాను. నడక మీద పట్టు వచ్చిన తర్వాత డాన్స్ చేస్తాను.



కృత్రిమ కాలు అమర్చిన తర్వాత...

బాలెన్స్‌కి నెల పట్టింది

నేను నైన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు జరిగిందా విచిత్రం. ప్రముఖ డాన్సర్ లారెన్స్ మాస్టారి ఆలోచన నన్ను డాన్సర్‌ని చేసింది. ఆయన దగ్గర పని చేసిన ప్రశాంత్ మాస్టారు స్పెషల్లీ ఏబుల్డ్ పిల్లలకు డాన్స్ నేర్పించడానికి మేమున్న హాస్టల్‌కి కూడా వచ్చారు. అలా అప్పుడు వాళ్లు పది మందికి పైగా స్టూడెంట్స్‌ని సేకరించి డాన్స్ క్లాసులు మొదలు పెట్టారు. వారిలో స్టేజ్ మీద ప్రదర్శనలిచ్చే స్థాయికి చేరింది ముగ్గురమే. అప్పటివరకు కర్ర లేకుండా నిలబడగలమనే ఊహ కూడా లేని వాళ్లమే అందరం. మొదట ఒక కాలి మీద దేహాన్ని బాలెన్స్ చేయడం సాధన చేశాం. బాలెన్స్ సాధించడానికి నెల పట్టింది. సినిమా పాటలు, జానపద నృత్యం, బతుకమ్మ పాటలు ప్రాక్టీస్ చేశాను. ఆ కోర్సు తర్వాత కూడా సొంతంగా కొన్ని పాటలకు సాధన చేశాను. టీవీ ప్రోగ్రామ్‌లలో కూడా డాన్స్ చేశాను. దసరా ఉత్సవాలు, వినాయక చవితి, ఇతర సమావేశాల్లో అవకాశాలను వెతుక్కుంటూ నాట్యం చేస్తున్నాను. శివరాత్రికి వేములవాడ రాజరాజేశ్వరస్వామి గుడిలో కూడా నాట్యం చేశాను. ఇక్కడ మరో విచిత్రం... ఏమిటంటే, సిట్టింగ్ వాలీబాల్ ఆడే అవకాశం వచ్చింది. ఈ ఆటకు మన దగ్గర పెద్దగా ఆదరణ లేదు. రాజస్థాన్, హర్యానా, తమిళనాడు, కర్నాటకల్లో జరిగిన పోటీలకు హాజరయ్యాను. థాయ్‌లాండ్‌లో జరిగే పోటీలకు ఎంపిక ప్రక్రియలో నెగ్గాను. మనదేశం తరఫున ఆడే అవకాశం వచ్చింది. కానీ కరోనా కారణంగా వెళ్లలేకపోయాను.

తెలంగాణ ఆట పాట

ఫోక్ ఆర్ట్స్ కోర్సులో భాగంగా డప్పు, జానపదగేయాలు, కర్రసాము, చెక్క భజన వంటి తెలంగాణ సంప్రదాయ కళలను నేర్చుకున్నాను. బతుకమ్మ పాటలను సేకరించి పాడాను. ఇతర పాటలు పాడే అవకాశాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. డాన్స్‌లో కూడా నిరూపించుకుంటాను. నాకు సీటు ఇచ్చేటప్పుడు సీటు వృథా అవుతుందేమోనని సందేహించిన యూనివర్సిటీనే ఇప్పుడు నాకు అండగా నిలిచింది. నేను ఎవరికీ భారం కాకూడదు, నా కాళ్ల మీద నేను నిలబడాలనే పట్టుదలే నన్ను ఇంతవరకు నడిపించింది'' అని చెప్పింది భాగ్య.

సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యం ఆమె సొంతం. ఆడపిల్లలకు ధైర్యం ఒకింత ఎక్కువగా ఉండాలని చెప్తోంది. బాలికలకు కర్రసాము నేర్పించి ధీరలుగా మలవాలనే ఆమె ఆశయం, జానపదానికి సేవ చేయాలనే ఆమె ఆకాంక్ష నెరవేరాలి.

– వాకా మంజులారెడ్డి

'మహిళల జీవితంలో నెలసరి అనేది ఒక భాగం'. ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా ఎన్నో ప్రాంతాలలో, ఎన్నో రకాలుగా నెలసరికి సంబంధించి మూఢ నమ్మకాలు, ఆంక్షలు ఉన్నాయి.
వాటిని 'థీన్‌దరిపచా' నాటకం సూటిగా ప్రశ్నిస్తోంది.
అజ్ఞాన జాడ్యాలను కడిగి పారేస్తూ, కొత్త ఆలోచనకు వేదిక అవుతోంది...

రంగస్థలం

త్రినేత్ర త్రికాల నాటకం



కేరళలోని త్రిస్సూర్ జిల్లాకు చెందిన పన్నెండు మంది మహిళలు నటించిన థీన్‌దరిపచా (రుతుమతి) నాటకం వివిధ ప్రాంతాలలో ప్రదర్శితమవుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. 'త్రిస్సూర్ స్కూల్ ఆఫ్ ఆర్ట్' ఫ్యాకల్టీ శ్రీజిత్ రమణన్ ఈ నాటకానికి దర్శకత్వం వహించాడు.

నాటకం స్క్రిప్ట్ విషయానికి వస్తే అది జడపదార్థంలా ఎప్పుడూ లేదు. తొలినాటకం నుంచి స్క్రిప్ట్ మారుతూనే ఉంది. కొత్త అంశాలను జోడిస్తూనే ఉంది. రిహార్సల్స్ సమయంలో నటీమణులు తమ వ్యక్తిగత అనుభవాలు, పడిన బాధలను స్క్రిప్ట్‌లోకి తీసుకువచ్చారు. అన్ని అనుభవాలు ఒకే రకంగా ఉన్నట్లుగా అనిపించినా సూక్ష్మదృష్టితో చూస్తే... వయసు, కుటుంబ నేపథ్యం, ప్రాంతం ప్రకారం వేటికవే భిన్నమైనవిగా కనిపిస్తాయి.

'థీన్‌దరిపచా' నాటకానికి ఊపిరిపోసిన నటీమణులు... గార్గి, స్మిత, మృదుల, అంజన, అనుజ, శ్రీదేవి, అఖిల, సజిత, దీప్తి, విద్య, నీల, ఆత్మజ.

'ఈ నాటకంలో నటించడానికి నట ప్రతిభ ఒక్కటే సరిపోదు. సామాజిక అవగాహన కూడా ఉండాలి. అదృష్టవశాత్తు నాటకంలో నటించిన పన్నెండు మందిలో సామాజిక స్పృహ ఉంది. విశ్లేషణ సామర్థ్యం ఉంది. స్క్రిప్ట్‌కు ఊపిరి పోసి జీవం పోశారు' అంటున్నాడు డైరెక్టర్ శ్రీజిత్.



గంట నిడివి ఉన్న ఈ నాటకం ఎన్నో ఇండ్లను కంటి ముందుకు తీసుకువస్తుంది.

ఒక ఇంట్లో...
'తల్లీ... కొన్ని రోజులు ఆ పచ్చళ్ల జాడీలను ముట్టుకోవద్దు'

మరో ఇంట్లో...
'ఈ సమయంలో పూలచెట్లను ముట్టుకోవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను'

ఇంకో ఇంట్లో...
'కొన్నిరోజుల వరకు నువ్వు వంటగదిలోకి రావద్దమ్మా'

ఇది ఒకే ఒక కథను చెప్పే నాటకం కాదు. ఎన్నో ఇండ్లలోని సంఘటనలు, జ్ఞాపకాలు, శుభకార్యాలు, పీడకలలు... ఎన్నో కోణాలలో ఎన్నో అంశాలకు అద్దం పడుతుంది.

ఒక అమ్మాయి గొంతు నుంచి తన తొలి పీరియెడ్ అనుభవాన్ని రికార్డ్ ద్వారా వినిపించడంతో నాటకం మొదలవుతుంది.

కొత్త టూల్స్, మ్యూజిక్, డ్యాన్స్, డైలాగులు, బాడీ మూమెంట్స్, కలర్ పాటర్న్స్‌తో ఈ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

ఎరుపురంగు శాలువా, ఫాబ్రిక్స్, లైట్స్‌ను సందర్భానికి తగినట్లుగా బయోలాజికల్ రియాలిటీ అనే అంశానికి ప్రతీకాత్మకంగా వాడారు.

ఫాంటస్మాగోరియ (రకరకాల ఎలిమెంట్స్‌తో మారే సీన్‌లు, కలలలో కనిపించే అంశాలకు రూపం ఇవ్వడం) టెక్నిక్‌ను ఈ నాటకం కోసం వాడుకున్నారు.

సోషల్ సైకిల్‌కు సింబాలిక్‌గా నాటకాన్ని ఒక సర్కిల్‌లో ప్రదర్శిస్తారు. చుట్టూ ప్రేక్షకులు కూర్చుంటారు. నాటకంలో నటించేవారు ఉన్నట్టుండి ప్రేక్షకుల్లోకి వచ్చి సామాజిక విషయాలపై సంభాషిస్తూ వారిని కూడా నాటకంలో భాగం చేస్తారు.

'ఇది గత, వర్తమాన, భవిష్యత్‌లకు సంబంధించిన త్రికాల నాటకం' అంటుంది నాటకంలో నటించిన మృదుల.

'వర్క్ ఇన్ ప్రోగ్రెస్‌లాగా ప్లే ఇన్ ప్రోగ్రెస్‌లాంటి నాటకం ఇది' అంటుంది మరో నటి అఖిల.

బ్యూటిప్స్



మేనికాంతి కోసం...

చర్మం నిగనిగలాడుతూ ఉండటం కోసం, ముఖం మెరుపులీనడం కోసం రకరకాల క్రీములు, మందులు వాడుతుంటారు చాలామంది. అయితే వాటితోపాటు ఒత్తిడి కూడా లేకుండా చూసుకోవడం అవసరం. ఎందుకంటే ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలు శారీరక ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతాయి. ఫలితంగా ముఖం పీక్కుపోయినట్లు ఉండటం, జిడ్డు కారుతూ ఉండటం, చెమట ఎక్కువగా పట్టడం, చర్మంపై చిన్న చిన్న దద్దులు, పొక్కులు వంటివి రావడం వంటి సమస్యలు తీవ్రం అవుతాయి. ఈ పరిస్థితిలో యోగా, ధ్యానం వంటివి చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఒత్తిడి, మానసిక సమస్యలను అదుపులో ఉంచేందుకు కంటినిండా నిద్రపోవడం కూడా ఎంతో మేలు చేస్తుంది.




- చర్మం మెరుస్తూ ఉండాలంటే చర్మ సంరక్షణ చాలా ముఖ్యం. చర్మాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రెగ్యులర్ ఫేషియల్స్, క్లీనప్‌లు చేయాలి. శనగ పిండి, పసుపు, పెరుగు, తేనె వంటి ఇంటి చిట్కాలు చర్మాన్ని తళతళ మెరిసేలా చేయడంలో సహాయపడతాయి.



- ఆహారంలో అన్ని రకాల పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవాలి. శరీరానికి అన్ని ముఖ్యమైన పోషకాలు, విటమిన్‌లను పుష్కలంగా అందించడానికి కొన్ని ప్రత్యేక పద్ధతులను అవలంబించాలి. ఆహారంలో కూరగాయలు, పండ్లను సమృద్ధిగా ఉండేలా చూసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

కిచెన్ టిప్స్

- కూరగాయలను తరగడం పూర్తయిన తర్వాత చాపింగ్ బోర్డును శుభ్రం చేయడం కొంచెం చిరాగ్గానే ఉంటుంది. చాకు వెనుక వైపు (పదును లేని వైపు) తిప్పి బోర్డు మీద రుద్దితే కూరగాయల అవశేషాలు సులువుగా ఊడి వచ్చేస్తాయి.



- మైక్రోవేవ్‌లో చేపలను వండిన తర్వాత ఆ వాసన వదలడం కష్టం. చిన్న టవల్‌ను ఒవెన్‌లో పెట్టి అర గంట సేపు వేడి చేస్తే వాసన క్లాత్‌కు పట్టేస్తుంది. ఆ తర్వాత మరో శుభ్రమైన టవల్‌తో తుడిస్తే ఒవెన్ శుభ్రపడుతుంది.
- అల్లం పొట్టు తొలగించడం పెద్ద పరీక్షగానే ఉంటుంది. చాకుతో తీస్తే పొట్టుతోపాటు అల్లం కూడా పోతుంది. స్పూన్‌తో ప్రయత్నిస్తే అల్లం మలుపుల్లో ఉండే పొట్టు కూడా సున్నితంగా వదులుతుంది.

పాజిటివ్ ఎనర్జీ

ఇది నా ప్రియ నర్తన హేల

కళ ఆమెకు ఊపిరి పోస్తున్నదో కళకు ఆమె ఆయువు ఇస్తున్నదో గాని వేదిక మీద కథక్ ప్రదర్శన ఇచ్చే అలకనందను చూస్తే ప్రతి ఒక్కరికీ ప్రతికూల పరిస్థితులపై పోరాడాలని అనిపిస్తుంది. ఒవేరియన్ క్యాన్సర్‌తో పోరాడుతూ కీమోథెరపీ తీసుకుంటూ కూడా అలకనంద తన కథక్ కళను కొనసాగిస్తోంది. ఒడిషాకు చెందిన ఈ కళాకారిణి ఓటమిని అంగీకరించవద్దంటోంది.



అలకనంద

గత ఆగస్టులో ఇది జరిగింది.

వేదిక మీద అలకనంద దాస్‌గుప్త కథక్ ప్రదర్శన ఇస్తోంది. జనం మమేకమై చూస్తూ ఉన్నారు. ఆమె తల మీద దుపట్టాను చుట్టుకుని నృత్యం చేస్తోంది. అందరూ ఆస్వాదిస్తూ ఉన్నారు. ఒక్కసారిగా ఆమె దుపట్టా తొలగించింది. అంతే. అందరూ ఆశ్చర్యపోయారు.

దానికి కారణం ఆమె శిరోముండనం చేసుకుని ఉండటమే. కొన్ని క్షణాలే. ఆ తర్వాత ఆమె నృత్యం కొనసాగించింది. సాధారణంగా మహిళా నృత్యకారిణికి జడే అందం. జడ లేకుండా నృత్యం చేస్తే చూడటానికి ప్రేక్షకులు పెద్దగా ఇష్టపడరు. కాని అలకనంద తాను ఎలా ఉన్నానో అలా కనిపించి, వారిని మెప్పించింది. ప్రదర్శన అనంతరం అందరూ కరతాళధ్వనులు మార్మోగించారు.



అలకనంద

'శిరోజాలు నా శరీరంలో ఒక భాగం. అవి మాత్రమే నేను కాదు. కీమో థెరపి వల్ల వెంట్రుకలు రాలిపోతున్నాయి. అందుకని ముండనం చేయించాను. ఇలా కూడా నా ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నాను' అంది 48 ఏళ్ల అలకనంద.

ఆమె కొంతకాలంగా ఒవెరియన్ కేన్సర్‌తో పోరాడుతూ ఉంది. కాని పోరాటం పోరాటమే నృత్యం నృత్యమే. 'నాకు ఆరేళ్ల వయసులో కథక్ నేర్పించారు. 16 ఏళ్ల వయసు నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. నృత్యం నాకు ఆక్సిజన్. అది లేకుండా బతకలేను. నాకు క్యాన్సర్ ఉందని గుర్తించాక డాక్టర్ పూర్తిగా డాన్స్ మానేయమని చెప్పింది. దాని బదులు మరణించడం మేలని అన్నాను. మనం ఒక్కసారే చనిపోతాం. రోజూ బతుకుతాం. ఒక్కసారి చనిపోయే రోజు కోసం ఎదురు చూస్తూ బతకాల్సిన ప్రతిరోజునూ ఎందుకు వృథా చేసుకోవాలి' అంటుందామె.

ఒడిషాకు చెందిన అలకనంద నోయిడాలో స్థిరపడింది. కథక్ నృత్యకారణిగా, గురువుగా ఆమె పేరు గడించింది. మహా భారతంలోని గాథలను కథక్ రూపకాలుగా ప్రదర్శించే తీరుకు చాలా ప్రశంసలు ఉన్నాయి. ముఖ్యంగా ద్రౌపది పాత్రలోని స్త్రీవాద కోణాన్ని ఆమె ప్రదర్శిస్తుంది. 'నృత్యం అంటే కాళ్ల చేతుల కదలిక కాదు. ప్రేక్షకుల్లో తేవాల్సిన కదలిక' అంటుందామె.

అయితే గత సంవత్సరం ఆమెకు క్యాన్సర్ రావడం ఆమె ఎదుట పెద్ద సవాలుగా నిలిచింది. 'ఏమైనా ఇది నన్ను ఓడించకూడదు అనుకున్నాను. ఒక సర్జరీ చేశారు. పొట్ట మీద 36 కుట్లు ఉన్నా రెండు నెలలు విశ్రాంతి తీసుకోమన్నా నేను నృత్యాన్ని మానేయాలనుకోలేదు. అంతెందుకు మూడో కీమో థెరపీ నుంచి ఆరో కీమో థెరపి మధ్యలో 15 షోస్ చేశాను' అంటుందామె.

అలకనంద దాస్‌గుప్తాకు ఇద్దరు అబ్బాయిలు. 'నా ఇద్దరు కొడుకులు నాకు మనో నిబ్బరం కలిగిస్తున్నారు. నేను డాన్స్ చేస్తానంటే అలాగే అమ్మా అని నా మనసు గ్రహిస్తున్నారు. జీవితంలో కష్టాలు ఉంటాయి. ఏదో ఒక పిచ్చి లేకపోతే ఆ కష్టాలను దాటడం కష్టం' అంది అలకనంద.

ఆమె చేస్తున్న ప్రియ నర్తనం కొనసాగుతూ ఉండాలని కోరుకుందాం.

సెల్ఫ్-స్టార్టర్

లాయరమ్మా! ది గ్రేట్

అనగనగా ఒక కథ. ఆ కథలో... ఒక వ్యక్తి ముందుకు వెళుతున్న కొద్దీ కొత్త వస్తువులు, నగలు, నిధులు కనిపిస్తుంటాయి. 'నిల్చున్నచోటే ఉండకుండా నువ్వు ఎంత ముందుకు వెళితే అన్ని అద్భుతాలు కనిపిస్తాయి' అంటుంది ఆ కథ. చిన్నప్పుడెప్పుడో ఈ కథ విన్న అర్చన ముందుకు వెళుతూనే ఉంది. విజయాలు సాధిస్తూనే ఉంది. తాజాగా భారత వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (ఫిక్కీ) మహిళల విభాగానికి (ముంబై చాప్టర్) ఛైర్‌పర్సన్‌గా ఎంపికైంది అర్చనా ఖోస్లా బర్మన్...

తమిళనాడులోని వెల్లింగ్‌టన్ టౌన్‌లో పుట్టిన అర్చన అస్సాం నుంచి గుజరాత్ వరకు ఎన్నో రాష్ట్రాలలో చదువుకుంది. పంజాబ్‌లోని 'మొహాలి ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా'లో చదువుకున్న అర్చన దేశంలోని ప్రసిద్ధ లా ఫర్మ్‌లలో పనిచేసింది.



అర్చనా ఖోస్లా బర్మన్

వ్యాపార ప్రారంభంలో వ్యాపార అవసరాలు మాత్రమే కాదు వివిధ దశలలో 'లీగల్ వర్క్'తో కూడా పని ఉంటుంది. చాలామంది ఔత్సాహికులకు ఈ 'లీగల్ ప్రాసెస్' అనేది సజావుగా జరగదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటయిందే... వెర్టిసెస్ పార్ట్‌నర్స్.

కార్పొరేట్ లాయర్‌గా తొమ్మిది సంవత్సరాలు పని చేసిన తరువాత వినాయక్ బర్మన్, అమిత్ వ్యాస్‌లతో కలిసి 'వెర్టిసెస్ పార్ట్‌నర్స్' పేరుతో సొంతంగా లా ఫర్మ్ మొదలుపెట్టింది. మహిళా వ్యాపారులు, ఇన్వెస్టర్‌లకు న్యాయ సహాయం, సలహాలు అందించడానికి ఏర్పాటయిన ఈ సంస్థ 'హార్ట్ అండ్ ఆనెస్టీ' నినాదంతో ముందుకు వెళ్లింది.

మొదలైన సంవత్సరంలోనే 'డెబ్యూ లా ఫర్మ్ ఆఫ్ ది ఇయర్–ప్రైవేట్ ఈక్విటీ'అవార్డ్ అందుకుంది.

అర్చన ప్రాక్టీస్ ఏరియాలు...కార్పొరేట్ కమర్షియల్ లా, వెంచర్ క్యాపిటల్ అండ్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్.

ఒకవైపు సంస్థ పనుల్లో తలమునకలవుతూనే మరోవైపు స్త్రీ సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థలు, ఎన్నో అంకుర సంస్థలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లతో కలిసి పనిచేసింది అర్చన.

'ఎఫ్ఎల్‌వో–ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ మహిళా వ్యాపారుల కోసం ఎన్నో శక్తిమంతమైన కార్యక్రమాల చేపట్టింది. ఎఫ్ఎల్‌వో–ముంబై చాప్టర్‌కు ఛైర్‌పర్సన్‌గా ఎంపిక కావడాన్ని గర్వంగా భావిస్తున్నాను' అంటుంది అర్చన.

2023–2024 లక్ష్యాల గురించి ప్రస్తావిస్తూ...

'పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మరింతమంది మహిళలు, యువతరంతో కలిసిపనిచేస్తాం. తాము వ్యాపారులుగా ఎదగడానికి ఏవైతే అడ్డుగోడలని వారు అనుకుంటున్నారో అలాంటి గోడలు లేకుండా చేసి కొత్త దారిని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. వొకేషనల్ ట్రెనింగ్ ద్వారా గ్రామీణప్రాంతాలలోని మహిళలు, యువత జీవితాల్లో మార్పు తీసుకురావాలనుకుంటున్నాం. అట్టడుగు వర్గాల ప్రజల కోసం కొత్త కార్యక్రమాలు రూపొందించాలనుకుంటున్నాం. మహిళలను దృష్టిలో పెట్టుకొని చట్టపరమైన హక్కులు, విధుల గురించి అవగాహన సదస్సులు, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్యాంపులు విస్తృతంగా నిర్వహించాలనుకుంటున్నాం' అంటుంది అర్చన.

గత ఏడు సంవత్సరాలుగా 'ఫిక్కీ'లో పనిచేస్తున్న అర్చన 'ఎఫ్ఎల్‌వో'లో వివిధ పదవులు నిర్వహించింది. 'స్టార్టప్ కారవాన్' పేరుతో ఔత్సాహిక మహిళా వ్యాపారుల కోసం ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

ఫోర్బ్స్ 'టాప్ లాయర్స్ ఇన్ ప్రైవేట్ ఈక్విటీ', ఏషియ లీగల్ బిజినెస్ (40 అండర్ 40), ఏషియా పసిఫిక్ రీజియన్(40 అండర్ 40) జాబితాలో చోటు సంపాదించింది.

'నా వెనుక ఎవరూ లేరు అనుకొని అధైర్యపడేవారు హార్డ్‌వర్క్ ఉంది అనుకుంటే ఎంతో ధైర్యం వస్తుంది' అంటుంది అర్చనా ఖోస్లా బర్మన్.



అందరం ఆరోగ్యంగా ఉందాం

ఆరోగ్యం జాగ్రత్త... ఇది ప్రతి ఇంట్లో వినిపించే మాటే. అమ్మా నాన్నలకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించే మంచి కొడుకున్న ఇళ్లు చాలానే ఉంటాయి. చంటి పిల్లల నుంచి పెద్ద పిల్లల వరకు వాళ్లు తుమ్మినా, తుమ్మక పోయినా పట్టించుకునే తల్లులూ ఉంటారు. అయితే అదే ఇంట్లో విపరీతమైన ఆరోగ్యనిర్లక్ష్యానికి గురయ్యే రెండు ప్రాణాలు కూడా ఉంటాయి. వాళ్లు ఆ ఇంటి దంపతులే. పిల్లలను బాగా చూసుకుంటారు, వయసు మళ్లిన వాళ్లనూ శ్రద్ధగా చూసుకుంటారు. మన భారతీయ మనోఫలకం మీద ఆరోగ్యం అంటే యుక్త వయసు వచ్చే వరకు, వార్ధక్యం వచ్చిన తరవాత మాత్రమే పట్టించుకునే అంశంగా మారిపోయింది. ఇది కాదు నిజం. ఆరోగ్య సంరక్షణ అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ.


కరోనా వచ్చి పోయింది. మధ్య వయసుకు దగ్గరలో ఉన్న మహిళల మీద వార్ధక్యం ఉన్న ఫళంగా దాడి చేసేసింది. మగవాళ్లలో అయితే యుక్తవయసులోనే ఉన్నట్లుండి గుండె ఆగిపోవడం చూస్తున్నాం. కరోనా తర్వాత ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రపంచం అంతటా శ్రద్ధ పెరిగింది. ఏం తినాలో, ఏం తిన కూడదోననే స్పృహ పెరిగింది. కానీ అంతకంటే ఎక్కువ అయోమయం కూడా పెరిగిపోయింది. సమతుల ఆహారం తీసుకోవడం గురించి మాట్లాడుతున్నాం, కానీ సమ్మిశ్రిత ఆహారం తీసుకోవడంలో విఫలమవుతున్నాం. మన దేహంలో ఏం లోపించిందో తెలుసుకుని, దానిని సరిగ్గా భర్తీ చేయగలిగిన ఆహారాన్ని తీసుకోవాలి.

మాల్ న్యూట్రిషన్ తెలుసు... కానీ!

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోషకాహారం గురించిన అవగాహన పెరిగింది. అందులో సందేహం లేదు. ఈ తరంలో ఆర్థిక సమస్యల కారణంగా పోషకాహారలోపానికి (మాల్ న్యూట్రిషన్) గురవుతున్న వాళ్లు చాలా చాలా తక్కువ. జంక్‌ఫుడ్ వ్యామోహంలో పడి సూక్ష్మ పోషకాలలేమిని 'కొని' తెచ్చుకుంటున్న వాళ్లే ఎక్కువ. అలాగే దేహం పోషకాలను గ్రహించే విధానం తెలియక పోవడం వల్ల అనారోగ్యాల బారిన పడేవాళ్లు కూడా ఎక్కువవుతున్నారు. మాల్ అబ్జార్బ్షన్ గురించిన అవగాహన లేకపోవడంతో 'మంచి ఆహారం తీసుకుంటున్నాం' అనుకుంటూ కడుపు నిండా తింటున్నప్పటికీ దేహం ఆరోగ్యానికి దూరంగానే ఉంటోంది. అనారోగ్యాలను నివారించలేకపోతోంది. అమ్మో! అంత అన్నమా ఎన్ని కార్బ్స్!) వెళ్తాయో?! ఈ రోజు ప్రొటీన్ ఎంత తీసుకున్నాం' అని జాగ్రత్తలు తీసుకునే వాళ్లు కూడా సమ్మిళితంగా తీసుకుంటున్నామా లేదా అని చూడడం లేదు. డాక్టర్‌ను సంప్రదించి మనదేహంలో ఏవి ఎంత పాళ్లలో ఉన్నాయో పరీక్ష చేయించుకుని ఏం తినాలో ఎలా తినాలో అవగాహన పెంచుకుందాం. అలాగే డాక్టర్‌ను చూడాల్సింది అనారోగ్యం వచ్చిన తర్వాత మాత్రమే అనుకుంటాం. అనారోగ్యాలను నివారించడానికి క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. రొటీన్ చెకప్‌లకు క్రమం తప్పకుండా వెళ్లాల్సింది వయసు మళ్లిన వాళ్లు మాత్రమే కాదు, వయసులో ఉన్న వాళ్లు కూడా. అప్పుడే ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి ఇల్లూ ఆరోగ్యంగా ఉంటే... 'హెల్త్ ఫర్ ఆల్' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్దేశం నెరవేరుతుంది.

ఇది లైఫ్‌స్టైల్ డిసీజ్

ఎండ కన్నెరగని జీవితాల్లో డీ విటమిన్ లోపం సాధారణమైపోయింది. నరాలు, కండరాలు, వ్యాధినిరోధక శక్తి మీద విటమిన్ డీ ప్రభావం ఉంటుంది. దేహంలో డీ విటమిన్ లోపిస్తే... నీరసం, నిస్సత్తువ, తరచూ అంటువ్యాధుల బారిన పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్యాల్షియమ్ సమృద్ధిగా లభించే ఆహారాన్ని తీసుకున్నా సరే... దేహం ఆ క్యాల్షియమ్‌ను స్వీకరించదు. ఆహారంలోని క్యాల్షియమ్‌ని దేహం చక్కగా స్వీకరించాలంటే దేహంలో డీ విటమిన్ తగినంత ఉండాలి. అలాగే ఐరన్ కూడా. మనం ఆహారంలో తీసుకున్న ఐరన్‌ని దేహం గ్రహించాలంటే దేహంలో సీ విటమిన్ తగినంత ఉండాలి. విటమిన్ సీ లోపం ఉన్న వాళ్లు ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకున్నా సరే దేహం సంగ్రహించుకోలేదు. దాంతో ఐరన్ లోపం ఏర్పడి రక్తహీనతకు దారి తీస్తుంది. అంతేకాదు... మనం పీల్చిన గాలి నుంచి ఆక్సిజెన్ తగు పాళ్లలో మెదడుకు చేరడం కూడా ముఖ్యమే. అలాగే ఛాతీ నిండుగా గాలి పీల్చుకోగలగడమూ అంతే అవసరం.



ఇవన్నీ తిందాం

దైనందిన ఆహారపు అలవాట్లలో భాగంగా అన్నం కూరలు, రొట్టె, పప్పులకు తోడుగా అవసరాన్ని బట్టి ఈ కింద చెప్పిన వాటిని ఆహారంలో భాగం చేసుకుందాం.

- క్యాల్షియమ్ కోసం... రాగులు, నువ్వులు, సబ్జా, అవిశె గింజలు, వాల్‌నట్, గెనస గడ్డ (స్వీట్ పొటాటో), పాలకూర, పుదీనలో క్యాల్షియమ్ పుష్కలంగా ఉంటుంది.
- ప్రొటీన్ పుష్కలంగా ఉండే సోయాబీన్స్‌తోపాటు మునగాకు, మునక్కాయలు వారంలో రెండు దఫాలు ఆహారంలో భాగం కావాలి. పాలు, పెరుగు లేదా మజ్జిగ రోజూ తీసుకోవాలి.
- ఐరన్ కోసం... మష్రూమ్, క్యాలీఫ్లవర్, లివర్, ట్యూనా ఫిష్, రొయ్యలు, బీట్‌రూట్, శనగలు, బ్రౌన్ రైస్, పుచ్చకాయ, దానిమ్మ, స్ట్రాబెర్రీలు, ఆపిల్‌తోపాటు విటమిన్ సీ సమృద్ధిగా ఉండే పైనాపిల్, పియర్, నారింజ, కమలాలు తీసుకోవాలి. డ్రైఫ్రూట్స్‌లో ఆప్రికాట్, కిస్‌మిస్, ఖర్జూరాలు, గుమ్మడి గింజలు నమిలి తినాలి. అన్ని కాలాల్లో దొరికే సంపూర్ణ పోషకాల అరటి పండ్లు నిత్య ఆహారంగా ఉండాలి.

పైవన్నీ తీసుకుంటే డీ విటమిన్ కూడా తగినంత అందుతుంది. మష్రూమ్, సోయా, గుడ్లు, పాలు, పెరుగు, మీగడలు, చేపలు డీ విటమిన్‌నిచ్చే ఆహారాలు. వీటితోపాటు రోజుకు కనీసం పావుగంటసేపు దేహానికి సూర్యరశ్మి తగలాలి. సూర్యరశ్మి సోకే చోట మార్నింగ్ లేదా ఈవెనింగ్ వాకింగ్ చేస్తే మంచిది.

ఇవి సాధారణ ఆరోగ్యం కోసం పాటించాల్సిన ప్రధానమైన ఆహార జాగ్రత్తలు మాత్రమే. మనదేహంలో క్యాల్షియమ్, ఐరన్ స్థాయులను బట్టి డాక్టర్ సూచన మేరకు కచ్చితమైన డైట్ ప్లాన్‌ను అనుసరించాలి.



గింజలూ ఆరోగ్యకరమే!

బొప్పాయి పండు తరగగానే ముందు అందులో ఉండే గింజలు తీసి అవతల పారేస్తాం. బొప్పాయి గింజలపై జిగురు లాంటి పదార్థం ఉంటుంది. ఇవి కొద్దిగా కారంగా, చేదుగా ఉంటాయి. వీటిని ఎండబెట్టి.. మిక్సీలో పొడిలా చేసి తినవచ్చు. బొప్పాయి గింజల్లో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వు, ప్రొటీన్ ఉంటాయి. ఇంకా జింక్, ఫాస్పరస్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం వంటి విటమిన్లు, ఖనిజాలు కూడా ఉంటాయి. ఇంకా ఈ గింజల్లో ఒలీక్ యాసిడ్, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యాన్ని పెంచుతాయి.



బొప్పాయి గింజలు తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ సాధారణ స్థాయికి తగ్గుతుంది. వీటిలో ఉండే కార్పైన్ అనే పదార్థం పేగులలోని పురుగులు, బ్యాక్టీరియాను చంపుతుంది. ఈ విత్తనాలలోని అధిక ఫైబర్.. పేగులు బాగా కదిలేలా చేస్తుంది. ఫలితంగా జీర్ణక్రియ బాగా జరుగుతుంది. మలబద్ధకాన్ని పోగొడుతుంది. బొప్పాయి గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి.. శరీర వ్యర్థాలను తొలగిస్తుంది. శరీరంలో అనవసర కొవ్వు నిల్వ ఉండకుండా చేస్తుంది. ఫలితంగా త్వరగా బరువు తగ్గిపోతారు. బొప్పాయిలో ఉండే కెరోటిన్.... ఈస్ట్రోజెన్ లాంటి హార్మోన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. బొప్పాయి గింజలు ఋతుక్రమం సరైన క్రమంలో ఉండేలా చేస్తాయి. పీరియడ్స్ నొప్పిని కొంతవరకూ తగ్గిస్తాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సీ, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మంట, నొప్పిని తగ్గిస్తాయి.

బొప్పాయి గింజల్లో పాలీఫెనాల్స్... అనేక రకాల క్యాన్సర్ల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. రోజూ 5 నుంచి 6 బొప్పాయి గింజలను తీసుకుని.. వాటిని చూర్ణంలా చేసి తినండి. లేదా పొడిలా చేసి నీటిలో కలిపి తాగేయండి. బొప్పాయి గింజల సారాన్ని తాగడం వల్ల... కడుపులో ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాలు చనిపోతాయి.

జీవక్రియలు వేగం పుంజుకోవాలంటే..?



మనం చాలాసార్లు మెటబాలిజం అనే పదాన్ని వింటూ ఉంటాం. శరీరం శక్తిని ఖర్చు చేసే వేగమే మెటబాలిజం. దీనినే జీవక్రియలు చురుగ్గా ఉండటం అంటారు. ఈ వేగం మన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. మెటబాలిజాన్ని పరిగెత్తించ గలిగితే, శరీరంలో కొవ్వు పేరుకునే అవకాశాలు తగ్గుతాయి. కాబట్టి అందుకు ఉపయోగపడే అలవాట్లను అలవరుచుకోవాలి. అవేంటంటే....

కంటినిండా నిద్ర: మెటబాలిజం చురుగ్గా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి. కాబట్టి రోజుకు 8 గంటలకు తగ్గకుండా ప్రశాంతంగా నిద్రపోవాలి.

హై ఇంటెన్సిటీ వర్కవుట్స్: వ్యాయామం తర్వాత కూడా మెటబాలిజం వేగంతో పని చేయాలంటే హై ఇంటెన్సిటీ వర్కవుట్స్ చేయాలి. దీన్నే 'ఆఫ్టర్ బర్న్ వర్కవుట్' అంటారు.

వెయిట్ లిఫ్టింగ్: బరువులు ఎత్తడం వల్ల ఆరోగ్యకరమైన, సన్నటి కండర కణజాలం తయారవుతుంది. కాబట్టి నిద్రావస్థలో ఉన్న మెటబాలిజం మేల్కొనాలంటే బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.

చురుకైన జీర్ణశక్తి: మెటబాలిజం పెరగాలంటే జీర్ణశక్తి మందగించే ఆహారానికి దూరంగా ఉండాలి. ఇలాంటి ఆహారం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ పెరిగి మెటబాలిజం కుంటుపడుతుంది. కాబట్టి తేలికగా అరుగుతూ, స్వల్ప పరిమాణాల్లో గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేసే ఆహారానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి.

హెల్త్ టిప్స్

- సబ్జాగింజలను డైలీ తీసుకోవడం వల్ల మలబద్ధకం, హైబీపీ, అధిక బరువు సమస్యలు తగ్గుతాయి. నీరసంగా ఉన్నప్పుడు సబ్జా గింజలు నానబెట్టిన నీళ్లు తాగడం వల్ల నీరసం తగ్గి యాక్టివ్‌గా ఉంటారు. ఈ గింజల్లో ఉన్న క్యాల్షియం, మ్యాంగనీస్, ఫాస్పరస్‌లు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. క్రమం తప్పకుండా సబ్జాగింజలను నానపెట్టుకుని తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.



- శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే..కొబ్బరినూనెలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి పేస్టులా కలిపి దద్దుర్ల పైన రాస్తే ఉపశమనం లభిస్తుంది.




సినిమా

తైవాన్ టు సౌతాఫ్రికా


కమల్‌హాసన్

తైవాన్‌కు బై బై చెప్పాడు భారతీయుడు. 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, బాబీ సింహా, బెనెడిక్ట్ గారెట్, గుల్షన్ గ్రోవర్ కీ రోల్స్ చేస్తున్నారు. ఇటీవల తైవాన్‌లో మొదలైన 'ఇండియన్ 2' షెడ్యూల్ ముగిసింది. ఈ షూటింగ్ షెడ్యూల్‌లో కమల్‌హాసన్ పాల్గొనగా, కొన్ని కీలక సన్నివేశాలతో పాటు విదేశీ ఫైటర్స్‌తో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. తైవాన్ షెడ్యూల్ తర్వాత యూనిట్ సౌతాఫ్రికా వెళ్తుందని, అక్కడి లొకేషన్స్‌లో మరో యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసిందనికి వినికిడి. ఈ చిత్రాన్ని సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ కలిసి నిర్మిస్తున్నారు.

పుష్ప.. జిందాబాద్


అల్లు అర్జున్

"తిరుపతి జైలు నుండి బుల్లెట్ గాయాలతో తప్పించుకున్న పుష్ప, ఆ ప్రయత్నంలో పోలీసులు పుష్పపై పది రౌండ్ల కాల్పులు జరపగా.. తను తీవ్రంగా గాయపడ్డాడని తెలుస్తోంది'' అనే డైలాగ్స్‌తో మొదలైంది 'పుష్ప: ది రూల్' సినిమా కాన్సెప్ట్ టీజర్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం తొలి పార్ట్ 'పుష్ప: ది రైజ్' ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' సినిమా షూటింగ్ జరుగుతోంది. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. కాగా నేడు అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా కాన్సెప్ట్ టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'శేషాచలం అడవుల్లో పుష్ప జాడ కోసం మొదలవుతున్న కూంబింగ్ ఆపరేషన్', పుష్ప పోలీసుల కాల్పుల్లో మరణించాడన్న వదంతులు వ్యాపించడంతో చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో అల్లర్లు చేలరేగాయి, పుష్ప.. జిందాబాద్, పుష్ప అన్న బతికాడ్రాయ్యా. అడవిలో జంతువులు రెండడుగులు ఎనకేసినాయంటే పులొచ్చింది అని అర్థం. అదే పులే రెండడుగులు ఎనక్కేసిందంటే పుష్ప వచ్చిండాడని అర్థం'' అనే డైలాగ్స్ కాన్సెప్ట్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలోని గంగమ్మ జాతర బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఓ యాక్షన్ సీక్వెన్స్‌లోని అల్లు అర్జున్ లుక్‌ను ఫస్ట్ లుక్‌గా రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది.

గగన పోరాటం


వరుణ్ తేజ్

దేశంలో జరిగిన వైమానిక దాడుల్లో మన సైనికులు ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు? ఎంతటి వీరోచితంగా పోరాడతారో వరుణ్ తేజ్ చూపించనున్నారు. దేశంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా భారతీయ వైమానిక దళ పైలెట్‌గా వరుణ్ తేజ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. "ఇప్పటివరకు చూడని భీకర వైమానిక దాడుల్లో మన వీరుల పోరాటాన్ని ఈ చిత్రంలో చూపించనున్నాం. తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం గ్వాలియర్‌లో షూటింగ్ చేశాం. అక్కడి షెడ్యూల్ పూర్తయింది'' అని చిత్రబృందం పేర్కొంది.


జోగి నాయుడు, పోసాని కృష్ణమురళి, గౌతమ్ రెడ్డి, అలీ, సి. కల్యాణ్

అది చిన్న నిర్మాతలకు జగన్‌గారిచ్చిన వరం - సి. కల్యాణ్

ఏపీలో ప్రజల వద్దకే సినిమా

"సినిమా రిలీజైన రోజు ఇంట్లోనే ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే అవకాశం ఏపీ ఫైబర్‌నెట్ కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగారి ఆలోచన మేరకు 'ప్రజల వద్దకు సినిమా'ను తీసుకు వస్తున్నాం'' అని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ– "భారతదేశంలో ఎక్కడా లేని విధంగా నెట్ సేవలను ఏపీలో తక్కువ ధరకు ఇస్తున్నాం. పెద్ద హీరోలకు, నిర్మాతలకు మేము వ్యతిరేకం కాదు. సినిమాను బేస్ చేసుకుని ఫిఫ్టీ-ఫిఫ్టీ రేషియో ఉంటుంది. ఏపీఎస్ఎఫ్ఎల్ పల్లెటూర్లతో ఎక్కువ కనెక్ట్ అయింది. దీనివల్ల మారుమూల గ్రామాల్లో ఉన్నవారు కూడా రిలీజ్ రోజు సినిమా చూసే చాన్స్ లభిస్తుంది'' అన్నారు.

నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– "ఫైబర్ నెట్‌లో సినిమా రిలీజ్ అనేది చిన్న నిర్మాతకు జగన్ గారిచ్చిన వరం. ఈ ప్లాట్‌ఫామ్ చిన్న నిర్మాతలకు, పేదల పాలిట పెన్నిధి. ఏపీ సీఎం జగన్‌గారి విజన్ చాలా పెద్దది. సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి కోసం మంచి ఆలోచన చేశారు. చిన్న నిర్మాతలకు గొప్ప అవకాశం ఇచ్చినందుకు సినీ ఇండస్ట్రీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం'' అన్నారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, ఏపీ కల్చరల్ కమిటీ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడారు.

నంది అవార్డు గురించి మాట్లాడితే తిట్టారు
– పోసాని కృష్ణమురళి

ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ – "నేను రైటర్‌గా ఉన్నప్పుడే ఫలానా సినిమాలకు అవార్డులు ఇవ్వలేదని మాట్లాడాను. కొందరు నన్ను తిట్టారు. ఎన్టీఆర్ 'టెంపర్' సినిమాలోని నటనకుగాను నాకు నంది అవార్డు ఇచ్చారు. తప్పదు అని తప్పక ఇచ్చారు. అది నా కళ్లకు కమ్మ నందిలా కనిపించింది. ఆ నంది అవార్డు నాకు వద్దని చెప్పాను. ఎందుకంటే జ్యూరీలో 12మంది ఉంటే 11మంది కమ్మ వారే. ఇది తెలుగు సినిమా ఇండస్ట్రీ. ఇక్కడ కమ్మవారి డామినేషన్, కాపువాళ్ల డామినేషన్ అన్నట్లుగా మాట్లాడతారు. కానీ లేదు. డబ్బు డామినేషనే ఉంది. నంది అవార్డుల విషయమై ఓ సందర్భంలో జ్యూరీ చైర్మన్ అంబికా కృష్ణను అడిగితే 'వారికి వారే పంచేసుకున్నారు' అన్నారు. గతంలో నంది అవార్డులను ప్రకటించారు. ఎందుకు ఇవ్వలేదో కారణం లేదు. ఇప్పుడు వాటిని మా చేతుల మీదుగా ఇవ్వడం కష్టంగా ఉంది. అందుకని ఇవ్వని సీయంగారితో కూర్చొని పాత నంది అవార్డులు ఇవ్వాలా, అదే సమయంలో సి. కల్యాణ్ వంటి పెద్దలతో కూర్చుని పాత అవార్డులు ఇవ్వాలా? కొత్త అవార్డులతో ముందుకు వెళ్లాలా? అనే కన్‌ఫ్యూజ్‌లో ఉన్నాం. అందుకు కొంచెం సమయం కావాలి'' అన్నారు.

కనిపెట్టాలి.. కొట్టాలి!


రాఘవా లారెన్స్

"కూర్చున్న చోటే స్కెచ్ వేసి మనుషుల్ని లేపేసే వాడివి. నిన్నే వాడు బయటకు లాక్కొచ్చాడంటే వాడెంత తోపై ఉంటాడు'' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'రుద్రుడు' సినిమా ట్రైలర్. దర్శక-నిర్మాత, నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవా లారెన్స్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'రుద్రుడు'. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై స్వీయ దర్శకత్వంలో కదిరేశన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో నిర్మాత 'ఠాగూర్' మధు రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'ఒకడి జీవితంలో ఏవేవి జరగకూడదో అవన్నీ రుద్ర జీవితంలో జరిగాయి', 'మావ.. మన చుట్టూ పెద్దగా ఏదో జరుగుతోంది రా.. మనమే వెతకాలి. మనమే కనిపెట్టాలి. మనమే కొట్టాలి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. "కుటుంబంతో సంతోషకరమైన జీవితాన్ని గడుపుతుంటాడు లారెన్స్. తనకి ఇష్టమైన అమ్మాయి ప్రియా భవానీ శంకర్‌ని పెళ్లి చేసుకుంటాడు. అయితే, శరత్‌కుమార్ అతని లైఫ్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో కష్టాలు మొదలవుతాయి. అయినప్పటికీ దృఢంగా నిలబడి, క్రిమినల్‌ని పట్టుకోవాలని నిర్ణయించుకుంటాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం సాగుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.


నయనతార
అఖిల్

పదేళ్ల తర్వాత...


జై

హీరో జై, హీరోయిన్ నయనతార పదేళ్ల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. నయనతార ప్రధాన పాత్రలో నీలేష్ కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతూ ఓ సినిమా తెరకెక్కనుంది. ఇది నయనతార కెరీర్‌లో 75వ సినిమా కావడం విశేషం. కాగా ఈ సినిమాలో యాక్టర్ జై నటిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. 2013లో అట్లీ దర్శకత్వంలో వచ్చిన 'రాజా రాణి' చిత్రం తర్వాత జై, నయనతార కలిసి మళ్లీ ఈ చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

ఏజెంట్ రెడీ

వేసవికి థియేటర్స్‌కు రానున్నాడు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. మలయాళ నటుడు మమ్ముట్టి కీలక పాత్రధారి. అనిల్‌సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు అఖిల్ బర్త్ డే (ఏప్రిల్ 8). ఈ సందర్భంగా 'ఏజెంట్' కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, ముందుగా అనుకున్నట్లుగానే ఈ సినిమాను ఏప్రిల్ 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, సహనిర్మాతలు: అజయ్ సుంకర, దీపా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్	నిఫ్టీ
144 ▲	42 ▲
59,833	17,599

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,088	▲ 91
డోజోన్స్	33,485	▲ 3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,742	▲ 79
డాక్స్	15,598	▲ 78
షాంఘై	3,328	▲ 15
నికాయ్	27,518	▲ 46

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఐటీలో నియామకాలకు 6 నెలలు బ్రేక్

- హైరింగ్‌పై వేచి చూసే ధోరణిలో కంపెనీలు
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులే కారణం
- పరిశ్రమ వర్గాల అంచనా



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఐటీ కంపెనీలు నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఆరు నెలల పాటు హైరింగ్‌కు కాస్త విరామం ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలను చూస్తే ప్రతి త్రైమాసికంలోనూ నికర నియామకాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయని, రాబోయే రోజుల్లోనూ కొన్నాళ్ల పాటు ఇదే ధోరణి కొనసాగవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అంతక్రితం ఏడాది జోరుగా రిక్రూట్ చేసుకున్నప్పటికీ ప్రస్తుతం డిమాండ్ మాత్రమే కీలకాంశంగా మారిందని పేర్కొన్నాయి. మూడో త్రైమాసికంలోనే నియామకాలు తక్కువ స్థాయిలో ఉండగా.. నాలుగో త్రైమాసికంలోనూ దాదాపు అదే రకమైన ట్రెండ్ నెలకొందని టీమ్‌లీజ్ డిజిటల్ వర్గాలు వివరించాయి. చాలామటుకు కంపెనీలు వేచి చూసే ధోరణిలో ఉన్నాయని పేర్కొన్నాయి. ఎక్స్‌ఫెనో జాబ్ రిపోర్ట్ ప్రకారం మార్చి త్రైమాసికంలో ఉద్యోగావకాశాలు గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 56 శాతం క్షీణించాయి. మరికొద్ది రోజుల్లో కంపెనీలు నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించడం మొదలుపెట్టనున్న నేపథ్యంలో ఈ అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బ్యాంకింగ్ కష్టాలు.

అంతర్జాతీయంగా బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు కూడా ఐటీ రంగంలో నియామకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఎక్కువగా బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) సంస్థలకు సేవలు అందించే దేశీ ఐటీ కంపెనీల్లో హైరింగ్ మందగించింది. ఈ పరిస్థితి నెమ్మదిగా మారనున్నప్పటికీ, కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నాళ్లలో మాత్రం ఆ ప్రభావాలు అలాగే కొనసాగవచ్చని ఎక్స్‌ఫెనో సహవ్యవస్థాపకుడు అనిల్ ఎథనూర్ పేర్కొన్నారు. గత రెండు త్రైమాసికాలుగా హైరింగ్‌పై కాస్త సానుకూలంగా ఉన్నా, ఇంటర్వ్యూ చేసిన అభ్యర్థులను తీసుకునే విషయంలో మాత్రం కంపెనీలు ముందుకు వెళ్లడం లేదని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో సునీల్ చెమ్మన్‌కొటిల్ తెలిపారు. ఆయా సంస్థలు వేచి, చూసే ధోరణి పాటిస్తున్నాయని, ఈ త్రైమాసికంలో నియామకాల పరిస్థితి ఆశావహంగా ఉండకపోవచ్చని పేర్కొన్నారు. తొలి ఆరు నెలల్లో నికరంగా నియామకాలు 40% తగ్గొచ్చని భావిస్తున్నట్లు వివరించారు. బ్యాంకింగ్ సంక్షోభం కారణంగా క్యూ4లో కంపెనీల ప్రణాళికలు మారిపోయాయని, హైరింగ్‌పై దాని ప్రభావం పడిందని కెరియర్‌నెట్ సీఈవో అన్షుమన్ దాస్ చెప్పారు. వాస్తవానికి అంతక్రితం త్రైమాసికంలో ఐటీ కంపెనీలు హైరింగ్‌ను ప్రారంభించడంపై సానుకూల యోచనల్లోనే ఉన్నప్పటికీ .. బ్యాంకింగ్ సంక్షోభంతో పెద్దగా రిక్రూట్‌మెంట్ తలపెట్టలేదని వివరించారు. ఈ నేపథ్యంలో తొలి ఆరు నెలలు హైరింగ్ అంత ఆశావహంగా కనిపించడం లేదన్నారు. పరిస్థితులపై ఇంకా స్పష్టత రానందున కంపెనీలు వేచి చూసే ధోరణే కొనసాగించవచ్చని.. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం కాస్త మెరుగ్గా ఉండవచ్చని దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

2.5 లక్షలకు పరిమితం కావచ్చు..

దేశీ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా క్యూ1లో 59,704, క్యూ2లో 34,713 మందిని రిక్రూట్ చేసుకోగా క్యూ3లో ఇది ఏకంగా 4,904కి పడిపోయింది. 2022 ఆర్థిక సంవత్సరంలో ఐటీ, బీపీవో సర్వీసుల విభాగంలో నికరంగా 4.80 లక్షల నియామకాలు జరగ్గా, 2023 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.80 లక్షల స్థాయిలో ఉండొచ్చని హాన్ డిజిటల్ సీఈవో శరణ్ బాలసుందరమ్ తెలిపారు. ప్రస్తుత ధోరణులను బట్టి చూస్తే 2024 ఆర్థిక సంవత్సరంలో నికర నియామకాలు సుమారు 2.5 లక్షల స్థాయిలో ఉండొచ్చని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొన్ని కంపెనీలు తాము ఇచ్చిన ఆఫర్లకు కట్టుబడి ఉండొచ్చని, మరికొన్ని వాటిని రద్దు చేసుకునే అవకాశం ఉందని బాలసుందరమ్ చెప్పారు. 2021 ఆర్థిక సంవత్సరంలో హైరింగ్ అంతగా జరగకపోవడం, కోవిడ్ పరిస్థితులపరమైన డిమాండు కారణంగా 2022 ఆర్థిక సంవత్సరంలో నియామకాలు భారీగా జరిగాయని ఆయన చెప్పారు. ఆ ఒక్క సంవత్సరాన్ని పక్కన పెడితే ఐటీలో ఏటా 2–3 లక్షల మంది హైరింగ్ సాధారణంగానే ఉంటుందని పేర్కొన్నారు.

మణిపాల్ హాస్పిటల్స్‌లో షియర్స్‌కు మెజారిటీ వాటా

సంస్థ విలువ రూ. 42,000 కోట్లు



న్యూఢిల్లీ: మణిపాల్ హాస్పిటల్స్‌లో మెజారిటీ వాటాలు దక్కించుకునే దిశగా షియర్స్ హెల్త్‌కేర్ ఇండియా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. హెల్త్‌కేర్ రంగంలో ఇదే అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ డీల్ కాగలదని పరిశ్రమవర్గాలు తెలిపాయి. డీల్‌పై వచ్చే వారం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని వివరించాయి. ఒప్పందం ప్రకారం మణిపాల్ హాస్పిటల్స్ విలువ సుమారు రూ.40,000 కోట్లు – రూ.42,000 కోట్లుగా మదింపు చేసినట్లు పేర్కొన్నాయి. ప్రమోటర్ కుటుంబం, ఇతర ఇన్వెస్టర్లయిన టీపీజీ, ఎన్ఐఐఎఫ్ నుంచి వాటాలు కొనుగోలు చేయడం ద్వారా తన వాటాను పెంచుకునేందుకు షియర్స్ ప్రయత్నాల్లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. మిగతా ఇన్వెస్టర్ల నుంచి 41 శాతం వాటాను కొనుగోలు చేయడం ద్వారా షియర్స్ తన మొత్తం వాటాను 59 శాతానికి పెంచుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వివరించాయి. మణిపాల్ గ్రూప్‌నకు 28 ఆస్పత్రులు, 8,000 పడకలు ఉన్నాయి.

సింగపూర్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం టెమాసెక్‌కు సంబంధించిన హెల్త్‌కేర్ డెలివరీ అసెట్లను షియర్స్ నిర్వహిస్తోంది. షియర్స్‌కు మణిపాల్ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 18 శాతం వాటాలు ఉన్నాయి. దానితో పాటు అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీకి 21%, భారత సార్వభౌమ వెల్త్‌ఫండ్ నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్)కు 8 శాతం వాటాలు ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన హాస్పిటల్ చెయిన్ మెడికా సినర్జీ, మెడాంటా హాస్పిటల్స్ ఆపరేటర్ గ్లోబల్ హెల్త్‌లోనూ షియర్స్ వాటాదారుగా ఉంది.

కొత్తగా 3 కోట్ల యూజర్ల లక్ష్యం

- త్వరలో రూ. 10 వేల లోపు 5జీ ఫోన్
- ఐటెల్ సీఈవో అరిజిత్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ ఐటెల్ ఈ ఏడాది కొత్తగా దాదాపు 3 కోట్ల మంది యూజర్లను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇది 9 కోట్లుగా ఉందని, దీన్ని సుమారు 12 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఐటెల్ మాతృసంస్థ ట్రాన్షన్ ఇండియా సీఈవో అరిజిత్ తాలపత్ర తెలిపారు. తాజాగా అధిక సామర్థ్యాలు గల ఎ60, పీ40 స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టడం, బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్‌ను నియమించుకోవడం వంటి అంశాలు ఇందుకు దోహదపడగలవని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపార విస్తరణ క్రమంలో టీవీలు, ట్యాబ్లెట్లు వంటి విభాగాల్లోకి కూడా ప్రవేశించినట్లు వివరించారు. 5జీ సేవల విస్తరణ నేపథ్యంలో తాము కూడా ఈ ఏడాది మూడు లేదా నాలుగో త్రైమాసికం నాటికి 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు అరిజిత్ చెప్పారు. దీని ధర రూ. 10 వేల లోపే ఉంటుందని పేర్కొన్నారు.

మేడిన్ ఇండియాపై మరింతగా దృష్టి.: ఫీచర్ ఫోన్లు, అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్లను అందించడంపైనా.. దేశీయంగా తయారీపైనా ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అరిజిత్ చెప్పారు. దేశీయంగానే లభ్యమయ్యే పరికరాలు, విడిభాగాలను కొనుగోలు చేయడాన్ని పెంచుకుంటున్నట్లు వివరించారు. నోయిడాలో తమకు మూడు తయారీ ప్లాంట్లు ఉన్నాయని, వీటిలో దాదాపు 4,000 మంది సిబ్బంది పనిచేస్తున్నారని అరిజిత్ చెప్పారు. కోవిడ్‌పరమైన సవాళ్ల కారణంగా కొంతకాలం సెమీకండక్టర్ల కొరత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం రూ. 10 వేల లోపు ఫోన్ల సెగ్మెంట్లో తమకు 25 శాతం పైగా మార్కెట్ వాటా ఉందన్నారు. మొత్తం స్మార్ట్‌ఫోన్లకు సంబంధించి రూ. 8 వేల లోపు విభాగంలో తాము 12% వాటా దక్కించుకున్నామని అరిజిత్ చెప్పారు. తమ ఆదాయాల్లో దక్షిణాది మార్కెట్ వాటా 20% ఉంటుందని ఆయన చెప్పారు. ట్రాన్షన్ సంస్థ ఐటెల్, ఇన్ఫినిక్స్, టెక్నో బ్రాండ్ల పేరిట మొబైల్ ఫోన్లను విక్రయిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-4-2023	
విశాఖ	420–00
చిత్తూరు	428–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395–00
విజయవాడ	395–00
రిటైల్ ధర (డజను)	66.00
7-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	370–00
వరంగల్	372–00
రిటైల్ ధర	4.30

రాందేవ్ బాబా సేవలు ప్రశంసనీయం: అమిత్ షా



హరిద్వార్: భారతీయ వేద విద్య, సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించేందుకు రాందేవ్ బాబా చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. హరిద్వార్‌లోని యోగా గురు బాబా రాందేవ్ ఆధ్వర్యంలో చేపట్టిన 2వ సన్యాస్ దీక్షా మహోత్సవం సందర్భంగా ఆయన పతంజలి యూనివర్సిటీ కొత్త భవనాన్ని ప్రారంభించారు. ''గడిచిన పాతికేళ్లలో యోగ, ఆయుర్వేద, స్వదేశీ పరిశ్రమకు రాందేవ్ బాబా గణనీయమైన సేవలు అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో విద్యా రంగంపై దృష్టి సారించారు. రానున్న రోజుల్లో పతంజలి గ్రూప్ దేశాభివృద్ధికి ఎంతోగానూ తోడ్పడుతుంది'' అని అన్నారు. పతంజలి యూనివర్సిటీ, భారతీయ శిక్షా బోర్డు ద్వారా ప్రాచీన విద్యను నేటి తరానికి అందించి ఉత్తమ సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేస్తామని రాందేవ్ బాబా తెలిపారు.

గ్యాస్ రేటుపై పరిమితులు



న్యూఢిల్లీ: కొత్త ధరల విధానం ప్రకారం ఏప్రిల్ నెలలో మిగతా కాలానికి (8 నుంచి 30వ తేదీ వరకు) సహజ వాయువు (గ్యాస్) రేటును యూనిట్‌కు రూ. 7.92గా కేంద్రం నిర్ణయించింది. అయితే, సాధారణ వినియోగదారులపై భారం పడకుండా రెండేళ్ల పాటు (2025 మార్చి 31 వరకు) నామినేషన్ క్షేత్రాల నుంచి ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా ఉత్పత్తి చేసే గ్యాస్‌కు మాత్రం 6.5 డాలర్ల రేటు మాత్రమే వర్తించేలా ఫార్ములాను సవరించింది. ప్రస్తుత ధరలతో పోలిస్తే ఈ రేట్లు దాదాపు పావు శాతం తక్కువ. దానికి అనుగుణంగా సీఎన్‌జీ, పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్ ధర సుమారు 10 శాతం వరకు తగ్గనుంది. మరోవైపు, గ్యాస్ ధర విధానాన్ని సవరించడం ద్వారా సాధారణ వినియోగదారులతో పాటు రవాణా రంగానికి కూడా ఊరట లభించగలదని వాహనాల తయారీ సంస్థల సమాఖ్య సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ తెలిపారు.



ఫైనల్లో తీర్థ శశాంక్ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) పురుషుల టోర్నీ డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన మాచర్ల తీర్థ శశాంక్-గంటా సాయికార్తీక్ రెడ్డి జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం చెన్నైలో జరిగిన సెమీఫైనల్లో తీర్థ శశాంక్-సాయికార్తీక్ రెడ్డి ద్వయం 4-6, 6-3, 10-4తో 'సూపర్ టైబ్రేక్'లో ఒర్లావ్ వ్లాదిస్లావ్ (ఉక్రెయిన్)-ప్యాట్రిక్ ఎడ్వర్డ్ (అమెరికా) జోడీపై విజయం సాధించింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తీర్థ శశాంక్-సాయికార్తీక్ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో విష్ణువర్ధన్-నితిన్ కుమార్ సిన్హా (భారత్)లతో తీర్థ శశాంక్-సాయికార్తీక్ తలపడతారు. రెండో సెమీఫైనల్లో విష్ణువర్ధన్-నితిన్ జోడీ 4-6, 6-3, 10-4తో టాప్ సీడ్ లొమాకిన్ (కజకిస్తాన్)-పెరెజ్ (స్పెయిన్) జంటను ఓడించింది.

సెమీస్‌లో ప్రియాన్షు



న్యూఢిల్లీ: ఓర్లియాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత యువతార ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం ఫ్రాన్స్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్ ప్రియాన్షు 21–18, 21–18తో 61వ ర్యాంకర్ చియు జెన్ (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. తద్వారా తన కెరీర్‌లో తొలిసారి సూపర్-300 స్థాయి టోర్నీలో సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల ప్రియాన్షు హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ఎన్‌హాట్ న్యూయెన్ (ఐర్లాండ్)తో ప్రియాన్షు తలపడతాడు.

బంగ్లాదేశ్ విజయం

ముష్ఫికర్ అజేయ అర్ధ సెంచరీ



మిర్పూర్: ఐర్లాండ్ జట్టుతో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐర్లాండ్ నిర్దేశించిన 138 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 27.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన ముష్ఫికర్ రహీమ్ (48 బంతుల్లో 51 నాటౌట్; 7 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లో అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 177 పరుగులు చేసిన ముష్ఫికర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (31; 3 ఫోర్లు), లిటన్ దాస్ (23; 3 ఫోర్లు, 1 సిక్స్), మోమినుల్ హక్ (20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 286/8తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ మరో ఆరు పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయి 292 పరుగులవద్ద ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ నాలుగు, ఇబాదత్ హుస్సేన్ మూడు వికెట్లు పడగొట్టారు. 2017లో టెస్టు హోదా పొందిన ఐర్లాండ్ ఇప్పటి వరకు నాలుగు టెస్టులు ఆడి నాలుగింటిలోనూ ఓడిపోయింది.

సన్‌'రైజ్' కాలేదు!



- హైదరాబాద్‌కు రెండో ఓటమి
- 5 వికెట్లతో లక్నో విజయం
- కృనాల్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన

లక్నో: సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఐపీఎల్ సీజన్‌లో రెండో మ్యాచ్ కూడా కలిసి రాలేదు. సొంతగడ్డపై మొదటి మ్యాచ్‌లో ఓడిన జట్టు ఇప్పుడు సమష్టి వైఫల్యంతో ప్రత్యర్థి వేదికపై పరాజయాన్ని మూటగట్టుకుంది. శుక్రవారం జరిగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (41 బంతుల్లో 34; 4 ఫోర్లు), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (26 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం లక్నో 16 ఓవర్లలో 5 వికెట్లకు 127 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (31 బంతుల్లో 35; 4 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టును గెలిపించారు.

బ్యాటింగ్ వైఫల్యం...

ఆటగాళ్లు మారినా, సన్‌రైజర్స్ ఆట మారలేదు. మొదటి మ్యాచ్ ఓటమి నుంచి ఆ జట్టు పాఠాలు నేర్చుకున్నట్లుగా లేదు. దాదాపు అదే తరహాలో పేలవ బ్యాటింగ్‌తో మరోసారి టీమ్ సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (8) మళ్లీ విఫలం కాగా, అన్‌మోల్ కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 43 పరుగులకు చేరింది. అయితే కృనాల్ వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్ రైజర్స్‌ను దెబ్బ తీసింది. అన్‌మోల్‌ను ఎల్బీగా అవుట్ చేసిన కృనాల్ తర్వాతి బంతికి కెప్టెన్ మార్క్‌రమ్ (0)ను వెనక్కి పంపాడు. హైదరాబాద్ టీమ్‌కు సారథిగా బరిలోకి దిగిన మొదటి మ్యాచ్‌లో మార్క్‌రమ్ తొలి బంతికే వెనుదిరగాల్సి వచ్చింది. హ్యారీ బ్రూక్ (3) కూడా ప్రభావం చూపలేకపోవడంతో స్కోరు 55/4కు చేరింది. ఈ దశలో త్రిపాఠి, వాషింగ్టన్ సుందర్ (16) కలిసి కొద్దిసేపు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే లక్నో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు రావడం కష్టంగా మారిపోవడంతో బంతులు వృథా అయ్యాయి. వీరిద్దరు ఐదో వికెట్‌కు 39 పరుగులు జత చేసినా... ఏకంగా 50 బంతులు తీసుకొని మూడే ఫోర్లు కొట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయిన సన్ టీమ్ అతి కష్టమ్మీద వంద పరుగులు దాటగలిగింది. చివర్లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంగా పరుగులు జోడించగలిగాడు.

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో ఆరంభంలో లక్నో కొంత తడబడింది. పవర్‌ప్లేలో 45 పరుగులు చేసిన ఆ జట్టు మేయర్స్ (13), దీపక్ హుడా (7) వికెట్లు కోల్పోయింది. అయితే రాహుల్, కృనాల్ భాగస్వామ్యం టీమ్‌ను విజయానికి చేరువ చేసింది. వీరిద్దరు ప్రశాంతంగా ఆడుతూ పరుగులు రాబట్టారు. ఈ ద్వయం మూడో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించారు. వీరిద్దరితో పాటు షెఫర్డ్ (0)ను తక్కువ వ్యవధిలో సన్‌రైజర్స్ వెనక్కి పంపగలిగినా... అప్పటికే జెయింట్స్ విజయం దాదాపు ఖాయమైంది.



ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
లక్నో	3	2	1	4	1.358
గుజరాత్	2	2	0	4	0.700
పంజాబ్	2	2	0	4	0.333
కోల్‌కతా	2	1	1	2	2.056
రాజస్తాన్	2	1	1	2	1.675
చెన్నై	2	1	1	2	0.036
బెంగళూరు	2	1	1	2	-1.256
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	2	0	2	0	-2.867

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × ఢిల్లీ (మ. గం. 3:30 నుంచి)
ముంబై × చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్‌ప్రీత్ (ఎల్బీ) (బి) కృనాల్ 31; మయాంక్ (సి) స్టొయినిస్ (బి) కృనాల్ 8; త్రిపాఠి (సి) మిశ్రా (బి) యష్ 34; మార్క్‌రమ్ (బి) కృనాల్ 0; బ్రూక్ (స్టంప్) పూరన్ (బి) బిష్ణోయ్ 3; సుందర్ (సి) హుడా (బి) మిశ్రా 16; సమద్ (నాటౌట్) 21; రషీద్ (సి) హుడా (బి) మిశ్రా 4; ఉమ్రాన్ (రనౌట్) 0; భువనేశ్వర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 121. వికెట్ల పతనం:** 1–21, 2–50, 3–50, 4–55, 5–94, 6–104, 7–108, 8–109. **బౌలింగ్:** మేయర్స్ 1–0–5–0, ఉనాద్కట్ 3–0–26–0, కృనాల్ 4–0–18–3, యష్ 3–0–23–1, బిష్ణోయ్ 4–0–16–1, హుడా 1–0–8–0, అమిత్ మిశ్రా 4–0–23–2.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) మయాంక్ (బి) ఫజల్ 13; రాహుల్ (ఎల్బీ) (బి) రషీద్ 35; హుడా (సి అండ్ బి) భువనేశ్వర్ 7; కృనాల్ (సి) అన్‌మోల్‌ప్రీత్ (బి) ఉమ్రాన్ 34; స్టొయినిస్ (నాటౌట్) 10; షెఫర్డ్ (ఎల్బీ) (బి) రషీద్ 0; పూరన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (16 ఓవర్లలో 5 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1–35, 2–45, 3–100, 4–114, 5–114. **బౌలింగ్:** భువనేశ్వర్ 2–0–19–1, సుందర్ 1–0–11–0, ఫజల్ 3–0–13–1, మార్క్‌రమ్ 2–0–14–0, రషీద్ 3–0–23–2, నటరాజన్ 3–0–23–0, ఉమ్రాన్ 2–0–22–1.

ధోని 'సిక్సర్'కు శాశ్వత కీర్తి!





ముంబై: 'ధోని ఫినిషెస్ ఆఫ్ ఇన్ స్టయిల్... మాగ్నిఫిసెంట్ స్ట్రయిక్ ఇన్ టూ ద క్రౌడ్. ఇండియా లిఫ్ట్ ద వరల్డ్ కప్ ఆఫ్టర్ 28 ఇయర్స్'... రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యానం పుష్కర కాలం తర్వాత కూడా అభిమానుల చెవుల్లో మారుమోగుతూనే ఉంది. ముంబైలో ఏప్రిల్ 2, 2011న జరిగిన వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో కులశేఖర బౌలింగ్‌లో ధోని లాంగాన్ మీదుగా సిక్సర్ కొట్టి విజయం ఖాయం చేసిన క్షణం భారతీయుల హృదయాల్లో నిలిచిపోయింది. అతను కొట్టిన షాట్‌కు బంతి వాంఖెడే స్టేడియంలో 'జె' స్టాండ్‌లో పడింది. ఈ ఘనతను చిరస్మరణీయం చేయాలని ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) భావించింది. అందుకే ఆ బంతి పడిన స్థానంలో ఒక స్మారకాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం 'జె' స్టాండ్‌లోని 282–286 నంబర్ల ఐదు సీట్లను తొలగించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టేలా శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ధోని రిబ్బన్ కట్ చేశాడు. ఈ సందర్భంగా ధోనిని సన్మానించి ఎంసీఏ అతడికి జ్ఞాపికను అందజేసింది. గతంలో ఆక్లాండ్‌లో జరిగిన 2015 వరల్డ్ కప్ సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచినప్పుడు న్యూజిలాండ్ బ్యాటర్ గ్రాంట్ ఇలియట్ కొట్టిన సిక్సర్ పడిన సీట్‌ను ప్రత్యేకంగా కనిపించేలా ఆకుపచ్చ రంగు వేసి దానిని 'ఇలియట్ సీట్'గా పేరు పెట్టి కివీస్ బోర్డు గౌరవించింది.

రెండో రౌండ్‌కు భారత్

ఒలింపిక్ ఆసియా మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీ



బిష్కెక్: పారిస్ ఒలింపిక్స్ మహిళల ఆసియా ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు రెండో రౌండ్ దశ మ్యాచ్‌లకు అర్హత సాధించింది. గ్రూప్ 'జి'లో భాగంగా కిర్గిజ్ రిపబ్లిక్‌తో శుక్రవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 4–0తో నెగ్గింది. భారత్ తరఫున సంధ్య రంగనాథన్ (18వ ని.లో, 56వ ని.లో) రెండు గోల్స్ చేయగా, అంజూ (24వ ని.లో), రేణు (85వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. భారత్ గ్రూప్ 'జి' టాపర్‌గా నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మొత్తం 12 జట్ల మధ్య అక్టోబర్‌లో రెండో రౌండ్ జరుగుతుంది.

టాప్లే స్థానంలో పార్నెల్



ముంబై: ఐపీఎల్ టోర్నీ తాజా సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టులో ఇద్దరు కొత్త ఆటగాళ్లు చేరనున్నారు. గాయాల కారణంగా ఆర్‌సీబీ క్రికెటర్లు రీస్ టాప్లే (ఇంగ్లండ్), రజత్ పటిదార్ (భారత్) ఈ టోర్నీ నుంచి వైదొలిగారు. టాప్లే స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వేన్ పార్నెల్... రజత్ పటిదార్ స్థానంలో వైశాఖ్ విజయ్ కుమార్ (కర్ణాటక)లను ఆర్‌సీబీ జట్టు కొనుగోలు చేసింది. పార్నెల్‌కు రూ. 75 లక్షలు... విజయ్‌కు రూ. 20 లక్షలు చెల్లించనున్నారు. 33 ఏళ్ల పార్నెల్ దక్షిణాఫ్రికా తరఫున 56 టి20 మ్యాచ్‌లు, ఆరు టెస్టులు, 73 వన్డేలు ఆడాడు. టి20ల్లో 59 వికెట్లు తీశాడు. పార్నెల్ గతంలో 2011 నుంచి 2014 వరకు వరుసగా నాలుగేళ్లు ఐపీఎల్ టోర్నీలో బరిలోకి దిగాడు. ఢిల్లీ, పుణే వారియర్స్, ఆర్‌సీబీ జట్లకు ప్రాతినిధ్యం వహించిన అతను మొత్తం 26 మ్యాచ్‌లు ఆడి 26 వికెట్లు పడగొట్టాడు. విజయ్ దేశవాళీ టి20 క్రికెట్‌లో 14 మ్యాచ్‌లు ఆడి 22 వికెట్లు తీసుకున్నాడు.

'బహుజనుల హక్కును అడ్డుకునే కుట్రలు'



తాడికొండ: కులవాదుల బండారం బయటపడకుండా ఉండేందుకే కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి బహుజనుల హక్కులను అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 922వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని సమానంగా పేదలకు పంచి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారనడంలో సందేహం లేదన్నారు. గత 4 సంవత్సరాల్లో పేదలకు 35 లక్షల ఇళ్ల స్థలాలు అందించడంతో పాటు 25 లక్షల పక్కా ఇళ్లను నిర్మించి పేదలకు ఆవాసం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని చెప్పారు. పేదలకు రాజధానిలో ఇళ్ల పట్టాలు ఇస్తుంటే దళిత దళారులకు ప్యాకేజీలిచ్చి ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయాలని చూస్తుండటం పట్ల పలువురు మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న అన్ని పార్టీల్లోని కులవాదులు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, కానీ వీరి విష ప్రచారాలను ప్రజలు ఎప్పటికీ నమ్మరని అన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

డేటా ట్రాఫిక్ పెరిగిపోతోంది

మొబైల్ డేటా వినియోగంలో భారీగా పెరుగుదల

- ప్రతి వ్యక్తి నెలకు సగటున 19.5 జీబీ వినియోగం
- 2027 నాటికి 46 జీబీకి చేరుకుంటుందని అంచనా
- ప్రపంచంలోనే చౌకైన మొబైల్ డేటా అందిస్తున్న దేశాల్లో ఇజ్రాయెల్ టాప్
- భారత్‌లో ఒక జీబీ డేటా కోసం రూ.13.93 ఖర్చు

సాక్షి, అమరావతి: దేశంలో డేటా ట్రాఫిక్ పెరుగుతోంది. మొబైల్ వినియోగంలో భారీ పెరుగుదల నమోదవుతోంది. గడచిన ఐదేళ్లలో ఏకంగా 3.2 రెట్లు వృద్ధి చెందింది. ప్రస్తుతం సగటున ఒక వ్యక్తి నెలకు 19.5 జీబీ డేటా ఖర్చు చేస్తుండగా.. 2027 నాటికి 46 జీబీకి చేరుకుంటుందని టెలికాం సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంటే... ఒక వ్యక్తి ద్వారా నెలలో 136 శాతం డేటా వాడకం పెరగనుంది. దేశంలో చౌకగా మొబైల్ డేటా లభిస్తుండటంతోపా టు హైస్పీడ్ 5జీ నెట్‌వర్క్ విస్తరణతో డేటా విస్తృతిలో గణనీ యమైన మార్పులొస్తున్నాయి. ఈ క్రమంలోనే భారతీయ సంస్థలు వచ్చే ఐదేళ్లలో ప్రైవేట్ డేటా నెట్‌వర్క్‌ల కోసం సుమారు 240 మిలియన్ డాలర్లను ఖర్చు చేయనున్నాయి.

240 గంటలకు పైగా బ్రౌజింగ్

ప్రపంచ జనాభాలో దాదాపు 65.60 శాతం మందికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. 4.60 బిలియన్ల మంది ఇంటర్నెట్ సౌకర్యాలను ఉపయోగిస్తున్నారు. దేశంలో అయితే 65 కోట్ల మంది స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు 3.5 క్విం టిలియన్ బైట్ల డేటా అవసరం అవుతోంది. భారత్‌లో అయితే, ప్రస్తుతం సగటున నెలకు ఒక వ్యక్తి 240 గంటలకుపైగా ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేస్తున్నారు. ఈ లెక్కన దేశం మొత్తం ఒక నెలకు డేటా వినియోగం 14 ఎక్సాబైట్‌లకు చేరుకుంది. ఇక్కడ ఒక ఎక్సాబైట్ ఒక బిలియన్ గిగాబైట్లకు సమానం.



చౌకైన డేటా!

ప్రపంచ వ్యాప్తంగా చౌకైన మొబైల్ డేటా అందిస్తున్న దేశాల్లో ఇజ్రాయెల్ ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ ఒక జీబీ డేటా కేవలం 0.04 అమెరికన్ డాలర్లుగా ఉంది. యూకే డేటా గణాంకాల వెబ్‌సైట్ నివేదిక ప్రకారం.. ప్రతి నలుగురిలో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు స్మార్ట్‌ఫోను వినియోగిస్తుండటంతో ఇది అమెరికా కంటే ఎక్కువ స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తిని కలిగి ఉంది. తక్కువ రేటుకు మొబైల్ డేటా అందిస్తున్న దేశాల్లో ఇటలీ (0.12 డాలర్లు) రెండవ, భారత్ (0.17 డాలర్లు) మూడవ స్థానంలో ఉన్నాయి.

మరోవైపు అత్యంత ఖరీదైన డేటా ప్లాన్‌లు ఆఫ్రికా, దక్షిణ అమెరికాలోని మారుమూల ద్వీప దేశాల్లో ఉన్నాయి. ఫాక్లాండ్ దీవుల్లో ప్రజలు ఒక జీబీ డేటా కోసం 38.45 డాలర్లను ఖర్చు చేయాల్సి వస్తోంది. సెయింట్ హెలెనాలో అయితే 41.06 డాలర్లుగా ఉంది. ఇక్కడ ప్రజలు ఇజ్రాయెల్ కంటే వెయ్యి రెట్లు ఎక్కువ వెచ్చించి మొబైల్ డేటాను కొనుగోలు చేస్తున్నారు.

భారతదేశంలో పౌరులు నెలకు వినియోగించే సగటు డేటా (జీబీల్లో)..

సంవత్సరం	వినియోగం
2018	9.7
2019	11.2
2020	13.5
2021	17
2022	19.5
2027	46 (అంచనా)

వివిధ దేశాల్లో ఒక జీబీ మొబైల్ డేటా ధరలు (డాలర్లలో)

దేశం	ధర
ఇజ్రాయెల్	0.04
ఇటలీ	0.12
ఇండియా	0.17 (13.93 రూపాయలు)
ఫ్రాన్స్	0.23
చైనా	0.41
స్పెయిన్	0.60
నైజీరియా	0.70
బ్రెజిల్	0.74
యూకే	0.79
జర్మనీ	2.67
జపాన్	3.85
అమెరికా	5.62
స్విట్జర్లాండ్	7.37
సౌత్ కొరియా	12.55
సెయింట్ హెలెనా	41.06

మెరైన్ కమాండోకు కన్నీటి వీడ్కోలు

- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



సైనిక లాంఛనాలతో గోవింద్ మృతదేహాన్ని తీసుకువెళ్తున్న నేవీ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) చందక గోవింద్ (ఫైల్)

చీపురుపల్లిరూరల్: విధి నిర్వహణలో మరణించిన ఇండియన్ నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ (29)కు విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పర్ల గ్రామంలో సైనిక అధికార లాంఛనాల నడుమ అభిమానులు, స్నేహితులు, బంధువులు అంతిమ వీడ్కోలు పలికారు. కోల్‌కతాలో నిర్వహించే పారాచ్యూట్ శిక్షణలో ప్రమాదవశాత్తు బుధవారం సాయంత్రం గోవింద్ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని శుక్రవారం ఉదయం 8 గంటలకు సైనిక్ వాహనంలో గ్రామానికి తీసుకొచ్చారు. గోవింద్ భౌతికకాయం చూసిన తల్లి లక్ష్మి, సోదరి, సోదరులు కన్నీటి పర్యంతమయ్యారు. విశాఖపట్నం తూర్పుతీర నావికాదళ ఉన్నతాధికారులు, సిబ్బంది, జిల్లా రిజర్వ్ పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి వీరసైనికుడికి అంతిమ వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో మరణించిన గోవింద్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తెలిపారు. గోవింద్ తల్లి లక్ష్మిని ఓదార్చారు.

గుంటూరు వైద్యుడికి అంతర్జాతీయ పురస్కారం

వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలో ఫెలోషిప్ అందుకున్న వైద్యుడు



డాక్టర్ నరేంద్ర వెంకటరమణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్యుడికి అంతర్జాతీయ పురస్కారం వరించింది. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలో బ్రిటీష్ రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ గుంటూరుకు చెందిన సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ నరేంద్ర వెంకటరమణకు అసోసియేట్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఫెలోషిప్ (ఏఆర్‌పీఎస్) అందజేసింది. లండన్ కేంద్రంగా పనిచేస్తోన్న రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ..ఫొటోగ్రఫీలో పలు అంశాల్లో కృషి చేసిన వారిని గుర్తిస్తూ ప్రతి ఏడాది పురస్కారాలు అందజేస్తోంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 22 ఎంట్రీలు సొసైటీకి వెళ్లగా వారిలో నలుగురికే ఫెలోషిప్ అందజేసింది. ఈ ఏడాది భారత్ నుంచి ఫెలోషిప్ అందుకున్న వ్యక్తిగా..ఏపీ నుంచి ఫెలోషిప్ అందుకున్న తొలి వ్యక్తిగా నరేంద్ర రికార్డు సృష్టించారు. రాయల్ బెంగాల్ టైగర్‌పై చిత్రీకరించిన డాక్యుమెంటరీకి పురస్కారం వచ్చినట్లు నరేంద్ర చెప్పారు. శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని అమ్మాజి పావని మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వరం అడవుల్లో ఏడేళ్ల పాటు 3 తరాలకు చెందిన పులులపై తాను చిత్రీకరించిన డాక్యుమెంటరీకి అంతర్జాతీయ పురస్కారం లభించిందన్నారు. నరేంద్రను గుంటూరుకు చెందిన ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నేతలు ఘనంగా సన్మానించారు.

అశ్వవాహనంపై పట్టాభిరాముడి విహారం



అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతున్న రఘురాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో కోదండ రామయ్య బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారు అశ్వ వాహనాన్ని అధిరోహించి మాడ వీ.ధుల్లో విహరించారు. రాత్రి గ్రామోత్సవం నేత్ర పర్వంగా సాగింది. కోలాటాలు, చిలక నృత్యాలు, చెక్కభజనలు, కేరళ వాయిద్యాల నడుమ వాహన సేవ కనుల పండువగా జరి గింది. కాగా, ఉదయం 8 గంటలకు కాళీయమర్దన అలంకారంలో గ్రామోత్సవం నిర్వహించి, మధ్యాహ్నం సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అలాగే సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు పర్యవేక్షించారు. కాగా, శనివారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు చక్రస్నానం, తిరిగి రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.

శ్రీశారదా పీఠంలో హైకోర్టు న్యాయమూర్తి



స్వరూపానందేంద్ర సరస్వతితో జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు దంపతులు శుక్రవారం వెళ్లారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వహించారు. స్వర్ణ మందిరంలో పీఠాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

అన్నప్రసాదాల తయారీకి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణ

డయల్ యువర్ ఈవోలో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: తిరుమలలోని మాతృశ్రీ వెంగమాంబ భవనంలో భక్తులకు అందించే అన్నప్రసాదాల నాణ్యత మరింత పెంచడానికి గతంలో లాగే మిల్లర్ల నుంచి బియ్యం సేకరించాలని ఆలోచిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవోలో భక్తులతో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఈ నెల 15 నుంచి జూలై 15 వరకు సామాన్యులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వీఐపీ బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300ల దర్శన టికెట్లను తగ్గించినట్లు చెప్పారు. తిరుమలలో 85% గదులు సామాన్యులకే కేటాయిస్తున్నట్లు చెప్పారు. మాడ వీధుల్లో భక్తులకు ఎండ వేడి నుండి ఉపశమనం కల్పించేందుకు చలువ పందిళ్లు, కార్పెట్లు వేసినట్లు తెలిపారు. నారాయణగిరి ఉద్యానవనాలు, ఆలయ పరిసరాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. నారాయణగిరి ఉద్యానవనంలో ఈ నెల 29 నుంచి మే 1 వరకు శ్రీ పద్మావతి శ్రీనివాస పరిణయోత్సవాలను, మే 2 నుంచి 5 వరకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక వసంతోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మార్చిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.120.29 కోట్లు వచ్చినట్లు తెలిపారు.

టెండర్ నిబంధనల రూపకల్పన ప్రభుత్వ పరిధిలోనిది..

- అందులో న్యాయసమీక్షకు పరిమిత ఆస్కారమే ఉంది
- ప్రభుత్వం తనతో వ్యాపారం చేయాలని కోరే ప్రాథమిక హక్కు ఏ వ్యక్తికీ లేదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ తీర్పు
- టెండర్ నోటిఫికేషన్ నిబంధనలపై దాఖలైన పిటిషన్ కొట్టివేత



సాక్షి, అమరావతి: టెండర్ నిబంధనలు, షరతుల రూపకల్పన పూర్తిగా ప్రభుత్వ పరిధిలోని అంశాలని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ విషయంలో న్యాయ సమీక్షకు తక్కువ ఆస్కారం ఉందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఏ వ్యక్తికి కూడా ప్రభుత్వం తనతో వ్యాపారం లేదా వర్తకం చేయాలని కోరే ప్రాథమిక హక్కులేదని స్పష్టంచేసింది. విద్యుత్ బిల్లుల స్కానింగ్, ప్రింటింగ్, స్పాట్ బిల్లుల పంపిణీ నిమిత్తం అధికారులు జారీచేసిన టెండర్ నోటిఫికేషన్ విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. టెండర్ నోటిఫికేషన్‌లోని రెండు నిబంధనలను సవాలుచేస్తూ పీఎమ్మార్ అసోసియేట్స్ యజమాని ఎన్. ఓబులేసు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల తీర్పు వెలువరించారు.

టెండర్ నిబంధనలపై పిటిషన్..

విద్యుత్ బిల్లుల స్కానింగ్, ప్రింటింగ్, స్పాట్ బిల్లుల పంపిణీ నిమిత్తం ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్ఈ టెండర్ నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులోని రెండు నిబంధనలను సవాలు చేస్తూ పీఎమ్మార్ అసోసియేట్స్ యజమాని ఎన్. ఓబులేసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత టెండర్ నోటిఫికేషన్‌లో ఈ షరతులు లేవని, అందువల్ల ఆ నిబంధనలను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని ఆయన కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పి. సాయి సూర్యతేజ వాదనలు వినిపిస్తూ.. పర్యవేక్షణ చార్జీలు 0 శాతం నుంచి 6.5 శాతం వరకు మాత్రమే ఉండేలా టెండర్ వేయాలని, స్పాట్ బిల్లింగ్ పనులను కేవలం ఒక ఈఆర్ఓ పరిధిలో మాత్రమే అప్పగిస్తామన్న నిబంధనలు అన్యాయమన్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి..

ఈ వాదనలను ఏపీఎస్‌పీడీసీఎల్ న్యాయవాది కొవ్వూరి వెంకటరామిరెడ్డి తోసిపుచ్చారు. టెండర్ నిబంధనలు, షరతులు పూర్తిగా అధికారుల పరిధిలోని అంశాలని.. ఇందులో కోర్టుల జోక్యం తగదన్నారు. టెండర్ నోటిఫికేషన్‌లోని అర్హతలను సంతృప్తిపరిచే ఏ వ్యక్తి అయినా టెండర్ దాఖలు చేయవచ్చని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ఏపీఎస్‌పీడీసీఎల్ న్యాయవాది వాదనలతో ఏకీభవించారు. పాత టెండర్‌లో ఇలాంటి నిబంధనలు లేవు కాబట్టి, ప్రస్తుత టెండర్‌లో కూడా అలాంటి నిబంధనలు ఉండటానికి వీల్లేదని పిటిషనర్ చెప్పజాలరన్నారు. టెండర్ నోటిఫికేషన్‌లో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమంటూ ఓబులేసు పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టేశారు.

పోలీసుల అదుపులో 'సంకల్ప సిద్ధి' కీలక నిందితుడు

- డిపాజిట్ నగదుకు ఆర్నెల్లలో రెట్టింపు నగదు ఇస్తామని మోసం
- కేసు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు



మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'సంకల్ప సిద్ధి' కేసులో కీలక నిందితుడు కిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంకల్ప సిద్ధి ఈ కార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో విజయవాడ దుర్గాపురంలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిన విషయం తెలిసిందే. డిపాజిట్ నగదుకు ఆర్నెల్లలో రెట్టింపు నగదు ఇస్తామని ప్రజలను నమ్మించి మోసం చేసిన వైనం నాలుగు నెలల కిందట వెలుగు చూసింది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సంకల్ప సిద్ధి బాధితులున్నారు. అనుమతులు లేకుండా మనీ లాండరింగ్‌కు పాల్పడిన నేపథ్యంలో నిర్వాహకులపై ఎన్టీఆర్ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లోనే పలువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కొంత నగదును రికవరీ చేశారు. అయితే అప్పట్లో పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న సంకల్ప సిద్ధి మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌ను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ఓ గ్రామంలో ఉన్నాడన్న సమాచారంతో రెండు రోజుల కిందట విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అతని కదలికలను పసిగట్టి అదుపులోకి తీసుకుని విజయవాడకు తీసుకొచ్చి విచారిస్తున్నారు. కిరణ్ అరెస్ట్‌తో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. కిరణ్ పట్టుబడటంతో పోలీసులు కేసుకు సంబంధించి దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

రూ.2.66 కోట్ల విలువైన బంగారు నగలు పట్టివేత

- జోయాలుకాస్‌కు చెందినవిగా నిర్ధారణ
- జీఎస్టీ అధికారులకు అప్పగింత



నగలను రవాణా చేస్తున్న బొలెరో వాహనం

బాగేపల్లి: కర్నూలు నుంచి బెంగళూరుకు బొలెరో వాహనంలో తరలిస్తున్న రూ.2.66 కోట్ల విలువైన బంగారు నగలను కర్ణాటకలోని బాగేపల్లిలో ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బాగేపల్లి వద్ద ఎన్నికల అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కర్నూలు నుంచి వచ్చిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 5.85 కిలోల బరువు ఉన్న రూ.2.66 కోట్ల విలువైన నగలు బయటపడ్డాయి. అయితే ఇవి ప్రముఖ నగల విక్రయ సంస్థ.. జోయాలుకాస్‌కు చెందినవని తేలింది. ఈ నగలను కర్నూలు నుంచి విజయవాడకు తరలించాలని రసీదుల్లో ఉండగా బెంగళూరుకు ఎందుకు తరలిస్తున్నారని డ్రైవర్, సెక్యూరిటీ సిబ్బందిని అధికారులు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో చిక్‌బళ్లాపూర్ జిల్లా కలెక్టర్ నాగరాజు, ఎస్పీ నాగేష్ వచ్చి ఘటనపై ఆరా తీశారు. నగలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉండటంతో కేసు నమోదు చేయలేదు. అయితే జీఎస్టీని ఎగ్గొట్టేందుకు యత్నించారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ మేరకు నగలను జీఎస్టీ అధికారులకు అప్పగించారు.

జాతీయ పురస్కారానికి 'ఏపూరు'

- మహిళా స్నేహ పూర్వక పంచాయతీ విభాగంలో ఎంపిక
- 24న రాష్ట్రపతి నుంచి అందుకోనున్న సర్పంచ్

ఆత్మకూర్–ఎస్: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని ఏపూరు గ్రామం మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది. మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో పురస్కారం అందుకున్న ఏపూర్ పంచాయతీ.. తాజాగా జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికవడం విశేషం. గ్రామంలో 958 సభ్యులతో 93 స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకున్నాయి. రూ.3 కోట్ల పెట్టుబడులతో మినీ డెయిరీ, మిల్క్ సెంటర్లు, వివిధ రకాల పిండి మరలను ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థిక పరిపుష్టికి బాటలు వేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ఆత్మరక్షణార్థం సెల్ఫ్ డిఫెన్స్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వందశాతం వ్యాక్సినేషన్, పోషకాహారం అందించడంలో ఏపూర్ గ్రామ పంచాయతీ సత్ఫలితాలు సాధించింది. ఈ నెల 24న పంచాయతీరాజ్ దివస్ రోజు ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి సర్పంచ్ సానబోయిన రజిత ఈ పురస్కారం అందుకోనున్నారు.

రాష్ట్రం నుంచి 8 పంచాయతీలు ఎంపిక

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ (డీడీయూపీఎస్‌వీపీ)కు రాష్ట్రం నుంచి వివిధ విభాగాల కింద 8 పంచాయతీలు ఎంపికయ్యాయి. 23 పంచాయతీలతో జాబితాను కేంద్రానికి పంపగా 8 ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

'టార్ముగ్లీ' యుద్ధ నౌకకు టాటా..!

- మాల్దీవుల నుంచి సేవలందించనున్న భారత యుద్ధ నౌక
- సాగర్ ఒప్పందంలో భాగంగా అప్పగింత
- ఇకపై ఎంసీజీఎస్ హురావీగా మారనున్న టార్ముగ్లీ



ఐఎన్ఎస్ టార్ముగ్లీ

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ నేవీలో విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళంలో ఏడేళ్లుగా సేవలందిస్తున్న ఐఎన్ఎస్ టార్ముగ్లీ యుద్ధ నౌక ఇకపై మాల్దీవుల తరఫున బాధ్యతలు నిర్వర్తించనుంది. మాల్దీవులతో మైత్రి కొనసాగించేందుకు జరిగిన సాగర్ ఒప్పందంలో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. టార్ముగ్లీ యుద్ధ నౌకకు వీడ్కోలు పలికే కార్యక్రమాన్ని విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఎస్ ఆఫ్‌షోర్ వాటర్‌క్రాఫ్ట్‌లకు దీటుగా తయారైన టార్ముగ్లీ నౌకాదళంలో విశిష్ట సేవలందించిందని పేర్కొన్నారు. 2016 మే 23న భారత నౌకాదళంలో ప్రవేశించిన టార్ముగ్లీ యుద్ధ నౌక విశాఖపట్నం నుంచి సేవలు ప్రారంభించింది. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన అత్యంత శక్తిమంతమైన వాటర్ జెట్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌గా టార్ముగ్లీ సేవలందించింది. మాల్దీవుల అమ్ముల పొదిలో చేరనున్న టార్ముగ్లీ.. ఈ ఏడాది మే నుంచి ఎంసీజీఎస్ హురావీగా తిరిగి ఆ దేశం నుంచి విధుల్లో పాల్గొననుంది. ఈ కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నట్లు నౌకాదళ వర్గాలు తెలిపాయి.

సమగ్ర కుల జన గణనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి : అత్యంత వెనకబడిన వర్గాలకు న్యాయంగా రావాల్సిన వాటా నిధులు రావడం లేదని, దామాషాకనుగుణంగా రిజర్వేషన్లు అమలు కావడం లేదని, వారికి పూర్తి న్యాయం జరగాలంటే సమగ్ర కుల జన గణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన బహిరంగ లేఖను శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. కులాల మధ్య ఉన్న అసమానతల నిర్మూలనకు, అణగారిన కులాల అభ్యున్నతికి కులాల వారీగా లెక్కలు అవసరమన్నారు. ఇదిలా ఉండగా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాకపల్లి గ్రామంలో గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసుల లైంగిక దాడి ఘటనలో నిందితులకు శిక్ష పడకపోవడం న్యాయ చరిత్రలో విషాద ఘటనగా భావిస్తున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సరైన దర్యాప్తు జరపని పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిట్‌కు వసంతోత్సవ 'కళా'ధ్వని

- సందడి చేసిన విద్యార్థులు

కాజీపేట అర్బన్:నిట్ వరంగల్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహి స్తున్న మూడు రోజుల వసంతోత్సవాలు స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి పదివేల మంది విద్యార్థులు తరలి వచ్చారు. 55కు పైగా ఈవెంట్స్, ప్రో షోలు, కొరియోగ్రఫీ నైట్స్‌లు నిర్వహించారు. తొలిరోజు విద్యార్థులు ప్రదర్శించిన నుక్కడ్ నాటకం, పాటరీ మేకింగ్, కరవోకే, క్యాసెట్ పెయింటింగ్, వార్ ఆఫ్ డీజేస్, యాంకర్ సుమ, హీరో కార్తికేయ బెదురులంక టీం చిట్‌చాట్‌లతో అలరించింది. కొరియో నైట్‌లో బాలీవుడ్ సింగర్ అదర్ తన గానామృతంతో అలరించాడు.

అన్నం కోసం తన్నులాట

- టెంట్లు కూల్చి.. కుర్చీలు పగులగొట్టి..
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఏర్పాటు చేసిన భోజనాల కార్యక్రమం రసాభాసగా మారింది. చాలామంది భోజనం చేయగా.. సుమారు వందమంది కార్యకర్తలకు సరిపోలేదు. దీంతో కాంపల్లి, సీరోలు బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య గొడవ తలెత్తింది. కొందరు కార్యకర్తలు అన్నం గిన్నె, కూర గిన్నెలను లాక్కునేందుకు ప్రయత్నించగా.. మరికొందరు కార్యకర్తలు వారితో వాగ్వాదానికి దిగారు. ఆగ్రహించిన కొందరు కార్యకర్తలు టెంట్లను కూల్చివేసి కుర్చీలను పగులగొట్టారు. అక్కడే ఉన్న పోలీసులు కల్పించుకుని కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన స్టేజీపై నుంచి కార్యకర్తల ఘర్షణను చూసి నిర్ఘాంతపోయారు. ఈ నెల 5వ తేదీన అయ్యగారిపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలోనూ గ్రామస్తులు కూర గిన్నెలు, అన్నం గిన్నెలు ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లిపోయారు. రెండు ఆత్మీయ సమ్మేళనాల్లో భోజనం విషయంలో గొడవలు జరగడం గమనార్హం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943